## VOICE OF TRUTH INTERNATIONAL VOLUME - 28

# విషయ సూచిక


**దేవుడు**

దేవుడు 9
దేవుడు చూచుచున్నారు 11
క్షమించుటకు సిద్ధముగాయున్న దేవుడు 12
ఈ దేవుడు సదాకాలము మనకు దేవుడైయున్నారు 14

**దేవుని గ్రంథము**

బైబిలును నమ్ముటకు కారణములు 16
విజ్ఞాన శాస్త్రము - బైబిలు 19
కీర్తన 19:1-3 23
వాక్యము యొక్క ఏడు వింతలు 24

**యేసు క్రీస్తు**

మన జీవమైయున్న క్రీస్తు 26
నమ్మశక్యము కాని యేసు 28
వివాదాస్పద క్రీస్తు 30
పునరుత్థానుడైన తరువాత యేసు ఎవరెవరికి కనబడెను? 34

**క్రీస్తు సంఘము**

దేవుని ఆలయము 35
ఇరుకు మార్గము 38
మేము మనుష్యులను ప్రేరేపించుచున్నాము 40
యేసు ఎక్కడ పాలించుచున్నారు? 41

**రక్షణ**

రక్షణ ఎవరికి అవుసరము? 43
నీకు నీవే నిశ్చయించుకో 46
నోవహు దినములు ఎలాగుండెనో...? 48

ఒక క్రొత్త జీవితము 51
అయన ప్రత్యక్షమైనపుడు 53
జయించువానికి 55

క్రైస్తవారాధన

దేవుడు ఆస్వాదించు ఆరాధన 57
దేవుడు ప్రార్ధనలకెట్లు జవాబీయును? 59
ప్రార్ధనలో మాదిరి 61

క్రైస్తవ జీవితము

ప్రభుత్వము యెడల క్రైస్తవుని బాధ్యత 63
మా దినములు లెక్కించుట మాకు నేర్పుము 65
శిష్యత్వపు బాధ్యతలు 68
మీ వలలు వేయుడి 70
పరలోక సహాయము కొరకు ఆవేదన 72

బైబిలు వ్యక్తులు

స్తెఫను 74
సుంకరియైన మత్తయి 75
అతని తండ్రి నీకు తెలుసా? 77
రెవరెండ్ ఎందుకు కాదు? 79

ప్రత్యేకాంశములు

అజాజేలు 80
దేవుడు జతపరచినవి 82
గొర్రెపిల్ల యొక్క జీవ గ్రంధము 85
ఒకడు సర్వలోకమును సంపాదించుకొని... 88
రాజైన మనష్షే 91
సత్యమా, వెర్రితనమా? 96

**Editorials:**

Not Everything is a Test of Fellowship ... 3
The Bride of Christ 6



# Not Everything is a Test of Fellowship

Louis Rushmore

Not everything is a test of fellowship, but some things are, in fact, a test of fellowship. While there are many things in life and in religion that do not matter, there are a number of things, including religious beliefs and practices, that mattered yesterday, matter today, will matter tomorrow and will matter eternally. Hence, mankind must adhere to divine instructions when it involves something that matters in both this life and eternity. ***"0 Lord, I know the way of man is not in himself; It is not in man who walks to direct his own steps"*** (Jeremiah 10:23 NKJV).

Characteristically, humans frequently are given to extremes. Every facet of life demonstrates this (e.g., politics, religion, social organizations, at work, etc.). Some people are too loose with rules and values, while others oppositely are overly strict respecting procedures and beliefs. In the Lord's church, even some Christians **do not try hard enough** to practice biblical instructions, while still other Christians **try too hard** to implement and enforce religious teaching. Those on the left of **biblical center** loose God-given teaching, while ultraconservative brethren essentially make rules where God did not make any. The Gospel of Christ is difficult enough to apply to one's life, and so no one ought to take it upon himself to make it more difficult (Galatians 1 :6-9;

Revelation 22: 18-19).

Regarding members of the church who take a liberal approach to the Scriptures, it is misleading and deceitful for them to presume that they are *more studied* and *more mature* in the Christian faith than those with whom they disagree regarding New Testament teaching. "Oh, we used to believe like you do, but we have studied Scriptures [again] more earnestly, and we are more mature in the faith now." Such self-aggrandizing has become the code words for excuses to introduce instrumental music (and other things, too) into Christian worship, despite the fact that the New Testament specifically defines acceptable music in worship as ***"speaking to one another in psalms and hymns and spiritual songs, singing"*** (Ephesians 5: 19) and ***"teaching and admonishing one another in psalms and hymns and spiritual songs, singing"*** (Colossians 3: 16).

The attitude that whatever is not specifically prohibited in New Testament Scripture is permitted dilutes Christianity to the subjectivity of each individual; it lays aside the authority of God's Word to regulate our lives and to serve as the roadmap from earth to eternity. In addition, limiting the authority of the Bible to direct commands and laying aside apostolically approved examples as well as implied New Testament teaching (from which we are obligated to infer correctly and only what is implied) disarms God's Word of its authority, too.


Notice that Acts 20:7 is an **approved, apostolic example** relative to the day on which (first day of the week) and the frequency of which (weekly) to partake of the Lord's Supper. It is no wonder, then, that those who disregard approved biblical examples have no scruples about not limiting the observance of communion to Sundays, care little about how often it may be observed (monthly, quarterly, semi-annually, annually) or care on what occasion it may be served and eaten (e.g., at a wedding). Notice that for any New Testament command to apply to

anyone now living, a person must **infer** from the scriptural **implication** that some of what was originally spoken or written to a first century audience applies to someone to whom it was not written and whose name does not appear in Scripture. Without implication and inference, none of God's Word would apply to anyone today!

As a final attempt to justify departure from the authority of God's Word (and to quiet dissenters to their apostasy), apostates clamor for tolerance based on Romans 14. This, too, is an abuse of the biblical context. Romans 14 concerns matters over which brethren had differences of **opinion,** not matters that were the subject of divinely-given New Testament doctrine or teaching. It is wholly wrong for anyone to attempt to relegate departure from God-given instruction to merely a matter of opinion.

Departures from the Christian faith were prophesied and warnings abound about the same. ***"For the time will come when they will not endure sound doctrine, but according to their own desires, because they have itching ears, they will heap up for themselves teachers; and they will turn their ears away from the truth, and be turned aside to fables"*** (2 Timothy 4:3-4). ***"Now I urge you, breth-ren, note those who cause divisions and offenses, contrary to the doctrine which you learned, and avoid them. For those who are such do not serve our Lord Jesus Christ, but their own belly, and by smooth words and flattering speech deceive the hearts of the simple"*** (Romans 16:17-18). ***"Whoever transgre-sses and does not abide in the doctrine of Christ does not have God. He who abides in the doctrine of Christ has both the Father and the Son. If anyone comes to you and does not bring this doctrine, do not receive him into your house nor greet him; for he who greets him shares in his evil deeds"*** (2 John 9-11). Not everything is a test of fellowship, but some things are, in fact, a test of fellowship.

✣



# The Bride of Christ

*Jerry Bates*

The Bible uses several images to help us understand the church. Each image reveals certain aspects of it, and none alone can provide a full picture of the church. Perhaps one of the most picturesque images of the church is that of a bride. Paul said in 2 Corinthians 11 :2, ***"For I am jealous for you with godly jealousy. For I have betrothed you to one husband, that I may present you as a chaste virgin to Christ."*** For a few moments let us contemplate some things this image tells us about the church.

The first characteristic is loyalty or commitment. As we all know, when one enters the covenant relationship of marriage, a deep commitment is made and for one to betray that trust and be unfaithful is a difficult act to forgive. Likewise, this illustrates the fidelity a Christian is to have towards Christ. When one becomes a Christian, he makes a commitment to Christ. He enters into a covenant relationship with Christ and belongs to Christ, just as a husband and wife belong to each other. ***"But he who is joined to the Lord is one spirit with Him"*** (1 Corinthians 6: 17). We should value this relationship above any other relationship or possession (Luke 14:26,27).

Secondly and closely related to the above discussion, we enter into a close relationship that is like no other. No relationship on earth is closer than that of a husband and a wife. In Ephesians 5:22-33, Paul used the husband-wife relationship to

describe the church. He said that the wife is to submit to her husband. Today, many women are reluctant to do this; however when one considers the characteristics of the husband to which she submits, it should not be difficult. This husband loved his wife so much that he was willing to die for her. By means of this extended parallel of a husband and a wife, Paul described the bond between a Christian and Christ. The church looks to Christ as her perfect Head. One who loves the church so much that He died for her, so that He can present her to God as a glorious church without spot or blemish (Ephesians 5:25-27). When one truly understands this, it should not be difficult to submit his life to the headship and authority of Christ.

Thirdly, we enjoy the abundant blessings of Christ's love and care. Jesus provides eternal salvation to His church (Ephesians 5:23). He also sustains and nourishes the church (Ephesians 5:29). He provides the lifegiving food and water; thus, we will no longer hunger or thirst (John 4: 13, 14; 6:35). However, all of these spiritual blessings are only available to those who are ***"in Christ"*** or belong to Him (Ephesians 1 :3). Thus, unless we are part of the church or His bride, we cannot enjoy any of these spiritual blessings.

Fourthly, the church enjoys unparalleled promises. A husband and a wife are joined to each other for "better or worse". One never knows what the future holds for a family in this world; however, this uncertainty is not true for the church, because she belongs to the Almighty God who controls the future. Paul in Romans 8: 17 stated that we are joint heirs with Christ. Whatever eternal blessings Christ enjoys, we, as part of His body, will also enjoy. Yes, we may suffer for a while here on this earth, just as Christ suffered; however, Paul continued his analogy by saying that if we suffer with Him, ***"we will also be glorified together. For I consider that the sufferings of this present time are not worthy to be compared with the glory which shall be revealed in us"*** (Romans 8: 17,18). In 2 Corinthians 4: 17, Paul compared our ***"light affliction"*** with the ***"exceeding and eternal weight of glory"***.

Christ Himself promised in Matthew 19:29 that no matter what we sacrifice for Him, we will receive a ***"hundredfold and inherit eternal life"***. We cannot imagine what wonderful blessings and promises that the King of kings and Lord of lords has in store for His bride.

Finally, a bride suggests beauty. This beauty and preciousness is emphasized in Revelation 21 :2, ***"Then I, John, saw the holy city, new Jerusalem, coming down out of heaven from God, prepared as a bride adorned for her husband."*** Nothing exceeds the loveliness of a bride when she is wearing her wedding garments, especially to the bridegroom.

The bride spends much time und money picking out her perfect dress; yet, God prepares the clothes for His bride. "I ***will greatly rejoice in the Lord. my soul shall be Joyful In my God; For he has clothed me with the garments of salvation, He has covered me with the robe of righteousness, as a bridegroom decks himself with ornaments, and as a bride adorns herself with her jewels"*** (Isaiah 61: 10). God's bride is covered with the pure white garments of salvation that God provides. We all know how the bridegroom rejoices when he sees his bride, and that represents how Christ sees His bride. ***"And as the bridegroom rejoices over the bride, so shall your God rejoice over you"*** (Isaiah 62:5). .

Since the church is the bride of Christ and will enjoy all the blessmgs previously described, why should anyone not want to be a part of her? Anyone who thinks the church is unimportant surely doesn't understand the nature of the church. God invites each one of us to enjoy the blessings of being His bride. Through faith in Christ, we are united with Christ in baptism (Romans 6:3-5; Galatians 3:27). ***"For by one Spirit we were all baptized into one body"*** (1 Corinthians 12:13). Thus, we are able to enjoy the lavish promises and blessings that only God can provide for His bride, both here and for all eternity. How can anyone not be interested in becoming the bride of Christ?

# దేవుడు

## (God!)

*-Steven Eckstein*



అద్భుతములకద్భుతము! దేవుడు యేసుక్రీస్తు ద్వారా క్రీస్తు నిబంధనలో ఆయన చేసిన వాగ్దానములను నెరవేర్చుట కొరకు ఆయన తన అసామాన్యమైన శక్తిని వినియోగించును. మానవ జాతి నంతటిని ఆయన సమాదులలో నుండి తిరిగిలేపును, సజీవులైయున్న వారిని రెప్పపాటులో మార్పుచేయును!

(యోహాను 5:27-29, 1కొరి 15:50).

రాబోవుచున్న ఆ యద్భుతమును గూర్చి ఆలోచించుటే మనకు ఊహాతీత మైనది. ప్రపంచమంతటా యున్న అసంఖ్యాకమైన సమాధులలో నున్న వారందరు ఆయన శబ్దము విని తిరిగిలేతురు! ఏ ఒక్కడు విడిచిపెట్ట బడడు! ప్రపంచంలో ఫ్రాన్సు దేశములో ఫ్లాండర్స్ ఫీల్డ్‌లో అతిపెద్ద సమాధుల దొడ్డియున్నది. గాని యేసు మరల వచ్చి నపుడు అది యిక వుండదు. కాల్చివేయ బడినవారు, మృగముల వలన, పక్షుల వలన నాశనమైన వారి శరీరములన్నియు లేపబడును. సముద్రములో పడవేయ బడిన శరీరములన్నియు లేపబడును (ప్రకట 20:13).

దేవుడీ పనిని చేయకపోతే ఆయన దేవుడు కాదు. ఎన్ని బైబిళ్ళు ముద్రిం చినా, ఎన్ని ప్రార్ధనలు చేసినా, ఎన్ని పాటలు పాడినా ఎన్ని మారులు సంఘ ములు కూడుకొనినా, దేవుడు తన వాగ్దానమును నెరవేర్చని యెడల అదంతయు వ్యర్ధమే. దేవుడు తన వాగ్దానమును నెరవేర్చని యెడల మానవుడు మంచి చేసినా, చెడును చేసినా అంతా వ్యర్ధమే.

గాని దేవుడు తాను చెప్పింది తప్పక చేస్తారు. మానవుడు తన కంప్యూటర్ల లోను, పుస్తకములలోను వ్రాసియుంచిన రికార్డులన్నియు దేవుని నీతివంతమైన తీర్పువలన శూన్యముగా అగుపడును. కోట్లకోట్లాది మందిలో ప్రతివాడు తాను చేసిన క్రియల వలన తీర్పు పొందును (ప్రకట 20:12). యోహాను ఈ గంభీర దృశ్యమును ఎంత సింపుల్‌గా చెప్పాడో గమనించుము. "ఎవని పేరైనను జీవ గ్రంథమందు వ్రాయబడినట్లు కనబడని యెడల వాడు అగ్నిగుండములో పడవేయ బడును" (ప్రక 20:15).

ఇంకా అద్భుతములకు అద్భుతం యేమంటే దేవుడు తనవారి నందరినీ రక్షించును (2 తిమో 2:19). గొర్రెపిల్ల జీవ గ్రంథమందు వ్రాయబడిన వారు దేవుని మహోచితమైన కృపవలన ఆత్మీయ శరీరములు అనుగ్రహించబడి దేవునితో నిత్యసహవాసము ననుభవింతురు. విమోచింపబడిన వారు ఆయనను స్తుతింతురు, ఘనపరచుదురు, మహిమ పరతురు, నిత్యము ఆరాధింతురు.. ఆయన ఒక్కడు మాత్రమే స్తుతి పాత్రుడు. దేవుడు సర్వములో సర్వమగును. (1కొరి 15:28).

"దీనికి ఆశ్చర్యపడకుడి, ఒక కాలము వచ్చుచున్నది, ఆ కాలమున సమాధులలో నున్న వారందరు ఆయన శబ్దము విని మేలు చేసిన వారు జీవ పునరుత్థానమున కును కీడు చేసినవారు తీర్పు పునరుత్థాన మునకును బయటకి వచ్చెదరు'' (యోహాను 5:28).

– స్టీవెన్ ఎక్‌స్టెయిన్

# దేవుడు చూచుచున్నారు

## (God is Watching)

*-Chad Ezelle*

"పరపక్షమందుండువాడు మనలను గూర్చి చెడుమాట యేదియు చెప్పనేరక సిగ్గుపడునట్లు అన్నిటియందు నిన్ను నీవే సత్కార్యముల విషయమై మాదిరిగా కనబరచు కొనుము" (తీతు 2:7).

ఎవరు చూడకపోయినా ఒకని ప్రవర్తన కనబడునని ఒకాయన చెప్పారు. అదెంత నిజమో! మనం ఏదైనా తప్పు చేస్తే కుటుంబమునకు, మిత్రులకు, సంఘానికి తెలియకుండే లాగున ప్రయత్నిస్తాము. గాని దేవుడు మాత్రం చూచుచున్నారు. ఆయన సమస్తము ఎరుగును.

నీవు దేవునికి ఇష్టపూర్వకముగా యుండాలంటే ఆయనతో నడువాలంటే, నీవాయన ఆజ్ఞలకు లోబడి యుండుటకు ప్రయత్నించవలెను. దేవుని నిబంధనను బట్టి జీవించాలని కోరుకొనుచున్నపుడు, నీ ప్రవర్తన దానికదియే సరియగును. ఇకమీదట ఇతరులను సంతోషపెట్టుటకు నీవు జీవించవు. దేవుని సంతోషపెట్టు టకు జీవిస్తావు. నీవట్లుచేస్తే నీకంతా మేలు జరుగుతాది.

- ఛాడ్ ఎజెల్

# క్షమించుటకు సిద్ధముగా యున్న దేవుడు
## (Quick to Forgive)

*- Jack Carter*



దైవికంగా యుండుట యనగా దైవిక లక్షణములు కలిగియుండుట యని అర్ధము. మనం అంతా దేవుని వలెయుండలేము గాని ఆయన వలె యుండుకు ప్రయత్నము చేయాలి. మానవ ప్రవర్తనలో దైవిక తత్వము బయలు పరచబడును. మనం ఆయన ఆజ్ఞలు పాటించునపుడు ఆయన మనలో నివసించును గనుక యిది సాధ్యమగును. (యోహాను 14:23)

యోహాను వ్రాసిన మొదటి పత్రిక 4వ అధ్యాయములో ప్రేమను గూర్చి అతడు

చెప్పిన దానిని నేను యిష్టపడుదును. "ఏమానవుడును దేవుని ఎప్పుడును చూచియుండలేదు. మనమొకనినొకడు ప్రేమించిన యెడల దేవుడు మనయందు నిలిచి యుండును. ఆయన ప్రేమ మనయందు సంపూర్ణమగును." (1 యోహా 4:12) దేవుడు ప్రేమించు రీతిగా ప్రేమించుట ఉన్నతమైనది. ఆయన ప్రేమ యొక్క లోతు ఎత్తులను గ్రహించుకొనాలంటే ఆయన గ్రంధమును జాగ్రత్తగా పఠించాలి.

ప్రవక్తయైన మీకా యెషయా యొక్క సమకాలికుడు. దేవుని ప్రజలైన ఇశ్రాయేలీయులు ఆయనకు లోబడనొల్లని ప్రజలైనందున వారి మీదికి రాబోయే కఠిన శిక్షను గూర్చి ఈ యిద్దరు ప్రవక్తలు ప్రవచించిరి. శిక్షింపబడిన తరువాత దేవుని ప్రజలు నూతన పరచబడుటను గూర్చి మీకా గ్రంధము ఆఖరి అధ్యాయము చెప్పుచున్నది. దానిని మీకా ఇట్లు బయలుపర్చాడు!

"తన స్వాస్థ్యమలో శేషించిన వారి దోషమును పరిహరించి, వారు చేసిన అతిక్రమముల విషయమై వారిని క్షమించు దేవుడవైన నీతో సముడైన దేవుడున్నాడా? ఆయన కనికరము చూపుట యందు సంతోషించువాడు గనుక నిరంతరము కోపముంచడు. ఆయన మరల మనయందు జాలి పడును, మన దోషములను అణచి వేయును, వారి పాపములన్నిటిని సముద్రపు అగాధములో నీవు పడవేతువు." (మీకా 7:18-19).

మన దేవుడు పాపములు క్షమించుటకు సిద్ధముగా యున్నందున నేను కృతజ్ఞుడను. నిజానికి మనకున్న నిరీక్షణ అదొక్కటియే. తదుపరి దేవుడు క్షమించురీతిగా క్షమించుట మనకున్న ఒక దీవెన. ఆయన క్షమించునప్పుడు పాక్షికంగా క్షమించరు. ఆయన మన దోషములను అణచివేయును, మన పాపములన్నిటిని సముద్రపు అగాధములో పడవేయును.

దేవుని వలె క్షమించుటకు, ప్రేమించుటకు మనము ఎంతో నేర్చుకొనవలసి యున్నది. దైవికంగా యుండాలంటే గొప్ప సవాలు కాదా? దేవుడు క్షమించుటకు సిద్ధముగా యున్నారు.


– జేక్ కార్టర్.



# ఈ దేవుడు సదాకాలము మనకు దేవుడైయున్నారు

## (This is our God forever and Ever)

*- Charles Box*



"ఈ దేవుడు సదాకాలము మనకు దేవుడైయున్నారు. మరణము వరకు ఆయన మనలను నడిపించును" (కీర్తన 48:14). ప్రతి మానవుడు రక్షించు దేవునిగూర్చిన జ్ఞానము కలిగియుండాలి. మనకు తెలియని దేవుని ప్రేమింపలేము, నమ్మలేము, సేవించలేము, ఆరాధించ లేము. మన విశ్వాసము యొక్క పునాది ఆయన యందలి నమ్మకమే. "దేవుని యొద్దకు వచ్చువాడు ఆయన ఉన్నా డనియు, తన్ను వెదుకు వారికి ఫలము దయచేయుననియు నమ్మవలెను" (హెబ్రీ 11:6).

దేవుని యొక్క కొన్ని లక్షణములను గ్రహించుకొనుట వలన ఆయన యందలి మన విశ్వాసము బలపడును. "ఆయనను ఎరిగియున్న యెడల (సహవాసము చేసిన యెడల) నీకు సమాధానము కలుగును. ఆలాగున నీకు మేలు కలుగును" (యోబు 22:21).

### దేవుడు స్వయం సంభూతుడు

"తండ్రి యేలాగు తనంతట తానే జీవము గలవాడై యున్నాడో ఆలాగే కుమారుడును తనంతట తానే జీవము గలవాడైయుండుటకు కుమారునికి అధికారము అనుగ్రహించెను" (యోహాను 5:26). దేవుడు సృజింప బడిన వ్యక్తి కాదు. అలాగే కుమారుడైన క్రీస్తు కూడా సృజింపబడిన వ్యక్తి కాదు. ఆయన సృష్టికర్త (ఆది కా 1:31). ఆయనకు ఆది లేదు, అంతము కూడా లేదు. ఆయన ఎల్లప్పుడూ ఉన్నవాడు (నిర్గమ 3:14).

## దేవుడు నిత్యుడు

"యెహోవా శాశ్వతముగా సింహాసనాసీనుడైయున్నాడు. న్యాయము తీర్చుటకు ఆయన తన సింహాసనమును స్థాపించియున్నాడు" (కీర్తన 9:7). దేవుడు ఎల్లప్పుడు యుండువాడు, ఎల్లప్పుడు ఉండును. ఆయన నిత్యుడగు తండ్రి. ఆయన మానవులకు నిత్య జీవము ననుగ్రహించును (హెబ్రీ 5:8-9).

## దేవుడు అనంతమూర్తి

దేవునికి సమస్తము తెలుసు, ఎల్ల వేళలా అన్నిచోట్లా యుండు వాడు, సర్వశక్తిమంతుడు. ఆయన సర్వాంతర్యామి (కీర్తన 139) సర్వజ్ఞాని (దానియేలు 2:22). సర్వశక్తిగలవాడు (మత్తయి 19:26). ఆయనను సేవింపుము.

## దేవుడు మార్పులేనివాడు

"యెహోవానైన నేను మార్పులేనివాడను" (మలాకీ 3:6) ఆయన ఆకాశ విశాలమును పరచిన వాడు. అదృశ్యుడు. తన గొప్పశక్తిచేత ప్రపంచములు నిర్మించారు. ఆయన స్వరమును పూర్వ కాలమందు ప్రవక్తలు వినిరి. నేడు తన ఆత్మావేశ లేఖనములు ద్వారా మనతో పలుకుచున్నారు. మనం ఆయన స్వరమును వినాలి. మానవ జీవిత విధానము నంతటిని వారికి తెలియక పోయినను, ఆయనకు సమస్తమును తెలుసు. తన కుమారుడైన యేసుక్రీస్తును సిలువపైఆయన మనకొరకిచ్చారు. ఆయన యందు విశ్వాసముంచితే మనం నిరంతరము జీవించగలము. ఆయన సజీవుడైన దేవుడు. ఆయనయందు మనము బ్రతుకుచున్నాము. చలించుచున్నాము, ఉనికి కలిగియున్నాము, ఆయన నిత్యము వుండు గొప్పదేవుడు.

దేవుడున్నాడు గనుక ఆయనకు విధేయుల మవ్వాలి. క్రైస్తవుడగుటకు నీవు ఆయన వాక్యము వినాలి (రోమా 10:17). యేసు క్రీస్తు దేవుని కుమారుడని నమ్మాలి (యోహాను 8:24), పాపముల విషయం మారుమనస్సు పొందాలి (అపొ.కా. 2:38), క్రీస్తు నందలి విశ్వాసాన్ని నోటితో ఒప్పుకోవాలి (మత్తయి 10:32), పాప క్షమాపణ నిమిత్తము బాప్తిస్మము పొందాలి (అపొ.కా. 22:16).

వరమందొక దేవుడున్నారు. ఆయనకు నీవెందుకు లోబడకూడదు?

– చార్లెస్ బాక్స్



# బైబిలును నమ్ముటకు కారణములు

## (Reasons to Believe the Bible)

***- Garry Hampton***

బైబిలు దైవావేశము వలన కలిగినదని చెప్పుకొనుచున్నది. "దైవజనుడు సన్నద్ధుడై ప్రతి సత్కార్యమునకు పూర్ణముగా సిద్ధపడి యుండునట్లు దైవావేశము వలన కలిగిన ప్రతి లేఖనము ఉపదేశించుటకును, ఖండించుటకును తప్పుదిద్దుటకును నీతియందు శిక్షణ చేయుటకును ప్రయోజనకరమైయున్నది" (2తిమో 3:16, 17). దైవావేశము అను మాట థియోనూస్టాస్ అను గ్రీకు పదమును పౌలు వినియోగించాడు. అనగా దేవుని ఊపిరివలన కలిగిన మాటలని యర్థము.

### దైవావేశము

దైవావేశాన్ని పేతురు ఇట్లు వివరించాడు. "ప్రవచనము ఎప్పుడును మనుష్యుని ఇచ్ఛను బట్టి కలుగలేదు గాని మనుష్యులు పరిశుద్ధాత్మవలన ప్రేరేపింపబడినవారై దేవుని మూలముగ పలికిరి" (2 పేతురు 1:21). దేవుడేమైనా చెప్పగా, మానవుడు దానిని లిఖించాడు. ప్రవక్తల కాలములో దైవావేశము ఇట్లు పనిచేసినది (హెబ్రీ 1:5, 8; 5:5, 6).

పాత నిబంధన లేఖకులు, క్రొత్త నిబంధన లేఖకులు కూడా దైవావేశము వలన వ్రాసినట్లు చెప్పుకొన్నారు. యెషయా 1:1, 2, 10, 24; యిర్మియా 1:1, 2; 2:1; యెహెజ్కేలు 1:1-3; 1థెస్స 2:13; 2పేతురు 3:2). పాత నిబంధన లేఖనములు దైవావేశములని యేసు గమనించారు. అవి అధికార పూరితమైనవని ఆయన గుర్తించారు. (మత్తయి 4:4, 7, 10). పాత నిబంధన ప్రవచనములను నెరవేరుస్తు దేవుని చిత్తమును జరిగించుటకే ఆయన ఈ లోకమునకు వచ్చెను. (మత్తయి 5: 7-18; యోహాను 15:25). పాత నిబంధన లేఖకులు దైవావేశము కలిగిన వారని క్రొత్త నిబంధన లేఖకులు గుర్తించారు. (అపొ.కా. 1:15, 16; 4:25, 28:25-27, గలతీ 3:16-19).

క్రొత్త నిబంధన లేఖకులు కూడా తాము దైవావేశముచే వ్రాయుచున్నట్లు చెప్పుకొన్నారు. అపొస్తులులు పరిశుద్ధాత్మ వలన నడిపించబడుదురని యేసు చెప్పారు (యోహాను 14:25, 26; 16:12,13; హెబ్రీ 2:1-4). పౌలు యొక్క వ్రాతలను గూర్చి పేతురు సవిస్తరముగా ఇట్లు చెప్పాడు: "మరియు మన ప్రభువు యొక్కదీర్ఘశాంతము రక్షణార్థమైనదని యెంచుకొనుడు. అలాగు మన ప్రియ సహోదరుడైన

పౌలు కూడ తనకు అనుగ్రహించబడిన జ్ఞానము చొప్పున మీకు వ్రాసియున్నాడు. వీటిని గూర్చి తన పత్రికలన్నిటిలోను బోధించుచున్నాడు. అయితే వాటిలో కొన్ని సంగతులు గ్రహించుకొనుటకు కష్టమైనవి. వీటిని విద్యాహీనులును, అస్థిరులైన వారును తక్కిన లేఖనములను అపార్ధము చేసినట్లు తమ స్వకీయ నాశనమునకు అపార్ధము చేయుదురు" (2పేతురు 3:15, 16).

## వైజ్ఞానికంగా యదార్థము:

అయితే ఇట్టి అంతరంగ ఆరోపణలు రుజువుకాకపోతే అవి నిష్ప్రయోజనము. గనుక వాటి యదార్థతను మనం పరిరక్షించాలి. బైబిలు దేవుని నుండి కలిగినదని మనము తెలిసికొనగలము ఏలయనగా మానవునికెరుక లేని అనేక వైజ్ఞానిక సంగతులు దానిలో వ్రాయబడియున్నాయి. ఆదికాండము 1:11, 12, 21, 24, 25 వచనాలలో వాటి వాటి జాతి ప్రకారము అనే మాటలు మనకు కనబడ్తాయి. యివి గడ్డి, చెట్లు, చేపలు, పక్షులు, జంతువులు మొ॥గు వాటిని గూర్చి చెప్పబడిన మాటలు. ఇవన్నీ వాటికవే కలిగినవని గాక వాటి వాటి జాతి ప్రకారము వ్యాప్తిజెందునట్లు సృజింపబడెను.

ఎనిమిది దినముల వయస్సు గల శిశువు రక్తములో గాయములను మాన్పు కణములుద్భవించునని ఆధునికంగా వైద్యులు కనుగొన్నారు. గాని కొన్ని వేల సంవత్సరముల క్రితమే మగశిశువులు ఎనిమిదవ దినమున సున్నతి చేయబడ వలెనని మోషే బైబిలు నందు వ్రాసాడు (లేవీ 12:3). అంటు వ్యాధులు కలవారిని ఎడముగా యుంచాలని ఆధునిక వైద్యులు తెలిసికొనకముందు నుండే, బైబిలు లేవీ 13:46లో కుష్టురోగులను ఎడముగా యుండాలని హెచ్చరించింది. "ఆ పొడ వానికి కలిగిన దినములన్నియు వాడు అపవిత్రుడై యుండును, వాడు అపవిత్రుడు గనుక ప్రత్యేకముగా నివసించవలెను." వాని నివాసము పాళెమునకు వెలుపల యుండవలెను. "మరియు అపొడ గల కుష్టురోగి వస్త్రములను చింపివేయవలెను; వాడు తల విరియ బోసుకొనవలెను, వాడు తన పై పెదవి కప్పుకొని అపవిత్రుడను, అపవిత్రుడను అని బిగ్గరగా పలుక వలెను" (లేవీ 13:45). పూర్వమందు అమెరికా అధ్యక్షుడగు జార్జివాషింగ్టన్ కాలములో రక్తము కారిపోతే రోగము పోయేదని తలంచారు, గాని ఇప్పుడైతే రక్తమే ప్రాణమని వైద్యులు అంగీకరిస్తారు. దీనిని మోషే బైబిలులో ఎప్పుడో వ్రాసాడు (ఆది.కా. 9:4; లేవీ 17:11, 14).

నదులన్నియు తమ నీటిని సముద్రములో పడవేయుచున్నట్లు అగుపడుచున్నను, ఈ భూమి ఎందుకు నిండిపోవుటలేదు? అని మనం అడుగవచ్చును. సొలొమోను ద్వారా దేవుడు దానికి జవాబిచ్చారు. "నదు

లన్నియు సముద్రములో పడును; అయితే సముద్రము నిండుటలేదు; నదులు ఎక్కడనుండి పారివచ్చునో అక్కడికే అవి ఎప్పుడు మరలిపోవును. ఎడ తెరపి లేకుండా సమస్తము జరుగుచున్నది. మనుష్యులు దానిని వివరింపజాలరు" (ప్రసంగి 1:7, 8). "మేఘములు వర్షముతో నిండియుండగా అవి భూమి మీద దాని పోయును" (ప్రసంగి 11:3). "సముద్రములను పిలిచి వాటిని భూమి మీద ప్రవహింపజేయు వాడు ఆయనే" యని ఆమోసు కూడ సొలొమోనుతో ఏకీభవించుచున్నాడు (ఆమోసు 9:6).

బైబిలులో అద్భుతములు చేసిన వారు, దేవుని దరుపున చేయుచున్నామని చెప్పుకొనిరి. మోషేదేవుని శక్తి వలన చేయుచున్నట్లు ఇశ్రాయేలీయులు గ్రహించుకొనునట్లు ఆయన మోషేకు సూచకక్రియలు చేసే శక్తినను గ్రహించెను (నిర్గమ 4:1-5). ఐగుప్తు దేశము మీద ఆయన మోషే ద్వారా కలుగుజేసిన పది తెగుళ్ళును, పరమందొక దేవుడున్నాడని, మోషే ఆయన సేవకుడని గుర్తింపు పొందునట్లు వాటిని కలుగజేసెను (నిర్గమ 7:5, 17; 8:10,22; 9:14,29; 10:2; 11:7; 13:3; 14:14). యేసు దేవుని కుమారుడని నిరూపించుట కొరకు ఆయన మృతులలో నుండి లేపబడెను (రోమా 1:4). అపొస్తులులు చేసిన అద్భుత కార్యముల ద్వారా వారు చెప్పేది దేవుని వాక్యమేయని నిర్ధారించబడెను (మార్కు 16:14-20; హెబ్రీ 2:3,4).

## భౌగోళికంగా బైబిలు యదార్థము:

బైబిలు భౌగోళికముగా యదార్థము. బైబిలు చెప్పు ప్రదేశములు, స్థలములు, పట్టణములు యదార్థము. యేసు ఒక ఉపమానము చెప్పెను. "ఒక మనుష్యుడు యెరూషలేము నుండి యెరికో పట్టణమునకు దిగివెళ్ళుచు దొంగల చేతిలో చిక్కెను; వారు అతని బట్టలు దోచుకొని అతని కొట్టి కొన ప్రాణములతో విడిచిపోయిరి'' (లూకా 10:30). యెరూషలేము కొడప్రాంతము, అక్కడ ఒలీవకొండ 2680 అడుగులు ఎత్తు కలది. యెరికో అయితే మృత సముద్రము ముఖద్వారమున యుండెను. గనుక ఒకడు యెరూషలేము నుండి యెరికో పోవాలంటే దిగి వెళ్ళవలసినదే.

బైబిలు యదార్థతను నిరూపించుట కొరకు మిగతా కొన్ని సంగతులు కూడా చెప్పుకొనవచ్చును. అది చారిత్రాత్మకంగా వాస్తవము. దానిలో 66 పుస్తకములు 1600 సంవత్సరముల కాలములో వ్రాయబడినను, 40 మంది లేఖకులు అందుకొరకు వినియోగింపబడినను, దానిలో గొప్ప ఐక్యత ఉన్నది. దాని వర్తమానము గొప్పది. గనుక బైబిలు యదార్థము. నిజంగా అది దేవుని ఊపిరి వలన కలిగిన గ్రంథము.

– గేరీ హేంప్టన్



# విజ్ఞాన శాస్త్రము - బైబిలు
# (The Bible and Science)

***- Joshua Gootam***

ఆధునిక విజ్ఞానశాస్త్ర సంగతులు బైబిలుతో సమైఖ్యతను కలిగియున్నవా? నిజానికి బైబిలు విజ్ఞాన శాస్త్రపు అచ్చు పుస్తకం కాదు.

దైవజనుడు సన్నద్ధుడై ప్రతి సత్కార్యమునకు పూర్ణముగా సిద్ధపడి యుండునట్లు అందున్న ప్రతి లేఖనము ఉపదేశించుటకును, ఖండించుటకును, తప్పు దిద్దుటకును, నీతియందు శిక్ష చేయుటకును ప్రయోజనకరమై యున్నది. (2 తిమో 3:16, 17). గనుక మానవులకు సత్ప్రవర్తనను గరవుటయే బైబిలు యొక్క ముఖ్యోద్ధేశముగాని, విజ్ఞాన శాస్త్రమును తరుచుట కాదు.

అయితే బైబిలు గ్రంథము ప్రపంచమందున్న సమస్త సంగతులను తరుచున్నది. గంభీర విజ్ఞానిచే నిర్మించ బడిన విశ్వములో మనము ఉనికిని కలిగియున్నాము గనుక బైబిలులో కూడ వైజ్ఞానిక శాస్త్ర సంగతులు లేకపోలేదు. ఆధునిక విజ్ఞాన శాస్త్రముతో బైబిలు ఐక్యత జెందుటలేదు అని కొందరు బైబిలు వ్యతిరేకులు, విజ్ఞానశాస్త్ర పరిజ్ఞానము లేనివారు చెప్పుచుందురు.

## శాస్త్రము - సిద్ధాంతము

విజ్ఞాన శాస్త్రముతో బైబిలు ఐక్యత కలిగియున్నదో లేదో తెలిసికొనకముందు విజ్ఞానశాస్త్రము (Science) అనగా ఏమిటో మనము ఎరుగవలెను. నిరూపించదగునట్టి పరిపూర్ణ విజ్ఞానమే 'విజ్ఞానశాస్త్రము' అని క్లుప్తముగ మనము చెప్పుకొనవచ్చును. అయితే విజ్ఞాన శాస్త్రపు పేరున అనేక సిద్ధాంతము లను (Scientific Theories) శాస్త్రవేత్తలు ప్రవేశపెట్టవచ్చును. అవి పరిపూర్ణములని నిరూపింపబడు వరకు అవి సిద్ధాంత ములు (లేక శాస్త్రవేత్తల ఊహలు) గానే పరిగణింపబడును గాని విజ్ఞాన శాస్త్రముగా పరిగణింపబడవు. అట్టి సిద్ధాంతములలో నిరూపింపబడ కుండా అనేక చిల్లులతో నేటి వరకును నిండియున్నది పరిణామ సిద్ధాంతమొకటి. అందువలన మానవులు ప్రవేశపెట్టిన సిద్ధాంతములతో గాక, పరిపూర్ణ విజ్ఞానమని నిరూపింపబడిన విజ్ఞాన శాస్త్రముతో బైబిలు ఐక్యత జెందియున్నది. బైబిలు లేఖకులు దేవుని ఆత్మ ప్రేరేపణచే వ్రాసిరి గనుక ఆనాటి మానవజ్ఞానమున కందని గంభీర వైజ్ఞానిక శాస్త్ర పలుకు

లనేకములను వారు బైబిలునందు లిఖించిరి. అట్టి వానిలో కొన్నింటిని యిప్పుడు మనము పరిశీలింతుము.

## బైబిలు మొదటి వచనము

18వ శతాబ్దపు అంతమందు హెర్బర్ట్ స్పెన్సర్ అను నాస్తికుడు, "మానవ జ్ఞానమునకు అందనట్టి అయిదు సృష్ట సంగతులున్నవి. అవేవనగా : కాలము (Time), శక్తి (Force), క్రియ (Action), రోదసి లేక మహాకాశము (Space), పదార్థము (Matter)" అని లోకమునకు ప్రకటించెను. అది గొప్ప శాస్త్రీయ సిద్ధాంతము వలె పొగడబడెను. అయితే మనము బైబిలును తెరచిన యెడల, అందలి మొదటి వచనమే ఈ అయిదు శాస్త్రీయ సూత్రములతో నిండియున్నది. ఆదికాండము 1:1 ఇట్లు చెప్పుచున్నది. "ఆది యందు దేవుడు భూమ్యాకాశములను సృజించెను". ఆది యందు అనగా కాలము, దేవుడు అనగా శక్తి భూమిని అనగా పదార్థమును, ఆకాశమును అనగా రోదసీని, సృజించెను అనగా క్రియను ఆ మొదటి వచనమే తెలియజేయుచున్నది. దేవుని వాక్య లేఖకుడగు మోషే ఈ అయిదు సృష్ట సంగతులను ఎరిగి యుండెనా? లేక అతడు దేవునిచే నడిపింపబడెనా? దీనిని ఏమని చెప్పుదుము?

## మోషే - విజ్ఞాన శాస్త్రము

మోషే కాలమందున్న ప్రజలకు భూగోళ శాస్త్రమును గూర్చిగాని, సాగర గర్భ శాస్త్రమును గూర్చి గాని (Geography & Oceanography) ఏమియును తెలియదు. మోషే కాలమునాటి యూదులకు తెలిసిన దంతయును బహుశ మధ్యధరా సముద్రము మాత్రమే అయియుండ వచ్చును (యెహోషువా 1:4). అయితే అనాటి అజ్ఞానమును లక్ష్యపెట్టకనే సృష్టి జరిగిన మూడవ దినమును గూర్చి మోషే ఇట్లు చెప్పెను. "దేవుడు ఆకాశము క్రింద నున్న జలము లొకచోటనే కూర్చబడి ఆరిన నేల కనబడుగాక యని పలుకగా ఆ ప్రకారమాయెను. జలరాసికి ఆయన సముద్రములు అని పేరుపెట్టెను" (ఆది 1:9, 10). జలములన్నిటిని ఒక చోటనే దేవుడు కూర్చినట్లు మోషే చెప్పెను. మనమొక భూగోళమును పరిశీలించిన యెడల మోషే చెప్పిన సంగతి యదార్థమని ఇట్టే గ్రహించగలము. మహా సముద్రములన్నియును ఒకదానినొకటి కలసి యుండుటచే వాటన్నిటికి ఒకే ఒక అడుగుభాగము (Sea bed) ఉన్నట్లగుపడును. మోషే నాటి ప్రజలకు తెలిసినది ఒకే ఒక్క సముద్రమే అయినను, ఆ జలరాసికి సముద్రములు అని పేరు పెట్టెనని చెప్పినప్పుడు మోషే బహువచనమునే ప్రయోగించెను. అయితే ఈ సంగతిని మోషే ఎట్లు యెరుగును? మానవ జ్ఞానముచే అతడు కనుగొనెనా? లేక దేవుడే అతనికి అది బయలుపరచెనా?

## లెక్కింపనశక్యమైన నక్షత్రములు

ఖగోళశాస్త్రమునందు నేడు మానవులు ఎక్కువ పురోగమించి యున్నారు. దూదర్శిని సహాయము వలన అది సాధ్యమాయెను. గాని ఆకాశ మందలి నక్షత్రములను లెక్కింపనగునని ఒకప్పుడు మానవులు తలంచిరి. మన పూర్వీకులు ఆకాశము నందున్న నక్షత్రముల సంఖ్య బహు స్వల్పమని భావించిరి. క్రీ॥పూ॥ 150వ సం॥లో హిప్పార్కస్ (Hippa-rchus) అను నతడు ఆకాశము లో 1000 నక్షత్రములున్నవని ప్రకటించెను. క్రీ॥శ॥ 150వ సం॥లో టోలెమీ (Ptolemy) అను నతడు 1025 నక్షత్రములు మాత్రమే ఆకాశమందున్న వని చెప్పెను. అయితే దూరదర్శిని కనుగొనబడిన తరువాత ఆ నక్షత్రముల సంఖ్య లెక్కింపనలవి కాదని మానవులు ఇప్పుడు గ్రహించియున్నారు. అయితే క్రీస్తుకు పూర్వము 1500 సం॥లు క్రితమే ఆకాశ నక్షత్రములు లెక్కింప తరము గాదని మోషే బైబిలు నందు వ్రాసెను. దేవుడు అబ్రాహామునకు చేసిన వాగ్దాన మును గూర్చి మోషే యిట్లు వ్రాసెను "మరియు నీ సంతానమును భూమి మీద నుండు రేణువులవలె విస్తరింపచేసెదను, ఎట్లనగా ఒకడు భూమి మీద నుండు రేణువులను లెక్కింపగలిగిన యెడల నీ సంతానమును కూడ లెక్కింపవచ్చును". "మరియు ఆయన వెలుపలికి అతని (అబ్రాహామును) తీసుకొని వచ్చి – నీవు ఆకాశమువైపు తేరి చూచి నక్షత్రములను లెక్కించుటకు నీచేతనైతే లెక్కించుమని చెప్పి, నీ సంతానము ఆలాగవునని చెప్పెను'' (ఆది 13:16; 15:5). యిర్మీయా 33:22 లో మరల బైబిలు గ్రంథము యిట్లు చెప్పుచున్నది; "ఆకాశ నక్షత్రములు లెక్కింపశక్యము కానట్టు గాను నా సేవకుడైన దావీదు సంతాన మును, నాకు పరిచర్యచేయు లేవీయులను లెక్కింపలేనంతగా నేను విస్తరింప జేయుదును''. ఆకాశ నక్షత్రములు లెక్కింప నశక్యమని ఈ పురాతన లేఖకులెట్లెరుగుదురు?, దానికి ఒకే ఒక్క జవాబున్నది – దేవుడు ఆ సంగతిని వారికి బయలుపరచి తన గ్రంథమందు మనకొరకు లిఖింప జేసెను.

దేవుడు చంద్రుని ఆకాశములో ఒక నమ్మకమైన సాక్షిగా యేర్పరచెనని కీర్తన 19:36లో వ్రాయబడి యున్నది. సాక్షియొక్క పని యేమిటి? అతడు చూచిన దానిని గూర్చి చూడలేని వారికి సాక్ష్యమిచ్చుటయే గదా? నిజానికి ఆకాశములో చంద్రుడు అదే పనిని చేయుచున్నాడు. పశ్చిమ క్షితిజములో సూర్యుడస్తమించగానే అది మనకు కనపడకుండపోవును. చంద్రుడయితే ఆకాశములో యుండి సూర్యుని చూచుచూ రాత్రివేళ సూర్యకిరణములను చంద్రకాంతివలె మనకు ప్రతిబింబించు చున్నాడు. సూర్యుని గూర్చి చంద్రుడు సాక్ష్యమిచ్చుచున్నాడు. అయితే దావీదు

మహారాజు కాలములో సూర్యుని వెలుగునే చంద్రుడు భూమిపైకి ప్రతిబింబించుచున్నాడని ప్రజలెవరును యెరుగరు. అయనను సరే దావీదు దాని విషయమై వ్రాసెను. దావీదు తన స్వజ్ఞానముచే దానిని కనుగొనెనా? లేక సూర్యచంద్ర నక్షత్రములను సృజించిన దేవుడు దావీదు కలమును విజ్ఞాన శాస్త్రయుక్తముగా నడిపించెనా? దీనిని ఏమందుము?

### విజ్ఞానశాస్త్రము - యోబు

అబ్రహాము కాలమునకు సమీప ముగా గోత్రకర్తయగు యోబు నివసించెను. అట్టి గొప్ప గోత్రకర్త ఈ పుడమియందున్న కాలములో మానవ దిఙ్మండలముపై విజ్ఞానశాస్త్ర ప్రభావము ఇసుమంతయు ఉదయింపనేలేదు. అతని కాలములో భూవ్యోత్పత్తిని గూర్చి హాస్యజనక సిద్ధాంతము లెన్నియో ప్రభలియుండెను. అయితే యోబు తన కలమును చేబూని ఆనాటి మానవ మూఢత్వమును లక్ష్యపెట్టక నేటి శాస్త్రజ్ఞులు ఒకదాని తరువాత మరొకటి కనుగొనుచున్న అనేక వైజ్ఞానిక సత్యములను ఆనాడే బైబిలు నందు లిఖించెను.

యోబు 26:7లో "శూన్య మండలము పైని ఉత్తర దిక్కునున్న ఆకాశ విశాలమును ఆయన పరచెను" అని భక్తుడైన యోబు వ్రాసెను. ఖగోళ శాస్త్రజ్ఞులు దూరదర్శిగని సహాయము వలన ఎక్కువ పురోగమించియున్నారని ఇంతకు ముందే ఒకసారి చెప్పుకొన్నాము. వారు చేయుచున్న ఖగోళ పరిశోధనలో ఈ మధ్యనే ఒక గొప్ప ఆశ్చర్యమైన సంగతిని కనుగొనిరి. అదేమన: అతి మిక్కిలి శక్తివంతమైన ఖగోళ దూరదర్శి నిని వారు తూర్పు, పశ్చిమ, దక్షిణ దిశలకు మళ్ళించి చూచినప్పుడు ఖగోళ శాస్త్రజ్ఞులు అనేక క్రొత్త గ్రహములను, నక్షత్రములను చూడగల్గిరి. కాని వారు ఆ దూరదర్శినిని ఉత్తర దిక్కునకు మళ్ళించినపుడు వట్టి శూన్యమును మాత్రము వారు కనుగొనిరి. 'దేవుడు ఉత్తర దిక్కుననున్న ఆకాశ విశాలమును పరచెను' అను గొప్ప వైజ్ఞానిక సత్యమును క్రీ.పూ 2000 సం॥లకు ముందే భక్తుడైన యోబు బైబిలునందు వ్రాయగా దానిని మన శాస్త్రజ్ఞులు ఇటీవలనే కనుగొనిరి. అయితేమానవ జ్ఞానమున కందనట్టి ఈ గొప్ప సంగతిని యోబుకు బయలుపర చిన వాడెవడు? నిజముగా దేవుడే గదా?

బైబిలు కేవలము కట్టుకథల పుస్తకమేయని బైబిలు శత్రువులు, అజ్ఞానులు ఎంత ప్రచారము చేసినను అది నిత్య సత్య దేవునియొక్క వాక్యమై యున్నది. ఈలోగా బైబిలు గ్రంధమును మీరు చదివి ధ్యానించండి. నిత్యజీవ మును పొందవలె నంటే క్రీస్తునందు విశ్వసించి, ఆయన మాటలకు లోబడుట అత్యవసరమని గ్రహించుడి.

**- జాషువా గూటం**

# కీర్తన 19:1-3

## (Psalms 19: 1-3)

"ఆకాశములు దేవుని మహిమను వివరించుచున్నవి.
అంతరిక్షము ఆయన చేతిపనిని ప్రచుర పరచుచున్నది
పగటికి పగలు బోధ చేయుచున్నది
రాత్రికి రాత్రి జ్ఞానము తెలుపుచున్నది.
వాటికి భాషలేదు, మాటలు లేవు వాటి స్వరము వినబడదు"

భూమి తన యిరుసుపై గంటకు వెయ్యి మైళ్ళ వేగముతో తిరుగుచున్నది. అది గనుక 100 మైళ్ళ వేగమే అయితే మన రాత్రుళ్ళు, పగళ్ళు పదిరెట్లు దీర్ఘకాలమై యుండును. మరియు ఈ భూగోళము చివరకు ఘనీభవించును లేదా కాలిపోవును. అట్టి పరిస్థితులలో వృక్షసంపద యావత్తు నశించును.

భూమి చంద్రుని వలె చిన్నదై యుంటే మానవ నివాసమునకవసరమైన భూమ్యాకర్షణ శక్తి బహు స్వల్పమైయుండును. లేదా భూమి వరుణుడు, శని గ్రహముల వలె పెద్దదైయుంటే భూమ్యాకర్షణ శక్తి విపరీతమై మానవనివాసయోగ్యము కానిదై యుండును.

శుక్ర (Venus) గ్రహమువలె భూమి సూర్యునికి దగ్గరగా యుంటే సహింపజాలనంత ఉష్ణోగ్రతకు పాలగుదుము. లేదా అంగారక గ్రహమంత దూరముగా యుంటే భూమి అంతయు శీతల మయమై నివాసయోగ్యము కానిదగును.

ఇప్పుడున్న మహాసముద్రములు వాటి విస్తీర్ణములో నాలుగవ వంతు మాత్రమే యుంటే ఇప్పుడున్న వర్షపాతములో నాలుగవ వంతు మాత్రమే భూమిపై సంభవించును. లేదా సముద్రములు ఇంకొంచెము పెద్దవై యుంటే భూమి అంతయు నీటమునిగిన గొయ్యివలె నగును. నివాస యోగ్యము కానిదగును.


నీరు 32$^{o}$F (0$^{o}$డిగ్రీలు) వద్ద ఘనీభవించును. అయితే ఈ చట్టము మహాసముద్రములకు వర్తిస్తే గొప్ప ప్రమాదము సంభవించును. అయినా ధృవప్రాంతములన్నీ ఘనీభవించిన నీరుతోనే యున్నవి. మహాసముద్రములన్నీ ఐస్ వలె గడ్డ కట్టకుండా దేవుడు వాటిలో ఉప్పు ఉంచియున్నారు.

"మీరు సత్యమును గ్రహించెదరు. సత్యము మిమ్మును స్వతంత్రులనుగా చేయునని" యేసు చెప్పారు (యోహాను 8:32)

# వాక్యము యొక్క ఏడువింతలు

# (The Seven Wonders of the Word)

*- Charles Pugh III*



ప్రపంచములోని ఏడు వింతలను గూర్చి మనం విన్నాము. గాని దేవుని వాక్యములోని వింతలను గూర్చి మనం ఎక్కువ వినాలి. "నీ ధర్మశాస్త్రమునందు ఆశర్యకరమైన సంగతులు చూచునట్లు నా కన్నులు తెరువుము" అని కీర్తనకారుడు వ్రాసాడు (కీర్తన 119:18). మరల "నీ శాసనములు ఆశ్చర్యములు" అని అతడు వ్రాసాడు (కీర్తన 119:129). దేవుని వాక్యములోని దిగువ యేడు వింతలను చూచినపుడు నేను ఆశ్చర్యపడుచున్నాను.

**1. దాని ఆత్మప్రేరణ (Inspiration):** దేవుని గ్రంథములో కొంతభాగము కాదు, కొన్ని తలంపులు కాదు గాని ప్రతి లేఖనము దైవావేశము వలన కలిగినది. "దైవ జనుడు సన్నద్ధుడై ప్రతి సత్కార్యము నకు పూర్ణముగా సిద్ధపడి యుండునట్లు దైవావేశము వలన కలిగిన ప్రతి లేఖనము...." (2తిమో 3: 16-17). దేవుని వాక్యములోని ప్రతి సున్న ప్రతి పొల్లు దైవావేశమువలన కలిగినది. (మత్తయి 5:18).

**2. అది కలిగిన విధానము:-** దేవుని గ్రంథమంతా ఒకేసారి కలుగలేదు! గాని యించుమించు 1600 సంవత్సరముల కాలములో వ్రాయబడెను. "ఆజ్ఞ వెంబడి ఆజ్ఞ సూత్రము వెంబడి సూత్రము కొంత

ఇచ్చట కొంత అచ్చట" అది కలిగెను. (యెషయా 28:10).

**3. దాని ఏకత్వము:-** అది 66 పుస్తకముల సంపుటియైయున్నది. అయినను అది ఒకే ఒక్క గ్రంధము. 40 మంది లేఖకులు 1600 సంవత్సరముల కాలములో దానిని వ్రాసిరి. అయినను దానిలో భిన్నత్వము యేమీలేదు. అంతా ఒకేఒక్క వర్తమానము (ప్రక 19:10).

**4. దాని బయల్పాటు :-** బైబిలు దేవుని సంగతులను గూర్చిన పరిపూర్ణ ఆఖరి బయలుపాటు అయ్యున్నది (1 కొరింథీ 2:10-12). అది మనుష్యుల ఇచ్చునుబట్టిగాక పరిశుద్ధాత్మ ప్రేరేపణ వలన కలిగినది (2పేతురు 1:20-21).


**5. దానిలోని సమాచారము ఆశ్చర్యము:-** అది ప్రపంచంలోయున్న అత్యంత ఘనమైన సాహిత్యము. అయినను అంతకంటే ఎక్కువ అందున్నది. మన జీవముకు, భక్తికి కావలసిన వన్నియు దానిలోయున్నవి (2 పేతురు 1:3). మనుష్యుడు ప్రతి సత్కార్యమునకు పూర్ణముగా సిద్ధపడి యుండగల్గునట్లు అది చేయును గనుక అదనపు సమాచారము ఏమియు అక్కరలేదు (2 తిమో 3:16-17).

**6. అది విస్తరించిన విధానము ఆశ్చర్యము:-** దానిని అన్నిజాతుల వారు, జనాంగములు, భాషలు, వర్ణముల వారు చదువుదురు. అది ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన, ఎక్కువగా కొనబడుచున్న గ్రంధము.

**7. అది భద్రపరచబడిన విధానము ఆశ్చర్యము:-** అన్నిటికంటే అది ఎక్కువ ద్వేషించబడుచున్న గ్రంధము, అయినను అది ఇంకా నిలిచేయున్నది. "ప్రభువు వాక్యము ఎల్లప్పుడు నిలుచును!" (1 పేతురు 1:25).

"నీ వాక్యభయము నా హృదయ మందు నిలుచుచున్నది'' (కీర్తన 119:161)


- చార్ల్స్ పగ్



# మన జీవమైయున్న క్రీస్తు

## (Christ, Our Life)

*- Vance Hutton*



క్రీస్తు మన జీవమైయున్నారని పౌలు చెప్పాడు (కొలస్స 3:4). నా మట్టుకైతే బ్రతుకుట క్రీస్తేయని అతడు చెప్పాడు (ఫిలిప్పీ 1:21). పౌలులో క్రీస్తు జీవించారు (గలతీ 2:20). నీ జీవితంలో ప్రభువు ఘనపరచబడుచున్నారా? (ఫిలిప్పీ 1:20). క్రీస్తు మనలో యుండే ప్రాముఖ్యతను గూర్చి తరుచు పౌలు వ్రాసాడు (కొలస్స 1:27; 2 కొరింథీ 13:5). క్రీస్తు మన జీవితంలో యుంటే కలుగు కొన్ని సంగతులను గమనించు దాము. అవి మన జీవితంలో కనబడాలి.

### ప్రభువును గూర్చి ధ్యానించాలి, చదవాలి

ఆయా సంగతులను గూర్చి హృదయంలో ధ్యానించు రీతిగా మనం చేయబడియున్నాము. మన హృదయ కోరికలు పరలోకము వైపు ఉండాలి. (కొలస్స 3:1-3). పరిశుద్ధమైన, ఖ్యాతిగల సంగతులను గూర్చి మనం ఆలోచించాలి (ఫిలిప్పీ 4:8). దివా రాత్రులు దేవుని వాక్యమునందు ధ్యానించుటను గూర్చి కీర్తనకారుడు వ్రాసాడు (కీర్తన 63:6, 7). ఆత్మీయ సంగతుల విషయమై మనస్సుంచుకొన వలెనని తిమోతికి పౌలు వ్రాసాడు (1తిమో 4:15). దేవుని వాక్య పఠనము నిమిత్తము మనం ఎక్కువ సమయమును కేటాయించాలి. బెరయలోని వారివలె లేఖనములను పరిశోధించాలి (అ.పొ.కా. 17:11).

### ప్రభువు చెప్పిన దానికి లోబడాలి

మనపై ప్రభువుకు సర్వాధికారము న్నది (మత్తయి 28:18; అపో.కా. 5:36). అంత్యదినమందు ఆయన చెప్పిన మాటలే మనకు తీర్పు తీర్చును

(యోహాను 13:48). ఆయనను ప్రేమిస్తే ఆయన మాటలకు లోబడాలి (యోహాను 14:15). ఆయనకు విధేయులైన వారికి ప్రభువు నిత్యరక్షణకు కారకుడైయున్నారు (హెబ్రీ 5:8–9). ఆయనకు విధేయులు కానివారు ఆయన ఉగ్రతకు పాలగుదురు. (2 థెస్స 1:7–9). గనుక క్రీస్తు మన ప్రభువైన యెడల ఆయనకు విధేయులగుటకు ఆసక్తి కలిగియుందము. (అపో.కా. 5:29)

## దేవునికి తరుచు తీవ్రముగా ప్రార్థించాలి

మన ప్రభువును స్తుతించాలి. మన పాపములను, అవసరతలను, కోరికలను, కృతజ్ఞతను గుర్తించి ఆయన సింహాసనము నొద్దకు వాటిని ప్రార్థన విజ్ఞాపన పూర్వకముగా తీసికొనివెళ్ళాలి. మన జీవితంలో ఎక్కువ సమయం ప్రార్థనలో గడపాలి. మన ప్రభువు పెందలకడనే లేచి ప్రార్థించేవారు (మార్కు 1:35) మరియు రాత్రి అంతయు ఆయన ప్రార్థనలో గడిపేవారు (లూకా 2:12). మరణ భయము వలన మనం మరింత ప్రార్థనలో గడపాలి (దానియేలు 6; ప్రక 2:10). ఆయన చేసిన మేళ్ళ కొరకు కృతజ్ఞత చెల్లించాలి. జ్ఞానము కొరకు ప్రార్థించాలి (యాకోబు 1:5). మన పాపములు, బలహీనతలను బట్టి మనం ప్రార్థించాలి (అపో.కా. 6:3).

## క్రమముగా దేవుని ఆరాధించాలి:

క్రీస్తు మన జీవమై యున్నప్పుడు, ఆయననారాధించుటకు అపేక్ష కలిగి యుంటాము. కీర్తనల గ్రంధములో, యెహోవా మందిరమును గూర్చి ధ్యానించుచుండగా ఆరాధించుటకు మనకు కాంక్ష ఎక్కువ కలుగును. ప్రకటన గ్రంధములో ఆరాధనను గూర్చి ధ్యానించుము. దేవునినారాధించుము (యోహాను 4:23–24). ఆరాధన మన జీవిత భాగముగా యుండాలి.

## అనుదినము పరలోక ధ్యాస కలిగి యుండవలెను

పరలోకాన్ని గూర్చి మనం పాటలు పాడుదుము. దానిని గూర్చి ఎంతో ఆశకలిగియుందుము (2 కొరింధీ 5:1). విశ్వాసము ద్వారా అదృశ్యమైనవి దృశ్యములగును. అబ్రాహాము వలె పరలోక పట్టణమును గూర్చి ఎదురు చూచుచుందుము (హెబ్రీ 11:10). ఇక్కడ భూమి మీద అంతా అశాశ్వతమే గాని మనం పరలోకములో ధనమును కూర్చుకొనుచున్నాము (మత్తయి 6:19, 20). ప్రభువుతోను, పరిశుద్ధులతోను, మన బంధువులతోను నిత్యమూ వుండాలనే కోరిక దినదినము బలపడును. వ్యాధి బాధలు, మరణం వగయిరా లేని నిత్య సంతోషము పరలోకము. క్రీస్తు అనుగ్రహించు నిత్య జీవిత కృపా వరమును పొందుటకు జీవించెదముగాక! (రోమా 6:23).

– వేన్స్ హట్టన్

# నమ్మశక్యము కాని యేసు

## (Incredible Jesus)

*- Ed Short*

రేడియో, టీవీ, వార్తాపత్రికలు, మేగజైన్లు, పుస్తకాలు మొదలగు ప్రచార సాధనముల వలన మనము ప్రజలను గూర్చి తెలిసికొనుటకు, వారితో సానుభూతి కలిగియుండుటకు మనకు సాధ్యపడును. క్రొత్త నిబంధనలోని నాలుగు సువార్తల ద్వారా (మత్తయి, మార్కు, లూకా, యోహాను) చదువరులకు యేసు పరిచయము చేయబడును. ఈ నలుగురు లేఖకులు యేసు నమ్మశక్యము గాని సంగతులు తన్ను గూర్చి చెప్పారనీ, నమ్మశక్యము గాని మాటలు పలికారని, నమ్మశక్యము గాని పనులు చేసారని మనకు చెబుతారు.

**యేసు తన్ను గూర్చి నమ్మశక్యము కాని ఆరోపణలు చేసికొన్నారు:**

దీనిని గూర్చి ఆలోచించుము. ఆయన ఈలోక రక్షకుడని, రాజులకు రాజునని, సర్వసృష్టికర్తననీ చెప్పుకొన్నారు. "నేనే మార్గమును, సత్యమును, జీవమునైయున్నాను" అని యేసు చెప్పుకొన్నారు. తాను జీవాహారముననని చెప్పుకొన్నారు. దేవుని గొర్రెపిల్లయని, దేవుని కుమారుడనని ఆయన చెప్పుకొన్నారు."

ఈలాగు చెప్పుకొనే వానెవనినైనా మనము వీధిలో కలసికొంటే, అతని గూర్చి ఏమనుకొంటాము? అతని యొక్క మతిస్థిమితమును మనం శంకించుదుము గాని యేసు అయితే తన్ను గూర్చి పైన చెప్పినట్లే చెప్పుకున్నారు.

**యేసు నమ్మవక్యము కాని క్రియలను, అద్భుతములను చేసారు:-**

గ్రుడ్డివారికి ఆయన చూపునిచ్చారు, కుంటివారు నడిచారు, చనిపోయిన వారిని ఆయన మరల బ్రతికించారు. ఆకలిగొన్న వారికి యేసు ఆహారము నిచ్చారు, నిరుత్సాహ భరితులను ఉత్సాహపరిచారు. మారు మనస్సు పొందిన పాపులకు నూతన జీవితము నిచ్చారు. ప్రజలలో ఏమున్నదో ఆయన ఎరుగును. ఆయన వారిని అర్థము చేసికొన్నారు. యేసు ప్రజలతో ప్రజల మధ్యనే యుండేవారు. ఆయన వారిని హత్తుకున్నారు.

యేసు బీదలను కనికరించారు. ఆయన మురికిని గూర్చి భయపడలేదు. బీదతనమును గూర్చి భయపడలేదు. అపరిచితులను గూర్చి భయపడలేదు. ఆయన ప్రజలను గూర్చి చింతించేవారు

అంతే. అన్నింటికంటే ముఖ్యముగా ఆయన మానవజాతి కొరకు తన్నుతాను అప్పగించుకొన్నారు. సిలువవేయబడ్డారు. చంపబడ్డారు. కానీ మూడవ దినమున సజీవుడై సమాధినుండి ఆయన తిరిగిలేచారు. యేసు యొక్క మరణము ద్వారా మనపాపములు క్షమించబడ్డాయి. మనము నూతన జీవమును పొందవచ్చును. అవును, యేసు నమ్మశక్యము గాని పనులెన్నో చేసారు.

**యేసు నమ్మశక్యముగాని మాటలు పలికారు:-**

యేసు పలికిన కొన్ని మాటలను వినుడి "ఆత్మవిషయమై దీనులైన వారు ధన్యులు. పరలోక రాజ్యము వారిది". "నీతి నిమిత్తము హింసించబడువారు ధన్యులు, పరలోక రాజ్యము వారిది. నా నిమిత్తము జనులు మమ్మును నిందించి, హింసించి మీ మీద అబద్ధముగా చెడ్డమాటలెల్ల పలుకునప్పుడు మీరు ధన్యులు". "నేను మీతో చెప్పునదేమనగా మీరు పరలోకమందున్న మీ తండ్రికి కుమారులై యుండునట్లు మీ శత్రువులను ప్రేమించుడి, మిమ్మును హింసించువారి కొరకు ప్రార్థన చేయుడి" మనుష్యుల అపరాధములను మీరు క్షమించిన యెడల, మీ పరలోకపు తండ్రియు మీ అపరాధములను క్షమించును, మీరు మనుష్యుల అపరాధములను క్షమింపక పోయిన యెడల మీ తండ్రియు మీ అపరాధములను క్షమింపడు" (మత్తయి 5:3, 10, 13-14, 44; 6:14-15). యేసు యొక్క ఈ మాటలను మొదటిగా విన్నవారు ఆశ్చర్యపడిరి. ఈరోజు అదే మాటలను నీవు నేను కూడ విని ఆనందించవచ్చును. వాటి వలన మనము ప్రోత్సహించబడవచ్చును.

**యేసు ఆశ్చర్యమైన సంగతులు తన్ను గూర్చి చెప్పుకొనెను:-**


ఆశ్చర్యమైన క్రియలు చేసెను, ఆశ్చర్యమైన మాటలు పలికెను, అయితే ఈ యేసును గూర్చి నీ అభిప్రాయ మేమిటి? నీవాయన మాటలను నమ్ముదువా? ఆయన లోక రక్షకుడని, రాజులకు రాజని, జీవాహారమని, సృష్టికర్తయని, దేవుని కుమారుడని నమ్ముదువా? నీ జీవితంలో ఆయన ఆశ్చర్య సంగతులు చేయాలని కోరుచున్నావా? నీ పాపములను ఆయన క్షమించి, నీ జీవితాన్ని ఆయన మార్చాలని కోరుచున్నావా? ఆశర్యమైన ఆయన మాటలను నీవు నమ్ముచున్నావా? నీ జీవితాన్ని వాటి ద్వారా ప్రభావితం చేయాలని కోరుచున్నావా? నీవు బైబిలును ఎక్కువ చదివి ఆయనను మరింత ఎక్కువగా తెలిసికోవాలని కోరుచున్నాను.

– ఎడ్‌షార్ట్

# వివాదస్పద క్రీస్తు

# (The Controversial Christ)

*- Johnny Ramsey*



యేసు ప్రభువు యొక్క తిరుగులేని అధికారము వలన కొన్ని కుటుంబము లలో ఖడ్గము సంభవించెను (మత్తయి 10:32). కుటుంబములో క్రీస్తు ప్రవేశించిన తరువాత, మానవులు ఆయనను గూర్చి ఎక్కువ పరిగణించ వలయును. నజరేతువాడైన ఈయనను గూర్చి ఎవడును తటస్థముగా యుండ లేదు. "నా పక్షమున నుండని వాడునాకు విరోధి, నాతో కలసి సమకూర్చనివాడు చెదరగొట్టువాడని" ఆయన చెప్పెను (మత్తయి 12:30).

మన రక్షకుడైన యేసు ఎందువలన అంత వివాదస్పతుడయ్యారు? రోమా సామ్రాజ్యములో అనేకులకు ఆయన అడ్డరాయిగాను, అడ్డబండగాను అగుపడెను (రోమా 9:33). ఎంద లన? ఆయన "మనుష్యుల వలన విసర్జింప బడిన వాడును, వ్యసనాక్రాంతుడు గాను" ఉండెను (యెషయా 53:3). గదరేనీయులు తమ ఆత్మల కంటె పందులను గూర్చి ఎక్కువ లక్షపెట్టారు గనుక వారాయనను విసర్జించారు (మార్కు 5). పరిసయ్యుల యొక్క పారంపర్యాచారములనాయన ఖండిచారు గనుక వారాయనను ద్వేషించారు (మార్కు 15:7-12). ఆయనను గూర్చి "ప్రజలలో కూడ బేధములు పుట్టెను" (యోహాను 7:43).

## ఆయన పరిపూర్ణత యితరులను ఇబ్బంది పెట్టెను:

దేవుని కుమారుని సమక్షమున ఇంకొకని ప్రఖ్యాతి వెలవెలబోయేది. ఆయన సంభాషణ క్రియలు, స్వభావము మొ॥నవి మనోహరంగా సాటిలేనివి. యేసు లేఖనములను వివరించునప్పుడు శాస్త్రులు ఎందుకు పనికిరానివార

య్యారు. మెస్సీయ యొక్క పవిత్రతలో పరిసయ్యుల యొక్క నటన అంతా పటాపంచలయ్యింది. సద్దూకయ్యుల అహంభావ ఆరోపణలన్నియును రక్షకుని ఒక్కమాటలో తునాతునకలయ్యేవి (మత్తయి 22:23-33). అందువలన యేసు ద్వేషింపబడ్డారు. రోమా గవర్నర యిన పొంతిపిలాతు కూడా, "యూదులు అసూయచేత యేసును అప్పగించారని" తెలుసుకొన్నాడు (మార్కు 15:10).

## ఆయన రక్షణ ఆత్మీయము:

యేసు పాలస్తీన భూభాగము మీద అడుగు పెట్టేసరికి యూదుల మధ్య హోసన్నయనే విమోచన పదము ప్రఖ్యాతి గాంచియుండెను. మక్కబీయుల కాలము నుండి అది భౌతిక విడుదల గూర్చిన పదమై యుండెను. హోసన్న యనగా ''మమ్ములను రక్షించుమని ప్రార్థించుచున్నామని" యర్థము. యేసు విజయోత్సాహముతో యెరూషలేములో ప్రవేశించినపుడు ప్రజలు "జయము (హొసన్న), ప్రభువు పేరిట వచ్చువాడు స్తుతింపబడును గాక" యని కేకలు వేయుచుండిరి (మార్కు 11:9, 10). ఆరోజు దారిపొడుగునా ప్రజలు ఆకులు కొమ్మలు బట్టలు పరచి ఎంత అందముగా అలంకరించినను, రోమా సామ్రాజ్యము నుండి యూదా మతమును రక్షించుటకు గాక సాతాను నుండి పాపులను రక్షించుటకు ఆయన వచ్చెను ఏలయనగా ఆయన రాజ్యము ఈ లోక సంబంధమైనది కాదు (యోహాను 18:36). ఆహారము కొరకు ఆకలి తీర్చుకొనుటకు ఆయన యొద్దకు వచ్చేవారు నిరుత్సాహముతో తిరిగి పోవలసివచ్చెను.

## ఆయన సంపన్నులను సిగ్గుపరచెను:

యేసు ప్రభువు పాపులతోను, సుంకరులతోను కలసి భోజనము చేయుట వలన సంపన్నులు తిరుగుబాటు చేసిరి (మార్కు 2; లూకా 19). "నశించిన దాన్ని వెదకి రక్షించుటకు యేసు వచ్చెను (లూకా 19:10). దానిని ఆయన అక్షరాల అనుసరించుటవలన ధర్మ శాస్త్రోపదేశకులు అభ్యంతరపడిరి. ఆయన వారి విద్యాలయాల్లో చదువక పోయినను ఆయన బోధనలను వినుటకు ప్రజలు అసంఖ్యాకులుగా వచ్చుట వలన వారు ఆందోళనకు గురయ్యిరి (యోహాను 7). అతి సున్నిత పదజాలముతో, చాతుర్యముతో వారి వేషధారణను యేసు బహిర్గతము చేయుచుండినందున వారు తరుచు సిగ్గుపడవలసి వచ్చెను (మార్కు 12:24, 34; యోహాను 8:39, 40).

తన తమ్ముని గూర్చి కించెత్తు చింతించని పెద్ద కుమారుని గూర్చి చెబుతు ఆయన వారి హృదయములోని స్వార్థమును బట్టబయలు చేసారు (లూకా 15). మరియు మంచి సమరయుని గూర్చి చెబుతు యూదులు యొక్క సంస్కార సంబంధమైన పై పై భక్తిని ఎత్తి చూపించారు. గాయపరచబడిన వానిని

చూస్తూనే లేవీయుడు, యాజకుడు ప్రక్కనుండి వెళ్ళిపోయారు (లూకా 10). వారు ఆయన వలన అభ్యంతరపడి ఆయనను చంపజూచారంటే, ఆశ్చర్యం లేదు. వారు మారుమనస్సు పొంద వచ్చును గాని వారికంత ధైర్యము లేకపోయింది. "ఆయన తన స్వకీయుల యొద్దకు వచ్చెను, ఆయన స్వకీయులు ఆయనను అంగీకరింపలేదను" మాటలు విచారకరమైనవి (యెహోను 1:11).

## పరిపూర్ణ రక్షకునికి మెండుగా శత్రువులు

యేసుక్రీస్తు ప్రభువు లాంటి మంచి వ్యక్తికి అంతమంది శత్రువులుండడం ఊహకందనిది. ఆయన జీవించిన మనోహర జీవితం, నెలకొల్పిన మంచి మాదిరిని చూస్తే, ఆయన కాలమందలి ప్రజలు ఆయనను నిరాకరించుట చాలా ఆశ్చర్యం. అట్టి నిస్వార్థ ప్రేమను ఎవరైనా ఎట్లు నిరాకరిస్తారు? అయినను నాటి వేలకొలది ప్రజలు ఆయన మాటలు గైకొనినవారు కారు.

యేసు ఈ భూమిపై నడచినప్పుడు పరిసయ్యుల యొక్క ద్వేషము వివిధ రీతులగ ఏర్పడేది. వారు రోమా సామ్రాజ్య పాలకులతో కలిసి క్రీస్తును సిలువవేయించుటలో వారి విషద్వేషము పరాకాష్టకు చేరింది. యేసు జననము స్వాగతింపబడలేదు. జీవితమంతా వ్యతిరేకులే. ఆయన మరణం అనేకుల ఆశలకు అంకురార్పణమయ్యింది. ఆయనకు అంతమంది శత్రువులెందుకు? ఆయనను ఎందుకు నిరాకరించారు? (గలతీ 5:11; రోమా 9:33; యోహాను 1:11).

## యేసు యొక్క లక్ష్యము ఈ లోకం కాదు, పరలోకము:

యేసు ప్రభువు భౌతిక సంగతులను గాక పరసంబంధ విషయాలపై ఆసక్తి కలిగి బోధించారు. గనుక ప్రజలాయనను నిరాకరించారు. ఆయన కాలము నాటి యూదులు ఒక భౌతిక సంబంధ రాజ్యము కొరకు రాజు కొరకు ఎదురు చూచుచుండిరి. దావీదు సింహాసనముపై కూర్చుండు రాజును గూర్చిన పాత నిబంధన ప్రవచనములను వారు ఎరిగియుండిరి. ఆ మెస్సీయ రాజులకు రాజును ప్రభువులకు ప్రభువునై యుండును (1తిమోతి 6:15). గాని భౌతిక విలువలపైనే వారి ఆసక్తి యున్నందున క్రీస్తు రాజ్యము ఎన్నడు భూసంబంధమైనది కాదని గుర్తించలేకపోయారు.

యేసు యొక్క జీవితాన్ని బోధలను మనం లేఖనములలో పరీక్షించిన యెడల నాటి మతగురువుల యొక్క అపోహలను సులభముగా గ్రహించుకొనవచ్చును. యూదులు ఒకానొక సందర్భములో ఆయనను బలవంతముగా రాజును చేయ ప్రయత్నించగా ఆయన వారినుండి

తప్పించుకొని పోయారు (యోహాను 6). యేసు యొక్క సన్నిహిత శిష్యులు కూడ ఆయనను అపార్థము చేసికొన్నారు. అయినను ఆయన కైసరుకు పోటీదారు కాదని, ఆయన రాజ్యము ఇహసంబంధ మైనది కాదని యేసు వక్కాణించారు (యెహాను 18:36). 'ఆయన శిష్యులలో అనేకులు ఈ మాటవిని, యిది ఎవడు వినగలడని చెప్పుకొనిరి.. అప్పటినుండి అనేకులు వెనుక తీసి మరి ఎన్నడును ఆయనను వెంబడింపలేదు' (యెహాను 6:60, 66). కాబట్టి యేసు మీరు కూడా వెళ్ళిపోవలెనని యున్నారా?" అని తన శిష్యులనడిగారు (యెహాను 6:67). ఈ ప్రజల మనస్సు ఎందువలన మార్చ బడినది? ఒకప్పుడు వారు యేసు నామమును కొనియాడారు. గాని ఇప్పుడు వారు వెనుకదీసి మరెన్నడును ఆయనను వెంబడించలేదు.

## యేసు అసత్యాన్ని, వేషధారణను ఖండించారు:-

యేసు భౌతిక రాజుగా యుండగోర లేదు గనుక ఆయన నిరాకరింపబడ్డారు. ఆయన ఇహలోకము కంటే, పరలోక సంగతులను గూర్చి హెచ్చరించారు. అపవాదితో పోరాడుచు ఆత్మీయ సంగతులను వక్కాణించారు. నాడున్న ప్రఖ్యాత యూదుల తెగల యొక్క మతపరమైన పారంపర్యాచారములను యేసు ఖండించారు. గనుక వారు ఆయనను నిరాకరించారు. వారు తమ హృదయములతో గాక పెదవులతో దేవుని సేవించుచున్నారని ఆయన చెప్పారు. అట్టివారి ఆరాధన వ్యర్థమని చెప్పారు (మార్కు 7:6-7).

మన సమర్పణలో క్రీసుకును, ఆయన వాక్యమునకును వ్యత్యాసమున్నదని కొందరుచెప్పజూస్తారు. గాని ఆయన, ఆయన వాక్యము నిత్యము కలసి బంధింపబడియున్నవి. "నేను చెప్పినట్లుచేయక, ప్రభువా, ప్రభువా అని నన్ను పిలుచుట ఎందుకు? "మీరు నన్ను ప్రేమించిన యెడల నా ఆజ్ఞలను గైకొనుడి". "నేను మీకాజ్ఞాపించినవి చేసిన యెడల మీరు నాకు స్నేహితులై యుందురు". "ఆయన మీతో చెప్పునది చేయుడి" (లూకా 6:46, యోహాను 14:15, 15:14; 2:5).

యేసు నామమును ఒప్పుకొనుచు ఆయన చెప్పినట్లు చేయకపోతే అది ఘోరమైన వేషధారణ యగును. మనం యదార్థమైన ప్రేమకు విధేయత కలిగియుండాలి. దేవుని కృపయు క్రీస్తు యొక్క సువార్తయు చేతిలో చేయి వేసి నడువాలి. పౌలు "దేవుని కృపా సువార్తను" బోధిస్తూనే యుండేవాడు. (అపొ.కా. 20:24). మనము కూడ అట్లే చేయాలి. మనం యేసును ఘనపరచా లంటే ఆయన వాక్యాన్ని ఘనపరచాలి.

– జానీ రామ్సే

# పునరుత్థానుడైన తరువాత యేసు ఎవరెవరికి కనబడెను?

## (Jesus, Appearances after the Resurrection)

1. మగ్దలేనే మరియకు, మరియు ఇతర స్త్రీలకు సమాధి దగ్గర. మత్తయి 28:8–10
2. పేతురుకు. 1 కొరింథీ 15:5; లూకా 24:34
3. క్లెయొపాకు మరియు అతని అనుచరునికి. లూకా 24:13–35
4. పదిమంది అపొస్తలులకు. లూకా 24:36–43; యోహాను 20:19–25; తదుపరి అపొస్తులందరికి. యోహాను 20:26–29.
5. గలిలయ సముద్ర తీరమున ఏడుగురు అపొస్తలులకు. యోహాను 21:1–23
6. ఆయన శిష్యులకు మరియు అనేకమందికి. మత్తయి 28:16–17; 1 కొరింథీ 15:6
7. యాకోబుకు. 1 కొరింథీ 15:7
8. ఆయన ఆరోహణమవుచుండగా అనేకమందికి. లూకా 24:49–53; అపొ.కా. 1:3–11.
9. తనపై రాళ్ళు రువ్వబడుచుండగా స్తెఫనుకు. అపొ.కా. 7:55–56
10. దమస్కు మార్గములో తార్సువాడైన సౌలుకు, అపొ.కా. 9:3–6, 22:6–11
11. పద్మాసుద్వీపములో ప్రకటన గ్రంధమంతటిలో యోహానుకు.



# దేవుని ఆలయము
# (The Temple of God)

*- Jerry Bates*

దేవాలయం అంటూ మనకు ఏమీ లేదని క్రైస్తవులు తలుస్తారు. అది ఒక విధంగా నిజమే. భౌతిక దేవాలయం మనకు ఏమీలేదు. గాని ఆత్మీయ ఆలయం మనకున్నది. 1 కొరింథీ 3:16లో పౌలు "మీరు దేవుని ఆలయమై యున్నారనియు, దేవుని ఆత్మమీలో నివసించుచున్నాడనియు మీరెరుగరా? యని ప్రశ్నించాడు. ఆత్మీయముగా క్రైస్తవులు దేవుని ఆలయమైయున్నారు. ఆత్మీయముగా వ్యక్తిగతముగా దేవుని ఆత్మ మనలో నివసించుచున్నారు. మరియు సంఘపరముగా ఆయన తన సంఘము లో నివసించుచున్నారు. భౌతిక భవనము యేదీ దేవుని ఆలయము కాజాలదు. అందువలన సంఘము కూడుకొనే ఆలయము దేవుని ఆలయము కాజాలదు. అది ఏదో ఒక పరిశుద్ధ స్థలము కాదు.

మన పూర్వీకులు ఆలయములను బాగుగా ఎరిగినవారు. యెరూషలేములో యూదుల దేవాలయముండేది. ప్రతి అన్య జనాంగముల పట్టణములలో ఆలయములుండేవి. కొరింథులో ఒక దేవాలయం ఉండేది. అయితే వాటివలెగాక సంఘము దేవుని ఆలయమై యున్నది. సంఘము సమావేశమై యున్నపుడు అది దేవుడు మానవుడు కలసికొనే స్థలమైయున్నది. నిర్గమ 20:42-43లో ప్రత్యక్ష గుడారములో దేవుడు మానవుని కలసికొంటారని మోషే వ్రాసాడు. ప్రత్యక్ష గుడార స్థానములోనే దేవాలయము నిర్మించబడినప్పుడు దేవాలయము ఆ కలసికొనే ప్రదేశమై యుండెను. సంఘము దేవాలయ స్థానములో వచ్చినందున దేవుడు మానవుని సంఘములో కలసికొంటారు. అందు వలన దేవుని కలసికొనాలంటే మనము సంఘములో (భౌతిక ఆలయము కాదు) యుండాలి. దేవుని కలసికొనా లంటే మనం సంఘములో యుండాలి.

సంఘము దేవుడు వసించు స్థలమైయున్నది :- దేవుని ఆత్మమనలో నివసించునని ఇప్పటికే గమనించి యున్నాము. ఎఫెసీ 2:22లో "ఆయనలో మీరు కూడా ఆత్మమూలముగా దేవునికి నివాస స్థలమై యుండుటకు కట్టబడుచున్నారు" అని వ్రాయబడి యున్నది. "మనము జీవముగల దేవుని ఆలయమై యున్నాము. అందుకు దేవుడీలాగు సెలవిచ్చుచున్నాడు. నేను వారిలో నివసించి సంచరింతును, నేను వారి దేవుడనైయుందును, వారు నా

ప్రజలైయుందురు" (2 కొరింథీ 6:16-18). దేవుడు మానవునితో సహవాసము కలిగియుండాలని కోరుచున్నారు. మనమును దేవునితో సహవాసము కలిగియుండుటకు కోరుకొనాలి. అయితే దేవునితో సహవాసము కలిగియుండాలనుకుంటే మనము తప్పక ఆయన సంఘములో యుండాలి.

**సంఘము ఆరాధన స్థలమైయున్నది:** యేసు క్రీస్తు ద్వారా దేవునికి అనుకూలములగు ఆత్మ సంబంధమైన బలులనర్పించుటకు పరిశుద్ధ యాజకులుగా ఉండునట్లు మీరును సజీవమైన రాళ్ళవలెనుండి ఆత్మసంబంధమైన మందిరముగా కట్టబడుచున్నారు (1 పేతురు 2:5). యూదులు దేవునికి బలుల నర్పించుటకు, ఆయన నారాధించుటకు దేవాలయమునకు వెళ్ళేవారు. అట్లే మనము సంఘములో దేవునికి ఆత్మీయబలులనర్పిస్తాము. ఆయననారాధిస్తాము. "అయితే యదార్థముగా అరాధించువారు ఆత్మతోను, సత్యముతోను తండ్రిని ఆరాధించు కాలము వచ్చుచున్నది. అది ఇప్పుడును వచ్చేయున్నది" (యోహాను 4:23). ఆయన ప్రజలు దేవుని నారాధించాలని దేవుడు కోరుచున్నారు. అయితే ఆయననారాధించగోరు వారు ఆయన సంఘములో యుండాలి - సంఘము యొక్క ప్రాముఖ్యతను గమనింపుము. మనము దేవుని కలసికోవాలంటే ఆయనతో సహవాసము కలిగియుండాలంటే నిజముగా ఆయన నారాధించాలంటే, మనము తప్పక ఆయన సంఘములో యుండాలి. గనుక సంఘము చాలా ప్రాముఖ్యము గదా?

**సంఘములో ప్రవేశించుట ఎట్లు? :-** "మనమందరము ఒక్క శరీరములోనికి ఒక్క ఆత్మయందే బాప్తిస్మము పొందితిమి" (1 కొరింథీ 12:13). ఆ శరీరమే క్రీస్తు సంఘము (ఎఫెసీ 1:22, 23). గనుక మనము క్రీస్తు సంఘము లోనికి బాప్తిస్మము పొందితిమి; అది దేవుని కలసికొనే ప్రదేశము మరియు "ఎవడైనను దేవుని ఆలయమును పాడుచేసిన యెడల దేవుడు వానిని పాడు చేయునని" మనము గుర్తుంచుకొనవలెను (1 కొరింథీ 3:17). యిది చాల తీవ్రమైన హెచ్చరికయై యున్నది. అందువలన పాత నిబంధన కాలములో దేవుని ఆలయమును పవిత్రముగా యుంచాలనే దేవుని ఆజ్ఞలు తీవ్రమైనవి. ఇప్పుడు వాటిని మనము గ్రహించగలము. దేవుని ఆలయమును ఎట్లు నిర్మించాలో, అందులో ఎవరు పరిచర్య చేయాలో మొదలగు వాటిని గూర్చి దేవుడు ప్రత్యేక హెచ్చరికల నిచ్చియున్నారు. ఆలయము లోని పరికరములన్నియు రక్తముతో శుద్ధి చేయబడవలెను. యాజకులు కూడా తమ్మును తాము శుద్ధి చేసికొనవలెను. "నా పరిశుద్ధ స్థలమును మన్నించవలెను.

నేను యెహోవాను" అని ఆయన ఆజ్ఞాపిం చెను (లేవీ 19:30). మరియు "అపవిత్రుడు పాపశుద్ధి చేసికొనని యెడల అట్టి మనుష్యుడు సమాజములోనుండి కొట్టివేయబడును; వాడు యెహోవా పరిశుద్ధ స్థలమును అపవిత్రపరచెను" (సంఖ్యా 19:20). భౌతిక ఆలయమునే ఇంత పవిత్రముగా యుంచాలని దేవుడు కాంక్షించియుంటే, ఆయన ఆత్మీయ మందిరము ఇంకెంత పవిత్రముగా యుండాలని ఆయన కోరును?

దేవుని పరిశుద్ధ స్థలమును పవిత్రముగా యుంచుటకు మనము చాల జాగ్రత్త వహించాలి. పాత దేవాలయమును అపవిత్రపరచినట్లు మన ఆత్మీయ ఆలయమును అపవిత్రపరచరాదు. అయినను మన శరీరములను కలుషితము చేసికొని దేవుని ఆత్మీయ ఆలయమును అపవిత్రపరచుచున్నాము. పాపములోనే జీవించుచు యున్న వారిని దేవుడు పాడు చేయును (1 కొరింథీ 6:19-20). మరియు దేవుని ఆరాధనలోనికి ఆయన అనుమతించని సంగతులను చేర్చితే ఆయన ఆలయము (సంఘము) కలుషితమగును.

దేవుని ఆలయమును పాడు చేసేది మరియొకటి యున్నది. అది విభజన. యిది అనేకులను ఆశ్చర్యపరచవచ్చును. కాని పౌలు ఇట్లు వ్రాసాడు: "మీలో కలహములును, అసూయయు ఉండగా మీరు శరీరసంబంధులైన మనుష్యరీతిగా నడుచుకొనువారు కాదా?" (1 కొరింథీ 3:3). అవును నిజమే. ఈలోక సంబంధమైనది, శరీర సంబంధమైనది యేదీ దేవుని ఆలయములో ఉండకూడదు. అయినను సంఘములో కలహములు, చీలికలు, కొట్లాటలను గూర్చి తరుచు వినుచునే యుంటాము. అసూయలు, కలహములు సంఘములో ప్రవేశింపనిస్తే, మనము దేవుని ఆలయమును పాడుచేయుచున్నాము. దేవుడు మనలను పాడు చేయును (1 కొరింథీ 3:17).

మనము ఆలయమును అపవిత్రము చేసినప్పుడు దేవుడు దానిలో నివసించరు. మరియు దేవుని కలసికొనే స్థలము యేమీ మనకుండదు. అట్టిది జరుగకూడదని మనం అందరము భావిస్తాము. గనుక అపవిత్రమైనది యేమీ సంఘములో ప్రవేశించకుండా జాగ్రత్తపడాలి. ఏలయనగా "నేను పరిశుద్ధుడనైయున్న ప్రకారము మీరును పరిశుద్ధులుగా యుండుడి" యని వ్రాయబడియున్నది (1 పేతురు 1:10).

– జెర్రీ బేట్స్



# ఇరుకుమార్గము

# (The Narrow Way)

***- John Harris***

యేసు కొండమీద నుండి చేసిన గొప్ప ప్రసంగములో ఇట్లు చెప్పారు. "ఇరుకు ద్వారమున ప్రవేశించుడి, నాశనమునకు పోవు ద్వారము వెడల్పును, ఆ దారి విశాలమునై యున్నవి, దాని ద్వారా ప్రవేశించువారు అనేకులు. జీవమునకు పోవు ద్వారము ఇరుకును, ఆ దారి సంకుచితమునైయున్నది, దాని కనుగొను వారు కొందరే" (మత్తయి 7:13-14).

రెండు మార్గములను గూర్చి యేసు విశదముగా బోధించారు. విశాల మార్గము నాశనమునకును, ఇరుకు మార్గము జీవమునకును నడిపించును. నాశనమునకు పోవు విశాల మార్గములో అనేకులుందురు. గాని ఇరుకు మార్గమున పోవు వారు కొందరే. ఆ దారి సంకుచితమైనది అనగా ఇరుకైనది.

ఇరుకు మార్గమున పయనించాలంటే తన్ను తాను ఉపేక్షించుకోవాలి, వినయము కలిగియుండాలి, ఈ మార్గము క్రీస్తులోయున్న జీవమునకు నడిపించును. "దేవుడు మనకు నిత్య జీవమును దయచేసెను" ఈ జీవము ఆయన కుమారుని యందున్నది, దేవుని కుమారుని అంగీకరింపని వాడు జీవము గలవాడు. దేవుని కుమారుని అంగీకరింపనివాడు జీవము లేనివాడే" (1 యోహాను 5:11-12). మానవులు తమ్మును తాము ఉపేక్షించుకొని వినయముతో యేసును వెంబడిస్తే ఈ జీవమును పొందగలరు. "ఇచ్ఛయించువానిని జీవజలమును ఉచితముగా పుచ్చుకొననిమ్ము" (ప్రక 22:17). "ప్రయాసపడి భారము మోపికొనుచున్న సమస్త జనులారా, నా యొద్దకు రండి, నేను మీకు విశ్రాంతి కలుగజేతును, "అని యేసు పిలుచుచున్నారు (మత్తయి 11:28). గాని "మీకు జీవము కలుగునట్లు మీరు నా యొద్దకు రారు" అని కూడ ఆయన చెప్పారు (యొహాను 5:40).

అందుకే "దేవుడు తగిన సమయమందు మిమ్మును హెచ్చించునట్లు ఆయన బలిష్టమైన చేతి క్రింద దీనమనస్కులై యుండుడి" యని పేతురు చెప్పుచున్నాడు (1పేతురు 5:6). "ఎవడైనను నన్ను వెంబడింపగోరిన యెడల తన్నుతాను ఉపేక్షించుకొని తన సిలువనెత్తుకొని నన్ను వెంబడింపవలెనని" ప్రభువు చెప్పారు (మత్తయి 16:24). ఇరుకు మార్గమున పయనించాలంటే ఒకడు ఎట్లుండాలో ఈ లేఖనము

లన్నీ మనకు తెలియజేయుచున్నాయి.

మనుష్యులు తగ్గించుకొనకపోతే తమ్మును తాము ఉపేక్షించుకొనకపోతే యేసు వారిని ఉపయోగించుకొనలేరు. గర్వానికి అహంకారానికి ఇరుకుమార్గము చాల సంకుచితమైనది. వాటికి అక్కడ తావు లేదు. వినయవిధేయతలు గలవారు ఇరుకుమార్గములో పయనిస్తారు.

మత శాఖలకు కూడ ఇరుకు మార్గము చాల సంకుచితమైనది. ఈ ఇరుకు మార్గములో పయనించగల ఒక్క మత శాఖయైనను భూమిపై లేదు. మత శాఖలు మానవ కల్పితములు. అవి విభేదములు సృజించును. భేదములు, కలహములు, అసూయలు సృజించును (1 కొరింథీ 1:10, యోహాను 17:21). మత శాఖల బోధన చేయు వాడెవడైనను ఇరుకు మార్గములో యుండలేడు. మేము ఇరుకుమార్గములో యున్నామని వారిలో కొందరనుకొంటారు. గాని వారు మోసగింపబడ్డారు. "ఒకని యెదుట సరియైనదిగా కనబడు మార్గము కలదు. అయితే తుదకు అది మరణమునకు త్రోవ తీయును" (సామెతలు 14:12).

ప్రజలు డినామినేషన్‌లలో చేరి వారి ధనాన్ని, తలాంతులను ఆ సంస్థల కుపయోగిస్తే వారు ఇరుకుమార్గమును ఎంచుకొన్నవారు కాదు, దేవుని వాక్యము మానవ కల్పిత మతశాఖలకు అనుమతి నియ్యలేదు, మానవ కల్పిత బోధలు, అబద్ధ బోధకులు పయనించడానికి ఇరుకు మార్గము చాలా ఇరుకైనది.

క్రీస్తు సంఘము కంటే డినామినేషన్లు పెద్దవైనవని కొందరు గొప్పలు చెప్పుకొంటారు. అయితే యిది సత్యము కాదు. జల ప్రళయములో నాశనమైన వారు ఎంతో ఎక్కువ మంది, గాని ఓడలో యుండి రక్షింపబడినవారు ఎనిమిది మందియే. అయితేదేవుని పక్షమున, సత్యము పక్షమున యుంటే అదియే గొప్పది. ఇరుకుమార్గమున నుండు వారు కొందరే యని ప్రభువు చెప్పారు. జీవమునకు పోవు మార్గములో మనము పయనించాలి. ప్రభువునందు విశ్వసించాలి. మారు మనస్సు పొంది బాప్తిస్మము పొందితే ఇరుకు మార్గములో ప్రవేశిస్తాము. "ఆయన వెలుగులోయున్న ప్రకారము మనమును వెలుగులో నడిచిన యెడల అన్యోన్య సహవాసము గలవారమై యుందుము. అప్పుడు ఆయన కుమారుడైన యేసు రక్తము ప్రతి పాపమునుండి మనలను పవిత్రులనుగా చేయును (1 యోహాను 1:7).

– జాన్ హేరిస్



# మేము మనుష్యులను ప్రేరేపించుచున్నాము
## (We Persuade Men)

"కావున మేము ప్రభువు విషయమైన భయము నెరిగి మనుష్యులను ప్రేరేపించుచున్నాము" అని అపొ.పౌలు చెప్పాడు (2 కొరింథీ 5:11). రాబోవు చున్న తీర్పు ఖచ్చితం. ఎందుకనగా తాను జరిగించిన క్రియల చొప్పున అవి మంచివైనను సరే చెడ్డవైనను సరే దేహముతో జరిగించిన వాటి ఫలమును ప్రతివాడు పొందునట్లు మనమందరము క్రీస్తు న్యాయ పీఠము ఎదుట ప్రత్యక్షము కావలయును" (2 కొరింథీ 5:10). బైబిలు నందలి గొప్ప వ్యక్తులకు రాబోవుచున్న తీర్పును గూర్చి తెలియజేస్తే వారు ఎట్లు స్పందించియుందురు?

- హనోకు దానిని నమ్మియుండును
- నోవహు శంకించి యుండడు
- అబ్రహాము తక్షణమే దాని కొరకు సిద్ధపడి యుండును
- ఆ వర్తమానము తెలియజేయుటకు మోషే ఇశ్రాయేలీయులనందరినీ సమావేశపరచియుండును.
- యెషయా, యిర్మియాలు ప్రజలను హెచ్చరించియుందురు.
- దానియేలు దానిని గంభీరముగా ప్రకటించి యుండును.
- ఏలియా ఎలీషాలు యింటిపై కప్పులనుండి దానిని గూర్చి ప్రకటించి యుందురు.
- మత్తయి, మార్కు, లూకా, యోహాను, పేతురు, పౌలు, యాకోబు, యూదాలు దాని యదార్థతను గూర్చిన రుజువులను మనకు సమర్పించి యుందురు. తీర్పుదినము వచ్చుచున్నది.

గొర్రెపిల్ల జీవగ్రంథములో నీ పేరు లిఖించబడియుండని యెడల నీవు యేసు ప్రభువునందు విశ్వాసముంచి పాపముల విషయమై మారు మనస్సునొంది, ఆయన నామమును ఒప్పుకొనుచు పాపక్షమాపణ నిమిత్తము బాప్తిస్మము పొందవలెనని నిన్ను ప్రేరేపించుచున్నాను. (గలతీ 3:26-27; అపొ.కా. 2:38; అపొ.కా. 8: 35-40).


నీ పేరు జీవగ్రంథమందు వ్రాయబడియున్న యెడల అదెన్నడు తుడిచివేయబడకుండునట్లు నీ శేష జీవితమును జీవించవలెనని నిన్ను ప్రేరేపించుచున్నాను. (ప్రకటన 2:10).

# యేసు ఎక్కడ పాలించుచున్నారు?

# (Where is Jesus Reigning?)

*-Bill Nicks*

క్రీ॥శ॥33లో పెంతెకోస్తు దినమున దేవుడు క్రీస్తును దావీదు సింహాసనము మీద కూర్చుండబెట్టుదునను మాటను పేతురు వక్కాణించాడు (అపో.కా.2: 30-35). దావీదు తన్ను గూర్చి గాక యేసునుగూర్చి పలికెనని చెబుతు కీర్తన 16:8-11 వచనముల నతడు ఎత్తి చూపించాడు.



అపొస్తలులు బోధించిన సువార్తను విని మూడు వేల మంది పెంతెకోస్తు దినమున క్రీ॥శ॥33లో యెరూషలేములో బాప్తిస్మము పొందగా క్రీస్తు యొక్క ఏలుబడి ఆరంభమాయెను (అపో.కా. 2:37-47). ఆయన తన శత్రువులను తన పాదముల క్రింద పాదపీఠముగా ఉంచువరకు ఆయన ఏలుబడి కొనసాగును (అపో.కా.2:34-35). "ఎందుకనగా తన శత్రువులందరినీ తన పాదముల క్రింద ఉంచువరకు ఆయన రాజ్య పరిపాలన చేయుచుండవలెను. కడపట నశింపజేయబడు శత్రువు మరణము (1 కొరింథీ 15:25).

అయితే యూదులు ఆయనను సిలువ వేసి చంపినందువలన ఆయన తన రాజ్యస్థాపనను వాయిదా వేసుకొనెనని కొందరు చెప్పుదురు. "దేవుడు మన ప్రభువైన క్రీస్తు యేసు నందు చేసిన నిత్యసంకల్పమును" యిది నిష్ప్రయోజనము చేయుచున్నది. గనుక కొందరు తలంచునది బైబిలు వ్యతిరేకము (ఎఫెసీ 3:10).

పైవారి అభిప్రాయమును బట్టి యేసు తన రాజ్యమును ఇంకా స్థాపించవలసి

యున్నది. అది స్థాపించబడినప్పుడు భూమిమీద యెరూషలేము నుండి వెయ్యి సంవత్సరములు ఆయన పాలించును. యిది ప్రఖ్యాత సిద్ధాంతము గాని దానికి బైబిలు ఆధారము ఏమీలేదు. నిజానికి అది బైబిలు విరుద్ధము. పెంతెకోస్తుకు ముందు దేవుని రాజ్యము ఆసన్నమై యున్నదని చెప్పబడిన వాక్యములకిది విరుద్ధము. పెంతెకోస్తు తరువాత రాజ్యము స్థాపించబడియున్నట్లు చెప్పు వచనములకది విరుద్ధము (కొలస్స 1:13; ప్రక 1:9).

యేసు మరల వచ్చినప్పుడు నిజంగా యెరూషలేములో సింహాసనముపై యుండి ఏలుబడి చేయుట సాధ్యపడదు. యిర్మియా 22:28–30 యిది సత్యమని నిరూపించుచున్నది. "కొన్యా అను యితడు హేయమైన ఓటి కుండ వంటి వాడా? పనికిమాలిన ఘటమా? అతడును అతని సంతానమును విసరి వేయబడి, తామెరుగని దేశము లోనికి ఏల త్రోయబడితిరి? యెహోవా ఈలాగు సెలవిచ్చుచున్నాడు. – సంతానహీనుడనియు, తన దినములలో వర్ధిల్లని వాడనియు ఈ మనుష్యుని గూర్చి వ్రాయుడి, అతని సంతానములో ఎవడును వర్ధిల్లడు వారిలో ఎవడును దావీదు సింహాసనమందును కూర్చుండడు; ఇక మీదట యూదాలో ఎవడును రాజుగా ఉండడు". కొన్యా దావీదు నుండి ఉద్భవించాడు, యేసు దావీదు సంతతివాడు (మత్తయి 1:6–12).

యేసుక్రీస్తు ఇప్పుడు ఒక ఆత్మీయ రాజ్యమును ఏలుచున్నాడనుటకు ఇది తిరుగులేని రుజువు. ఆ రాజ్యమే ఆయన సంఘము. ఆయన మృతులలో నుండి లేచిన తరువాత పెంతెకోస్తు దినమునుండి ఆయన దానిని పాలించుచున్నారు. ఆయన మరల వచ్చి తన పరిశుద్ధులను తనతో కూడ తీసికొని వెళ్ళువరకు పాలించుచుయుండును. ఆయన రాకడకు ముందు చనిపోయిన భక్తులకు, ఆయన వచ్చేసరికి సజీవులై యున్న వారిని ఆయన తనతో కొనిపోవును "కాగా సదాకాలము మనము ప్రభువుతో యుందుము" (1 థెస్స 4:14–17).

నిజానికి ఇప్పుడు యేసు ప్రభువు రాజులకు రాజుగాను, ప్రభువులకు ప్రభువుగాను పాలించుచున్నారు (1 తిమో 6:15; ప్రక 19:16). ఆయన రాజ్యములో ప్రవేశించాలంటే మనము ఆత్మమూలముగాను, నీటి మూలముగా తిరిగి జన్మించాలి (యోహాను 3:5) మరియు అంతము వరకు నమ్మకముగా యుండాలి. "మనమాయనతో కూడ చనిపోయినవారమైతే ఆయనతో కూడ బ్రతుకుదుము. సహించిన వారమైతే ఆయనతో కూడ ఏలుదుము. ఆయనను ఎరుగమంటే మనలను ఆయన యెరుగ నను (2తిమో 2:11).

– బిల్‌నిక్స్

# రక్షణ, ఎవరికి అవసరము?

## (Salvation, Who needs it?)

*- Allen Webster*

"సహోదరులారా, మీ పిలుపును ఏర్పాటును నిశ్చయము చేసికొనుటకు మరి జాగ్రత్తపడుడి" (2 పేతురు 1:10). "జీవముకు పోవు ద్వారము ఇరుకును ఆదారి సంకుచితమునైయున్నదని" యేసు చెప్పెను (మత్తయి 7:13-14). పరలోకములో ప్రవేశించుట ఎంత కష్టమో యేసు చెబితే, దానిని గూర్చి శిష్యులు ఆశ్చర్యపడిరి. ప్రభువా రక్షణ పొందువారు కొద్దిమందేనా? అని వారాయననడిగిరి (మత్త 19:23-26; లూకా 13:23-24). అలాగైతే ఎవరు రక్షణ పొందగలరని వారడిగిరి. గనుక ఎవరు రక్షణ పొందగలరో, రక్షణ ఎవరికి అవసరమో తెలిసికొందము.

**భక్తిపరులకు రక్షణ అవసరము :-** (అపొ.కా. 2:1-47). క్రీ॥శ॥33లో యేసు పునరుత్థానుడైన తరువాత మొదటి పెంతెకోస్తునాడు యెరూషలేములో ఆకాశము క్రిందనుండు ప్రతి జనములో నుండి వచ్చిన భక్తిగల యూదులు కాపురముండిరి (అపొ.కా. 2:5). వారు పలు ప్రాంతములనుండి, బహుదూరము నుండి, వ్యయ ప్రయాసల కోర్చి అక్కడ కూడియుండిరి. అంత భక్తి శ్రద్ధలు గలవారికి రక్షణ అవసరమా? వారు నశించిన స్థితిలో యున్నారని, రక్షింపబడుటకు చర్య తీసికోవాలని పేతురు వారికి బోధించాడు. (అపొ.కా. 2:22, 37-38), యేసునందు విశ్వసించి, మారు మనస్సు పొంది పాపక్షమాపణ నిమిత్తము వారు బాప్తిస్మము పొందాలని పేతురు మూడు వేల మందిని ఆనాడు ఒప్పించాడు. (అపొ.కా. 2:37-41). బాప్తిస్మము పొందిన వారిని ప్రభువు తన సంఘము తో చేర్చెనని గ్రంధ కర్తయైన లూకా వ్రాసాడు (అపొ.కా. 2:47).

నేడు కూడ భక్తిపరులైన వారనేకులకు రక్షణ అవసరము. వారు మార్పు జెందాలి. భక్తి కంటె ఎక్కువను దేవుడు చూచుచున్నారు. అట్టి వారి భక్తి పూర్వక చర్యలు ఆయన వాక్యమునసురించి యున్నావో లేదోయని ఆయన గమనించు చున్నారు (కీర్తన 19:8). అబద్ధ సిద్ధాంత ములకు మతశాఖలకు కట్టుబడి భక్తిగా యుంటే రక్షింపబడలేము. (గలతీ 1:6-9; రోమా 9:2-3; 10:1-3).

**అద్భుతముల వలన మోసగించబడిన వారికి రక్షణ అవసరము:-** గారడీవాడైన సీమోను బహుకాలము గారడీచేయుచు సమరయు ప్రజలను విభ్రాంతి పరచు

చుండెను. దేవుని మహాశక్తి యనబడిన వాడు ఇతడేయని వారు చెప్పుకొను చుండిరి. (అపొ.కా. 8:10-11) గాని వారు దేవుని యొక్క నిజశక్తిని చూచి, అయన సత్యవాక్యమును ఫిలిప్పుద్వారా విని వారు యేసు వైపు మార్పు జెంది బాప్తిస్మము పొందిరి (అపొ.కా. 8:12). వారివలెనేడు కూడ అనేకు లున్నారు.

**సీమోను లాంటి గారడీవాళ్ళు నేడు అనేకులున్నారు.** వారు గొప్ప "అద్భుతములు చేయు, స్వస్థత వరము" గల భక్తులమని ప్రకటించుకొంటారు. దేవుని మర్మములు తమకు తెలియునని, భవిష్యత్తును చెప్పగలమని వారు ప్రకటించుకొంటారు. అనేకులు ఈ గారడీవాని సమరయులవలె వెంబడి స్తారు. అయితే ప్రజలనేలాగు ప్రలోభ పెట్టాలో వారి 'అద్భుత క్రియలు' తెర వెనుక ముందే ఏలాగు ప్రాక్టీసు చేసుకొంటారో ప్రజలకు వారు తెలియ జెప్పరు. వారు సైకాలజీ చదువుదురు. వారి దగ్గరకు వచ్చే 'రోగులను' ముందే వాళ్ళు ఇంటర్వ్యూ చేస్తారు. వారి గారడీతో ఏకీభవించిన వారు, గారడీ చేస్తున్నవారు కూడ సత్యములోనికి మరలాలి.

ఇప్పుడు అద్భుతములన్నీ ఆగిపోయి నవి (1కొరి 13:8-10). గాని యేసు పనిచేయుట విరమించుకోలేదు. అయన యొద్దకు వచ్చు వారిని అయన ఇప్పుడును రక్షించుచున్నారు (మత్త 11:28-30). బైబిలును బట్టియే మనకు తీర్పు తీర్చబడునుగనుక, మన భక్తి విశ్వాసములు మన అభిప్రాయములు, మనోభావములపై గాక బైబిలు పైనే ఆధారపడియుండవలెను.

**నిష్కపటులేగాని సత్యమునకు విధే యులు కాని వారికి రక్షణ అవసరము:** (అపొ.కా. 10:1-48)

కొర్నేలి చాల మంచివాడు, భక్తి పరుడు, దానధర్మములు చేయువాడు. (అపొ.కా. 10:2). రక్షణ పొందనక్కర్లేని వాడుగా కొర్నేలి మనకగుపడుతాడు. అయితే రక్షణ పొందుటకేమి చేయవలెనో తెలిసికొనుటకు పేతురుకు కబురు పంపమని అతనికి తెలియజేయబడినది (అపొ.కా. 10:48). నేడు అనేకులు సత్ప్రవర్తన గలవారు, దానధర్మములు చేస్తారు, చట్టప్రకారము జీవిస్తారు, బహుశా ఆదివారం చర్చికి వెళతారు, అయితే "మంచిగాయుంటేనే సరిపోదు. బాప్తిస్మము పొంది వారు క్రీస్తు సంఘ సభ్యులవ్వాలని" కొర్నేలి వారికి సలహా నిచ్చుచున్నాడు. (గలతీ 3:26-27).

**దేవుని వాక్యమును బొత్తిగా ఎరుగని వారికి రక్షణ అవసరము** (అపొ.కా. 10:30-34)

ఫిలప్పీయిలో పౌలు సీలలను బంధించియుంచిన చెరసాల అధిపతి యూదుడు కాదు, అందువలన రాబోవు రక్షకుని గూర్చి పాతనిబంధన చెప్పునది అతడెరిగినవాడు కాదు (అపొ.కా. 16:31). అతడు ప్రభువైన యేసు నందు విశ్వాసముంచవలెనని పౌలు, సీలాలు చెప్పగా అతడును, అతని యింటి వారును

బాప్తిస్మము పొందిరి (అపొ.కా. 16:34). గనుక క్రీస్తును గూర్చి ఎరుగని వారు ఆయనను గూర్చి విని, విశ్వసించి, బాప్తిస్మము పొంది రక్షణ పొందుట అవసరం.

**పాపములో జీవించుచున్న వారికి రక్షణ అవసరము (అపొ.కా. 18:8)**

మొదటి శతాబ్దములో కొరింధులో యున్నవారు అక్రమము, అవినీతిలతో జీవించుచున్నవారు, వారికి సువార్త బోధించుటకు అపొ.పౌలు భయపడ్డాడు (అపొ.కా. 18:9–10; 1 కొరి 2:3). గాని ప్రభువు పౌలును కొరింధునకు పంపించారు. దేవుని వాక్యమును విని అనేకులు విశ్వసించి బాప్తిస్మము పొందారు. ఎంత ఘోర పాపినైనను రక్షించే దేవుని శక్తి, సువార్తయైయున్నది (రోమా 1:16).

త్రాగుబోతులు, వ్యభిచారులు, దొంగలు, మాదకపదార్ధముల బానిసలు మొదలైన వారినందరినీ మార్చగల శక్తి సువార్తలో యున్నది. యేసు ప్రభువు పాపులతోను, సుంకరులతోను సహవాసము చేసారు. వారిని బాగుచేసారు (లూకా 7:34) నేడు కూడా ఆయన అట్టివారిని బాగుచేస్తారు. ప్రజలు మారుదురు అది సులభం కాదు కాని, అది సాధ్యమే. నన్ను బలపరచు వానియందే నేను సమస్తమును చేయగలనని పౌలు చెప్పాడు (ఫిలిప్పీ 4:13). నీవు పాపములో జీవించువాడవైతే రక్షణ నీకవసరము.

**గతంలో సరిగా బాప్తిస్మము పొందని వారికి రక్షణ అవసరం (అపొ.కా. 19:1–6).**

ఎఫెసు పట్టణంలో పౌలు గతంలో బాప్తిస్మము పొందిన కొందరి శిశ్యులను పౌలు కనుగొన్నాడు. అయితే వారు సరిగా బాప్తిస్మము పొందలేదు గనుక వారు ప్రభువైన యేసు నామమున బాప్తిస్మము పొందాలని వారికి బోధించాడు. నేడు కూడ గతంలో పలు విధాలుగా, పలు కారణాల కొరకు బాప్తిస్మము పొందిన వారున్నారు. వారు రక్షింపబడుటకు లేఖనార్ధమైన బాప్తిస్మము పొందాలి. కొందరు పసిపిల్లలుగా యున్నప్పుడో, పెద్దలైనప్పుడో చిలకరింపు పొంది యుండవచ్చును. మరికొందరు బాప్తిస్మమునకు ముందే రక్షింపబడ్డారని బోధింపబడి యుండవచ్చును. ఇంకా కొందరు వేర్వేరు విధానాల్లో బాప్తిస్మము పొందియుండవచ్చును. ఇట్టి వారందరు రక్షింపబడాలంటే క్రీస్తు బోధించిన బాప్తిస్మము పొందాలి (మార్కు 16:16; అపొ.కా. 22:16; 1 పేతురు 3:21; అపొ.కా. 2:38).


రక్షణ ఎవరికి అవసరము? మనకందరికీ యని మనమెరుగుదుము. దేవుడు నిన్ను రక్షించాలని కోరుచున్నారు. సాతాను నిన్ను తన పక్షమున చేర్చుకోవాలనుకొనుచున్నాడు. నీవెవరి పక్షముంటావు?

**–అలెన్ వెబ్‌స్టర్**

# నీకు నీవే నిశ్చయించుకో

## (Choose for Yourself)

*- Loy Mitchell*



"యెహోవాను సేవించుట మీ దృష్టికి కీడని తోచిన యెడల మీరు ఎవని సేవించెదరో, నది అద్దరిని మీ పితరులు సేవించిన దేవతలను సేవింతురో మోరీయుల దేశమున మీరు నివసించు చున్నారే వారి దేవతలను సేవించెదరో నేడు మీరు కోరుకొనుడి; మీరెవరిని సేవించకోరుకొనినను, నేనును నా

యింటివారును యెహోవాను సేవించెదము (యెహోషువ 24:15).

**మానవునికి ఎంచుకొనే శక్తి యున్నది:-** మానవుని దేవుడు అట్లు సృజించారు. అతడొక మర యంత్రము కాదు గనుక మంచిగాని చెడుగాని చేయుటకు నిశ్చయించుకొనగలడు. తానెట్లు జీవించగోరునో దానిని మానవుడు ఎంచుకొనవచ్చును. యెహోషువ తన దినముల అంతమందు, ప్రజలకున్న ఎంపిక శక్తిని గూర్చి జ్ఞాపకము చేసాడు. మానవుడు చేయు ప్రతి నిర్ణయముకు కొన్ని పర్యవసానములు లేక దీవెనలుంటాయని అతడు తెలిసికొనవలెను. పాపము చేయుటకు మానవుడు ఎంచుకొంటే, పాపము వలన వచ్చు జీతము మరణము. కాని మానవుడుయేసును ఎంచుకొంటే దానికి నిత్య జీవము కలదు.

**ఆ ఎంపిక ఈనాడే చేయవలెను:-** "ఏదో ఒక రోజున నేను క్రైస్తవుడ నవుతానని" కొందరు చెబుతారు. ఏదో ఒకరోజున నేను మారుమనస్సు పొంది బాప్తిస్మము పొందుతాను అని మరి కొందరు చెబుతారు. యేసును నీవు ఈ రోజు ఎంచుకొనకపోతే వేరే ఒక దేవునికి సేవ చేయుటకు నీవు ఎంచుకొన్నావు. యేసును వెంబడించని వారందరు వేరే ఇంకొకని వెంబడించుచున్నారు. మనము లేచే ప్రతిదినము, ఒక నిర్ణయం తీసుకొంటాము. ఈరోజు నీవెవరిని వెంబడిస్తావు? మారు మనస్సు పొందువారందరికీ ఈనాడే రక్షణ దినము.

**యెహోషువ మంచి నిర్ణయాన్ని గైకొన్నాడు :** తానును తన యింటివారును యెహోవాను సేవింతురని చెప్పాడు. అతడు ధైర్యము గలవాడు. విశ్వాసము గలవాడు. యెహోవా సజీవుడైన ఏకైక దేవుడని యెహోషువా ఎరుగును. ఈ దేవుడు వారిని ఐగుప్తు బానిసత్వము నుండి విమోచించారు. తాను ఎంచుకొన్న దేవుడు వారిని అరణ్యములో నలుబది సంవత్సరములు పోషించాడు. ఈ దేవుడే వారిని పాలు, తేనెలు ప్రవహించు దేశమునకు నడిపించినవాడు. దేవుడు వారిని పోషించి సంరక్షించారు.


**నీవు ఈరోజు ఒక నిర్ణయమునకు రావాలి:-** నీవు ధనాన్ని, సుఖాన్ని విలాసాన్ని సేవిస్తావా? నీవు ఈ లోక సృష్టికర్త యైన నిజదేవుడిని సేవిస్తావా? ఈరోజే యేసుక్రీస్తును నీవు ఎంచుకోవాలని హెచ్చరించుచున్నాను. ఆయన యందు విశ్వాసముంచుము. పాపముల విషయమై మారుమనస్సు పొంది బాప్తిస్మము పొందుము (అపో.కా. 2:38; 3:19). నీవాయన విశ్వాసము నుండి తొలగిపోయిన యెడల ఈరోజే మారుమనస్సు పొంది క్షమాపణ కొరకు ప్రార్థించుము (అపో.కా. 8:22). ఆయన యొద్దకు తిరిగివచ్చి ఆయనను సేవించుము. నీవు దీవించబడ్తావు.

**- లోయ్ మిచెల్**

# నోవహు దినములు ఏలాగుండెనో

## (As the Days of Noah Were...)

*- Kabita Gootam*



యేసు దేవాలయము నుండి బయలు దేరి వెళ్ళుచుండగా ఆయన శిష్యులాయన యొద్దకు వచ్చి - దేవాలయుపు వినాశనము ఎప్పుడు జరుగును? మరియు నీ రాకడకును ఈ యుగ సమాప్తికి సూచనలేవి? అని రెండు ప్రశ్నలు అడిగిరి. మొదటి ప్రశ్నకు సమాధానం మత్తయి 24:1-26 నందు వ్రాయబడియున్నది. మరియు రెండవ ప్రశ్నకు సమాధానం 27 నుండి 50 వచనములయందు చదవగలము.

"అయితే ఆ దినమును గూర్చియు ఆ గడియను గూర్చియు తండ్రి మాత్రమే (యెరుగును) గాని యే మనుష్యుడైనను పరలోకమందలి దూతలైనను, కుమారు డైనను ఎరుగరు. నోవహు దినములు ఏలాగుండెనో మనుష్య కుమారుని రాకడయును అలాగే ఉండును. "జల ప్రళయమునకు ముందటి దినములలో నోవహు ఓడలోనికి వెళ్ళిన దినము

వరకు, వారు తినుచు త్రాగుచు పెండ్లి చేసికొనుచు పెండ్లికిచ్చుచు నుండి జలప్రళయము వచ్చి అందరిని కొట్టుకొనిపోవు వరకు ఎరుగకపోయిరి; అలాగుననే మనుష్య కుమారుని రాకడయు ఉండును" (మత్తయి 24:36-39). ఇక్కడ యేసు ఆయన యొక్క రెండవ రాకడను నోవహు సమయములో జలప్రళయము ముందు రోజులతో పోల్చెను.

## కృపనొందిన నోవహు:

నరులు భూమి మీద విస్తరింప నారంభించిన తరువాత వారి చెడుతనము భూమి మీద గొప్పదని దేవుడు చూచి నరులను చేసినందుకు సంతాపము నొంది జలప్రళయము ద్వారా భూమిని నాశనము చేయాలని నిర్ణయించుకొనెను. అయితే నీతి పరుడైన నోవహు యెహోవా దృష్టి యందు కృపపొందిన వాడాయెను. దేవుడు నోవహును చితిసారకపు మ్రానుతో ఓడను చేసి అరలు పెట్టవలెనని అజ్ఞాపించెను. నోవహును అతని భార్యయు, అతని కుమారులును, కోడండ్రును సమస్త జీవులలో ప్రతి జాతిలోని రెండేసి చొప్పున ఓడలోనికి ప్రవేశించి నలుబది పగళ్ళును, నలుబది రాత్రులును కురిసిన ప్రచండ వర్షము నుండి రక్షింపబడెను. అప్పటి దినము వరకు భూమి మీద వర్షము పడలేదు. అయినా నోవహు దేవుడు అజ్ఞాపించిన ప్రకారము యావత్తును చేసెను. "విశ్వాసమును బట్టి నోవహు అదివరకు చూడని సంగతులను గూర్చి దేవునిచేత హెచ్చరింపబడి భయభక్తులు గలవాడై తన యింటి వారి రక్షణ కొరకు ఒక ఓడను సిద్ధము చేసెను. అందువలన అతడు లోకము మీద నేరస్థాపన చేసి విశ్వాసమును బట్టి కలుగు నీతికి వారసుడాయెను" (హెబ్రీ 11:7). మరియు ఆయన పూర్వకాలమందున్న లోకమును విడిచిపెట్టక, భక్తిహీనుల సమూహము మీదికి జలప్రళయమును రప్పించినప్పుడు, నీతిని ప్రకటించిన నోవహును మరి యేడుగురిని కాపాడెను (2 పేతురు 2:5).

మనము జల ప్రళయము ముందటి తరమును రెండు వర్గాలుగా విభజించ గలము. నోవహు అతని భార్యయు, అతని కుమారులు, అతని కోడండ్రును ఓడలోనికి ప్రవేశించి రక్షింపబడెను. వీరు మొదటి వర్గము. మరియు రెండవ వర్గమునకు చెందిన ప్రజలు ఓడ వెలుపల ఉన్నవారు తినుచు, త్రాగుచు, పెండ్లి చేసికొనుచు, పెండ్లికిచ్చుచు నుండి జలప్రళయము వచ్చి అందరిని కొట్టుకొని పోవువరకు ఎరుగకపోయిరి (మత్తయి 24:38, 39).

## రెండు వర్గముల ప్రజలు

ఇప్పుడు మనము యేసుక్రీస్తు యొక్క రెండవ రాకడకు ముందు రోజులలో జీవించుచున్నాము. మనము ఈ తరములోను రెండు వర్గాల ప్రజలను

చూడగలము. ఎవరైతే సువార్త విని దానికి విధేయులై ఉన్నారో వారు సురక్షితముగా నోవహు యొక్క కుటుంబము ఓడలో రక్షింపబడినట్లు సంఘముతో చేర్చబడి రక్షింపబడి యున్నారు. ఎవరైతే దేవునికి మరియు దేవునియొుక్క వాక్యమునకు దూరముగా ఉన్నారో వారు రెండవ వర్గమునకు చెందినవారు.

"ఏలయనగా పూర్వము నుండి ఆకాశముండెననియు, నీళ్ళలోనుండియు నీళ్ళవలనను సమకూర్చబడిన భూమియు దేవుని వాక్యము వలన కలిగెననియు వారు బుద్ధిపూర్వకముగా మరతురు. ఆ నీళ్ళవలన అప్పుడున్న లోకము నీటి వరదలో మునిగి నశించెను. అయితే ఇప్పుడున్న ఆకాశమును భూమియు భక్తిహీనుల తీర్పును నాశనమును జరుగు దినము వరకు అగ్నికొరకు నిలువచేయ బడినవై అదే వాక్యము వలన భద్రము చేయబడి యున్నవి" (2పేతురు 3:5-7).

అయితే ఆ దినమును గూర్చియు, ఆ గడియను గూర్చియు తండ్రి మాత్రమే యెరుగును గాని, యే మనుష్యుడైనను పరలోక మందలి దూతలైనను కుమారుడైనను యెరుగడు (మత్తయి 24:36). మీ హృదయములు ఒకవేళ తిండి వలనను మత్తువలనను ఐహిక విచారముల వలనను మందముగా ఉన్నందున ఆ దినము అకస్మాత్తుగా మీ మీదకి ఉరి వచ్చినట్లు రాకుండ మీ విషయమై మీరు జాగ్రత్తగా ఉండుడి. ఆ దినము భూమి యందంతట నివసించు వారందరి మీదకి అకస్మాత్తుగా వచ్చును. కాబట్టి మీరు జరగబోవు వాటినెల్లను తప్పించుకొని, మనుష్య కుమారుని యెదుట నిలువబడుటకు శక్తిగల వారగునట్లు ఎల్లప్పుడును ప్రార్థన చేయుచు మెలకువగా ఉండుడని యేసు చెప్పెను (లూకా 21:34-36). అపొస్తులుడైన పౌలు థెస్సలోనికయుల సంఘమునకు ఈ విధముగా వ్రాసెను. "లోకులు నెమ్మదిగా ఉన్నది, భయ మేమియు లేదని చెప్పుకొను చుండగా, గర్భిణి స్త్రీకి ప్రసవవేదన వచ్చునట్లు వారికి ఆకస్మికముగా నాశనము తటస్థించును గనుక వారెంతమాత్రము తప్పించుకొన లేరు (1 థెస్సలోనికయులు 5:3).

జలప్రళయము ముందటి తరము వారు నోవహు బోధయందు నమ్మిక యుంచలేదు, దానిని లక్ష్యపెట్టలేదు. నోవహును నిర్లక్ష్యము చేసి ఎగతాళి చేసిరి. వారు తినుచు త్రాగుచు పెండ్లిచేసికొనుచు, పెండ్లి కిచ్చుటలో నిమగ్నమైరి. మనము ఇప్పుడు యేసుక్రీస్తు యొక్క రెండవ రాకడ ముందటి సమయములో జీవించు చున్నాము గనుక, రెండవ వర్గపు ప్రజలు వలె నశింపబడకుండ ఉండునట్లు మెలకువగ ఉండి దేవుని కలిసికొనుటకు మనల్ని మనము సిద్ధపరచుకొందుము గాక!

– కవితా గూటం

# ఒక క్రొత్త జీవితము

## (A New Life)

*- Brent Smith*



పాపము వలన కలుగు గొప్ప అంధకారమును, వినాశనమును ఎరిగినవారు క్రీస్తులో యున్న క్రొత్త జీవిత ఆశీర్వాదములను గూర్చి కృతజ్ఞత కలిగియుందురు. “ఎవనికి కొంచెముగా క్షమింపబడునో, వాడు కొంచెముగా


ప్రేమించును". అని యేసు చెప్పెను (లూకా 7:47). వేశ్యయైనా, త్రాగుబోతు అయినా, జగడగొండియైనా, అబద్ధమాడు వాడైనా, దేవుని యొక్క ఆశ్చర్యకరమైన కృప నుండి ఎవడును దూరముగాలేడు. అట్టివాడు దేవుని దగ్గరకు వచ్చుటకు నిరాకరిస్తే తప్ప దేవుని కృప ఎంత పాపినైనా రక్షించగలదు. "మీరు మీ పాపముల చేతను, అపరాధముల చేతను చచ్చినవారై యుండగా..." అని పౌలు ఎఫెసీయులకు వ్రాసాడు (ఎఫెసీ 2:1). చాల కాలము నుండి పాపములో జీవించుచున్నాము, మేము రక్షింపబడుట అసంభవము అని కొందరు తలుస్తారు. క్రీస్తును సిలువ వేయుము అని కేకలు పెట్టిన జన సమూహములోని వారు రక్షింపబడ గలిగితే, నీవు నేను కూడ రక్షింపబడ గలము (అపో.కా. 2:37).

మన జీవితం మరల ఆరభించుకో వచ్చును. పాప అంధకార జీవితమును గూర్చి నీవు విసుకు చెందలేదా? నీవు నీ జీవితాన్ని వెలుగులో జీవించవచ్చును. దేవుడు నిన్ను తీసుకొని, లేపి పరలోకమందు ఆయనతో కూడ కూర్చుండబెట్టును (ఎఫెసీ 2:6). నీవు నీ పాపముల నుండి తిరిగి, మారు మనస్సు పొంది, పాపక్షమాపణ నిమిత్తము బాప్తిస్మము పొందితే, ఆ నీటి సమాధినుండి నూతన జీవితము జీవించుటకు ఆయన నిన్ను లేపును (రోమా 6:1-4). పాపబంధకముల నుండి దేవుడు నిన్ను విడిపించును. క్రీస్తుతో నూతన జీవితం నీకు ఆరంభమగును (రోమా 6:7-8). ప్రజలు మారి మంచిగా జీవించగలరు. నీవు, నేను కూడా మారగలము.

అది సులభము కాదు, గాని సాధ్యమే. పాపజీవితము కూడ సులభము కానే కాదు, దేవుని తట్టు తిరుగుటకు మనము నిశ్చయము చేసికొన్నప్పుడు, ఆయన మనకు సహాయము చేయును.

"దేవుని యొద్దకు రండి; అప్పుడాయన మీ యొద్దకువచ్చును. పాపులారా మీ చేతులను శుభ్రము చేసికొనుడి, ద్విమనస్కులారా, మీ హృదయములను పరిశుద్ధపరచుకొనుడి. వ్యాకుల పడుడి, దుఃఖపడుడి, యేడువుడి. మీ నవ్వు దుఃఖమునకును మీ ఆనందము చింతకును మార్చుకొనుడి. ప్రభువు దృష్టికి మిమ్మును మీరు తగ్గించుకొనుడి.. అప్పుడాయన మిమ్మును హెచ్చించును" (యాకోబు 4:8-10).


- బ్రెంట్ స్మిత్



# ఆయన ప్రత్యక్షమైనప్పుడు

# (When He appears)

*- Clarence DeLoach Sr*



ఆదిమ క్రైస్తవులకు క్రీస్తుయొక్క రెండవరాకడ వివాదాంశము కానేకాదు. దానిని వారు ఆశతో అపేక్షించుచుండిరి. "మన పౌరస్థితి పరలోకమందున్నది. అక్కడనుండి ప్రభువైన యేసుక్రీస్తు అను రక్షకుని నిమిత్తము కనిపెట్టుకొని యున్నాము" అని ఫిలిప్పీ 3:20 చెప్పుచున్నది. మరియు "మనదేహము యొక్క విమోచనము కొరకు కనిపెట్టుచు మనలో మనము

మూలుగుచున్నాము" (రోమా 8:23). మీరు "దేవుని దినపురాకడ కొరకు కనిపెట్టుచు, దానిని ఆశతో అపేక్షించుము. మీరు పరిశుద్ధమైన ప్రవర్తనతోను, భక్తితోను ఎంతో జాగ్రత్త గలవారై యుండవలెను" అని పేతురు చెప్పుచున్నాడు (2పేతురు 3:11, 12). ఈ లేఖనముల వలన ఆదిమ క్రైస్తవులు క్రీస్తు యొక్క రెండవ రాకడ కొరకు ఆశతో, ఆసక్తితో ఎదురు చూచుచుండిరని గ్రాహ్యమగుచున్నది.

"ఆయన ప్రత్యక్షమైనప్పుడు ఆయన యున్నట్లు గానే ఆయనను చూతుము గనుక ఆయనను పోలియుందుమని యెరుగుదుము. ఆయన యందు ఈ నిరీక్షణ పెట్టుకొనిన ప్రతివాడును ఆయన పవిత్రుండైయున్నట్లుగా తన్ను పవిత్రపరచుకొనునని భక్తుడైన యోహాను వ్రాసాడు (1యోహాను 3:2-3). క్రీస్తు యొక్క రెండవ రాకడయందున్న విశ్వాసము క్రైస్తవ జీవితము జీవించుటకు శక్తినను్రగహించును.

**అది ఉత్సాహమునిచ్చును :-** బహుమానము నందిపుచ్చుకొనుటకు అది తగిన ప్రోత్సాహమిచ్చును. ఆయన వచ్చుసరికి సిద్ధముగా యుండుటకంటే లాభకరమైనది ఇంకేమియున్నది. ప్రతి వాని పని ఆదినము దానిని తేట పరచును (1 కొరింథీ 3:13-14). "భళా నమ్మకమైన మంచి దాసుడా నీ యజమాని సంతోష ములో ప్రవేశించుము" అను మాటలు వినుటకంటే శ్రేష్టమైనది ఇంకేమున్నది? (మత్తయి 25:23).

**అది బాధ్యతను సంకల్పించును:** మన పరిచర్యవిషయమై మనము బాధ్యులము. "మేము మీ మధ్యను నెరవేర్చిన కార్యములను చెడగొట్టుకొనక మీరు పూర్ణఫలము పొందునట్లు జాగ్రత్తగా చూచుకొనుడి"యని 2 యోహాను 8లో చెప్పబడియున్నది. నా తోడు ప్రతి మోకాలును నాయెదుట వంగును, ప్రతి నాలుకయు దేవుని స్తుతించును అని ప్రభువు చెప్పుచున్నాడు అని వ్రాయబడి యున్నది. గనుక మనలో ప్రతివాడు తన్ను గూర్చి లెక్క యొప్పగింపవలెను" (రోమా 14:11-12).


**అది భద్రతననుగ్రహించును:-** భవిష్యత్తును గూర్చి మనము ఆందోళన చెందనవసరం లేదు, భయపడనవసరం లేదు. నేను మరల వత్తును అని యేసు చెప్పారు (యోహాను 14:3). అది మన నిరీక్షణ. ధైర్యము, భద్రత, మనం క్రీస్తుకు చెందిన వారము. ఆయన మన కొరకు వచ్చుచున్నారు. ఈలోకములో భద్రత లేదు. మన స్వాస్థ్యము ఇక్కడలేదు. అక్షయమైనదియు, వాడ బారనదియు, నిష్కళంకమైనదియు నైననది మన కొరకు పరలోకంలో దాచబడియున్నది (1 పేతురు 1:41). అదే మన శుభప్రదమైన నిరీక్షణ. ఈ నిరీక్షణను సజీవముగా యుంచుడి.

**- క్లేరెన్స్ డిలోచ్**

# జయించువానికి

## (To him that overcomes)

*- Bill Burton*



ఆసియలోని యేడు సంఘములకు వ్రాయబడిన ప్రతి ఉత్తరము జయించు వానికి వాగ్దానములతో ముగించబడెను. జయించుటను గూర్చి ఇయ్యబడిన హెచ్చరికలలో మనకు అమూల్యమైన పాఠములున్నవి.

"జయించుట" అనగా పోరాటములో జయించుట, ఓడించుట, ఆధిపత్యము సాధించుట, విజయం సాధించుటయని అర్థము. మనం అబద్ధ బోధకులను, ఈ లోకాన్ని, శోధనలను, స్వార్థాన్ని జయించాలి. క్రైస్తవ జీవితము తేలిక యైనదికాదు. దానిలో శ్రద్ధకలిగి పనిచేయాలి. మనం నిబ్బరమైన బుద్ధి కలిగి మెళకువగాయుండాలి. (1 పేతురు 5:8), జ్ఞానుల వలెయుండాలి (ఎఫెసీ 5:15) ఈలోక మర్యాదననుసరించి నడువకూడదు (రోమా 12:2), మనం నిద్రపోతూ, మెళకువగా యుండలేకపోతే ఈ లోకమును మనం జయించలేము. సోమరియైన చెడ్డదాసులను క్రీస్తు అంగీకరించరు.

ప్రకటన గ్రంధములో చెప్పబడిన ఆసియాలోని ఏడుసంఘములకు వ్రాయబడిన ప్రతిలేఖలోను సంఘములో యున్న ప్రతివ్యక్తియొక్క బాధ్యత వక్కాణించబడింది. ఎఫెసులోయున్న సంఘములో "జయించువానికి దేవుని పరదైసులోయున్న జీవ వృక్షఫలములు భుజింపనిత్తును" అని చెప్పబడినది (ప్రక

2:7). సంఘముగా గాక, వ్యక్తిగతముగా మనకు తీర్పుతీర్చబడును. ప్రతి క్రైస్తవుడు తనకుగా తానే వినాలి, తానే జయించాలి. అతడు సహోదరులనుండి, మిత్రుల నుండి సహాయము పొందవచ్చునుగాని చివరకు అతడు వ్యక్తిగతముగా తనకు తానే దేవునికి భాద్యుడైయున్నాడు. "దేవుడు పక్షపాతి కాడు" "మనలో ప్రతివాడు తన్ను గూర్చి లెక్క అప్పగించ వలయును (అపో.కా. 10:34, రోమా 14:12).

**జయించువానికి చెప్పబడిన వాగ్దానములను ఇప్పుడు గమనించుము.**

1. జీవ వృక్ష ఫలములను భుజించే హక్కు (ప్రక 2:7).

2. నిత్యజీవ కిరీటము, రెండవ మరణము వలన ఏహాని కలుగదు (ప్రక 2:10-11).

3. మరుగైన మన్నాను భుజింప జేయబడుట, క్రొత్తపేరు ఇయ్యబడును (ప్రక 2:17).

4. జనుల మీద అధికారము అనుగ్రహింపబడును (ప్రక 2:26).

5. తెల్లని వస్త్రములు ధరించు కొనును, జీవగ్రంథములో అతని పేరుండును, అతని గూర్చి ఒప్పుకొన బడును (ప్రక 3:5).

6. అతడు దేవుని ఆలయములో స్థంభముగా చేయబడును మరియు క్రొత్తపేరు అతని మీద వ్రాయబడును (ప్రక 3:12).

7. జయించువాడు క్రీస్తుతో కూడ సింహాసనమందు కూర్చుండబెట్టబడును (ప్రక 3:21).

ఇవన్నీ ఎంతగొప్ప ఆశీర్వాదములో జయించుటకు ఇయ్యబడిన బహుమానము లెన్నెన్నో గదా!

ఈ ఆశీర్వాదములన్నీ జయించు వానికే వాగ్దానము చేయబడెనని గమనించుము. అంటే మనం జయించక పోతే ఇవన్నీ కోల్పోవుదుము. మరియు దానిలో జయించే శక్తి ఓడిపోయే అవకాశము కూడ ఇమిడియున్నవి. యిది సత్యము కాకపోతే ఈ మాటలు అర్థరహితము. చెప్పబడిన ఆశీర్వాద ముల లిస్టు నొకమారు పరికించుము. ఇన్ని ఆశీర్వాదములను పొందలేకపోతే ఎంతగొప్ప అపజయమో! గనుక మనందరం పెక్కు శ్రద్ధకలిగి జీవించాలి.


– బిల్ బర్టన్



# దేవుడు ఆస్వాదించు ఆరాధన

## (Worship in which God delights)

*- Bobby Dockery*



సరియైన రీతిలో చేయు ఆరాధన వలన దేవుడు ఆనందించునని బైబిలు చెప్పుచున్నది. "భక్తిహీనులు అర్పించు బలులు యెహోవాకు హేయములు. యథార్థవంతుల ప్రార్థన ఆయనకు ఆనందకరము" (సామె 15:8). దేవునికి ప్రీతికరమగు ఆరాధన ఆత్మతోను సత్యముతోను ఉండవలెనని యేసు బోధించారు (యోహాను 4:24).

అయితే మనుష్యులు చేయు ఆరాధనలన్నియు దేవుని చిత్తప్రకారము జరుగుట లేదు. దేవుని సంతోషపరచు ఆరాధనలోని కొన్ని అంశములను దిగువ గమనించుము.

**ఆరాధనలోని సత్సంబంధము అవసరము:-** మనము తండ్రియైన దేవుని ఆరాధించాలని యేసు చెప్పారు (యోహాను 4:23, 24). అనగా ఆరాధన మూర్తికిని ఆరాధకుని మధ్య ఒక సంబంధమున్నది. దేవునితో సన్నిహిత సంబంధము కలిగి ఆయన

కుటుంబములోయున్నవారే ఆయనను కొనియాడగలరు, స్తుతించగలరు. అయితే దేవునితో సరియైన సంబంధము ఏర్పరచుకొనకుండగనే అనేకులు ఆయనను ఆరాధింపబూనుకొంటారు. యిది విచారము. వారి ప్రయాసములు వ్యర్థము.

**ఆరాధనకు సరియైన సిద్ధపాటు అవసరము :-** దేవుని ఆత్మతోను, సత్యముతోను ఆరాధించాలని యేసు చెప్పారు. ఆత్మతో ఆరాధించడం అంటే హృదయముతో మంచి మనస్సుతో ఆరాధించాలి. సరియైన స్వభావము కలిగియుండాలి. ప్రయోజనకరమైనదిగా యుండాలంటే దానికి సిద్ధపాటు అవసరం. మనం ఉద్యోగం కొరకు, వివాహము కొరకు, చదువు కొరకు మొ॥గు వాటనేకముల కొరకు సిద్ధపడుదుము. అట్లే సర్వ సృష్టికర్తయైన వాని సన్నిధికి వచ్చుటకు సిద్ధపాటు అవసరం. దేవునితో మనకొరకు ఏర్పాటుచేయబడిన సమయం కొరకు సిద్ధపడాలి. ఆయన సన్నిధి పొందక ముందు మనపాపములనుండి మనం వైదొలగాలి. మన హృదయము లను శుద్ధిచేసుకొనాలి (హెబ్రీ 10:23). అప్పుడు దేవుని గూర్చి మాత్రమే మనం తలంచగలము.

**ఆరాధనకు విధేయత అవసరం:-** మనం "ఆత్మతోను" "సత్యముతోను" ఆరాధించాలని యేసు కోరారు. సత్యము యెడల మనస్పందనపై మన ఆరాధన ఆధారపడియుండును. దేవుని ఆరాధించాలంటే ఆయన విధించిన షరతులను మనం అంగీకరించాలి. దేవుడు ఆత్మయై యున్నారు. ఆత్మీయ విషయములను గూర్చి మనకున్న అనుభవం సంకుచితము. దేవుని ఆనందపరిచే విధముగా ఆరాధించాలంటే దానిని ఆయనే మనకు చూపించి యుండాలి. క్రొత్త నిబంధనలో ఆరాధన చేయు మాదిరి మనకున్నది. లేఖనములను అతిక్రమింపకూడదని మనకు తెలియ జేయబడియున్నది. (1 కొరింథీ 4:6). దేవునియొక్క సార్వభౌమత్వాన్ని అంగీక రించాలని ఆరాధన కోరుచున్నది. నాకేది యిష్టమో కాదు గాని దేవునికేది యిష్టమో దానిని ఆరాధనలో తెలిసికొనాలి. అట్టి ఆరాధన దేవునికి ప్రీతికరము.

– బాబీ డోక్రి

# దేవుడు ప్రార్థనలకెట్లు జవాబిచ్చును?

## (How does God answer Prayers?)

*- Dennis Gulledge*




బైబిలు ఇట్లు చెప్పుచున్నది. "ఆయనను బట్టి మనకు కలిగిన ధైర్యమేదనగా - ఆయన చిత్తాను సారముగా మనమేది అడిగినను ఆయన మన మనవి ఆలకించుననునదియే. మనమేమి అడిగినను ఆయన మన మనవి ఆలకించునని మనమెరిగిన యెడల మనమాయనను వేడుకొనినవి మనకు కలిగినవని యెరుగుదుము" (1 యోహాను 5:13-15). మరియు "మీ పాపములను ఒకనితోనొకడు ఒప్పుకొనుడి, మీరు స్వస్థత పొందునట్లు ఒకని కొరకు ఒకడు ప్రార్థన చేయుడి. నీతిమంతుని విజ్ఞాపన మనఃపూర్వకమైనదై బహుబలము గలదైయుండును" (యాకోబు 5:16).

తన ఆత్మీయ కుటుంబము యొక్క

ప్రార్థనలకు దేవుడు జవాబులిచ్చును అంటే వారడిగినట్లే దేవుడిచ్చేస్తాడని దీని యర్థము కాదు. మరియు మనము కోరిన రీతిగా ఆయన జవాబీయక పోవచ్చును.

మొదటిగా మనమడిగిన దానికి ఆయన అవునని జవాబీయవచ్చును, చెరసాలలో యున్న పేతురును గూర్చిన ప్రార్థనకు ఆయన జవాబిచ్చెను (అపొ.కా. 12:5-12). రెండవదిగా, దేవుడు కాదు అని మనప్రార్థనలకు జవాబిచ్చును. ఆయన అవునన్నా, కాదనినా అది మన ప్రార్థనలకు జవాబే. ద్వితీయోపదేశ కాండము 3:23-25లో తనకు వాగ్దాన దేశములో ప్రవేశము కొరకు మోషే ప్రార్థించాడు. గాని దేవుడు దానికి నిరాకరించారు.



"నేను అద్దరికి వెళ్ళి యొర్దాను అవతలనున్న యీ మంచి దేశమును, మంచి మన్నెమును ఆ లెబానోనును చూచునట్లు దయచేయు మని నేను యెహోవాను బ్రతిమలాడు కొనగా, యెహోవా మిమ్మును బట్టి నామీద కోపపడి నా మనవి వినక పోయెను" అని అతడు ఇశ్రాయేలీయు లకు తెలియజెప్పాడు. కొన్ని శతాబ్దముల తరువాత ఏలియాతో కలసి మోషే ఆత్మస్వరూపముగా యేసుకు ప్రత్యక్షమై క్రీస్తు యొక్క సిలువ శ్రమలనుగూర్చి సంభాషించెను (మత్తయి 17:3).

దేవుడు మనమడిగిన దానిని నిరాక రించినప్పుడు దానికంటే శ్రేష్టమైనది ఏదో ఆయన మనకొరకు దాచియుంచా రని మనము తలంచవలెను. చివరిగా దేవుడు తన అమితజ్ఞానము చొప్పున మన ప్రార్థనలకు జవాబిచ్చుటకు ఆలస్యము చేయవచ్చును. యోబు ప్రార్థించినను బహు ఆలస్యముగా అతడు జవాబును పొందాడు. యోబు ఎంతో తీవ్రముగా ప్రార్థించాడు. అయితే దేవుని చిత్తము ఇంకోవిధముగా యున్నదని అతడు అప్పుడు గ్రహించలేదు. (యోబు 2:4-6).

– డెన్నిస్ గుల్లెడ్జ్

# ప్రార్థనలో మాదిరి

# (An Example in Prayer)

*- Betty Tucker*



స్తెఫను ధైర్యశాలి. అతడు ప్రజల యెదుట అనేక గొప్ప సూచక క్రియలను మహత్కార్యములను చేయుచుండెను. (అపొ.కా. 6:8). దేవదూషణ చేయుచున్నాడని యూదులు అతనిమీద నిందమోపి వారి సమాజమందిరము యెదుటకు కొనిపోయిరి. "ఈ మాటలు నిజమేనా" యని అతని నడిగినప్పుడు అతడు అబ్రాహామును గూర్చివారికి తెలియ జేసాడు. దేవుడు అబ్రహామును పిలువగా అతడు దేవుడు చూపు ప్రదేశమునకు లేచి వెళ్ళెనని చెప్పెను

(అపో.కా.7:4). స్తెఫను యోసేపును గూర్చియు, మోషేను గూర్చియుకూడ వారికి చెప్పెను మరియు సర్వోన్నతుడగు దేవుడు హస్తకృతములైన ఆలయములలో నివసింపడని వారికి తెలియజేసెను (అపో.కా.7:47-51).

తదుపరి అతడు తన స్వరమును మార్చి "ముష్కరులారా, హృదయములను, చెవులను దేవుని వాక్యమునకు లోపరచనొల్లని వారలారా యని వారిని గద్దించాడు (అపో.కా.7:51). తనను నిందించువారు దేవుడు ఆలయములలో నివసింపడని గ్రహించారు గాని అతని మాటలు వారికి నచ్చలేదు. వారతని మాటలువిని కోపముతో మండిపడ్డారు (7:54). అతని చూచి పండ్లు కొరికారు, చంపబూనుకొన్నారు. పట్టణవు వెలుపలికి అతని వెళ్ళగొట్టి రాళ్ళు రువ్వి చంపారు (7:57).

## స్తెఫను యొక్క ప్రార్థన

పరలోక దృశ్యమును దేవుడతనికి ఆసందర్భములో చూపించారు. దేవుని కుడి పార్శ్వమున యేసు నిలువబడియుండుట అతడు చూచాడు (7:55). ఆదృశ్యము వలన అతడు పొందుచున్న ఘోర హింసను తట్టుకొనగలిగాడు. స్తెఫను యొక్క ప్రార్థన చాల సింపుల్‌గా యున్నది.

"అతడు మోకాళ్ళూని ప్రభువా, వారి మీద ఈ పాపము మోపకుమని గొప్ప శబ్దముతో పలికి నిద్రించెను" (7:60). ఈ మాటలు చెప్పి పాపముతో నిండియున్న ఈ దుష్టలోకమునుండి మొట్టమొదటి హతసాక్షి నిష్క్రమించెను.

మిమ్మును దూషించువారి కొరకు ప్రార్థించుడి యని యేసు కొండ మీద చేసిన ప్రసంగములోని మాటలను ఇక్కడ మనము ఆచరించుట చూడగలము. (మత్తయి 5:44). ఈ భూమిపై మన కాలం అంతమయ్యిన తరువాత స్తెఫనును మనం కలనికొన ఎదురుచూచుచున్నామా! క్షమాగుణము హీరోలకే తగును. దాని వలన రెండవ చెంపకూడ మనము త్రిప్పగలము.

క్షమాపణ వలన మనశత్రువులను దూషింపక క్షమించగలము. ఈ జీవిత శోధనలను ఎదుర్కొనగలము. మన ప్రవర్తన అంతయు చక్కగా తీర్చిదిద్దబడును. మనము స్తెఫనును జ్ఞాపకం చేసికొని క్షమాగుణమును అలవరచుకొందుము. మనకు కీడు చేయు వారిని నిజంగా క్షమించాలంటే బహుశా ఒక జీవితకాలము పట్టును. అయితే అది ఈ లోకంలోను, రాబోవు లోకంలోను కూడ మనకు మేలు చేకూర్చును.

– బెట్టీ టక్కర్



# ప్రభుత్వము యెడల క్రైస్తవుని బాధ్యత

# (Christian's Responsibility to the Government)

*- Roger Campbell*

క్రైస్తవుడు పాలకులకు లోబడి యుండవలెను. "అధిపతులకును అధికారులకును లోబడి విధేయులుగా ఉండవలెనని" తీతు 3:1లో వ్రాయబడి యున్నది. "ప్రతివాడును పై అధికారులకు లోబడియుండవలెను" అని రోమా 13:1 చెప్పుచున్నది. "మనుష్యులు నియమించు ప్రతి కట్టడకును ప్రభువు నిమిత్తమై లోబడియుండుడి" యని 1 పేతురు 2:13 చెప్పుచున్నది.

ప్రభువు నిమిత్తమై పాలకులకు లోబడియుండాలి "ఏలయనగా దేవుని వలన కలిగినది తప్ప మరియే అధికారమును లేదు" (రోమా 13:1). కాబట్టి



అధికారము ఎదిరించువాడు దేవుని నియమమును ఎదిరించుచున్నాడు" (రోమా 13:2). రాజు అందరికిని అధిపతి యనియు, నాయకులు దుర్మార్గులకు ప్రతిదండన చేయుటకును సన్మార్గులకు మెప్పు కలుగుటకును రాజు వలన పంపబడిన వారని వారికి లోబడి యుండుడి.. దేవునికి దాసులమని లోబడియుండుడి'' (1 పేతురు 2:14-16).

ప్రభుత్వము యొక్కప్రతి నాగరిక చట్టమునకు లోబడియుండాలి. మనుష్యులు నియమించు ప్రతి కట్టడకును లోబడి యుండాలని పై వాక్యము చెప్పుచున్నది. ప్రతి కట్టడ అన్నప్పుడు భవన నిర్మాణ చట్టములు, పన్నులు, శాంతిభద్రతలు మొ॥గు విషయములపై చట్టసభలు చేయు కట్టడలన్నీ యని అర్థము. అట్టి కొన్ని చట్టములు సహేతుకములు కావనియు, హాస్యాస్పద మైనవనియు మనము తలంచవచ్చును. గాని చట్టము చట్టమే.

ఫలాని చట్టమునాకిష్టము లేదని దానికి నేను లోబడని యెడల ఇంకొకనికి మరొక చట్టము ఇష్టము కాకపోవచ్చును. అట్టి సందర్భములో అందరు అన్ని చట్టములకు అవిధేయత చూపుట సంభవించి గందరగోళము ఏర్పడును.

గనుక అన్ని దశలలోను ప్రభుత్వాధి కారులకు మనము లోబడి యుండ వలెను. రాజు అందరికి అధిపతి యనియు నాయకులు, దుర్మార్గులకు ప్రతిదండన చేయుటకు పంపబడిన వారనియు మనము గ్రహించవలెను. గనుక మన దేశము యొక్కయు, రాష్ట్రము యొక్కయు విధులకు మనము తప్పకలోబడియుండాలి.

ప్రభుత్వశాసనములు దేవుని చిత్తానికి భిన్నముగా లేనంతవరకు ప్రభుత్వాధికా రులకు అన్నివేళలా మనము లోబడి యుండాలి. బైబిలు బోధకు ఒక దేశ చట్టము విరుద్ధముగా యున్న యెడల బైబిలు బోధకే ఒకడు లోబడియుండాలి. "మనుష్యులకు కాదు, దేవునికే మనము లోబడవలెను గదా" (అపొ.కా. 5:29). ఏదైనా ప్రభుత్వ చట్టము మనకు ఇష్టము లేనందున దానికి అవిధేయులము కాకూడదు. ఆ చట్టము దేవుని చిత్తానికి వ్యతిరేకముగా లేనంతవరకు దానికి లోబడేయుండాలి. అక్కడ మన వ్యక్తిగత ఇష్టాయిష్టాలు పనికిరావు.

– రోజర్ కేంబెల్




# మా దినములు లెక్కించుట మాకు నేర్పుము

## (Teach us to Number our Days)

*- W.A.Holley*

"మాకు జ్ఞాన హృదయము కలుగునట్లుగా చేయుము. మాదినములు లెక్కించుట మాకు నేర్పుము" (కీర్తన 90:12) దేవుని వాక్యపు వెలుగులో మాత్రమే ఈ జీవితము యొక్క పరమార్ధము గ్రహించుకోగలము (యూదా 3; 2 పేతురు 1:3, 2తిమో 3:15-17).

"యెహోవా నా అంతము ఎట్లుండునది, నా దినముల ప్రమాణము ఎంతైనది నాకు తెలుపుము. నా ఆయువు ఎంత అల్పమైనదో నేను తెలిసికొనగోరుచున్నాను" అని కీర్తన 39:4లో చెప్పబడినది. మానవుడు తన జీవితము ఎంత అల్పమైనది, స్వల్పమైనది త్వరలో తెలిసికొనును (హెబ్రీ 9:27), మానవుని జీవితము గడ్డిపువ్వవలెయున్నది. అది అప్పుడే వికసించును, అంతలోనే వాడిపోవును (1పేతురు 1:24-25).



ఈ భూమిమీద నీవు ఎంతకాలము నుండి యున్నావు? 20 సంవత్సరములా, 30 సంవత్సరములా; 40 లేదా 50? 60? 70, 80 సంవత్సరములా? నీకు ఇంకెన్ని సంవత్సరములు ఇంకా మిగిలి యున్నవి? వాటిని జ్ఞానముతో వాడుకొనుము.

ఆదాము హవ్వలు అందమైన ఏదెనులో యుంచబడిరి. వారెన్నడు అబద్ధాన్ని వింటామని, దానిని నమ్ముతామని, దానికి లోబడుదుమని తలంచలేదు. తత్ఫలితముగా వారు ఏదెను నుండి బయటకు త్రోలివేయబడుదుమని ఎన్నడు తలంచలేదు (ఆది. కా 3). ఒకడు మరల జీవవృక్ష ఫలమును తిని నిత్యము జీవించాలనుకొంటే అతడు దేవుని సత్యమును

వినవలెను, దానిని విశ్వసించవలెను, దానికి లోబడవలెను (రోమా 10:16-17; హెబ్రీ 5:8-9; 1 పేతురు 1:22-25). జీవవృక్షము ఇప్పుడు పరలోక మందున్నది (ఆది కా. 2:9; ప్రక 2:7; 22:1-14). సువార్తకు విధేయులై పరలోకములో ప్రవేశించిన వారే ఆ జీవవృక్ష ఫలమును భుజించుట కర్హులు.

జలప్రళయమునకు ముందున్న ప్రజల హృదయ తలంపులన్నియు కేవలం చెడ్డవి గనుక వారు ఆ జలప్రళయములో నశించిపోయిరి (ఆది కా. 6, 7 అధ్యా), తమ దినములు లెక్కించుట వారు నేర్చుకోలేదు. నోవహు, అతని కుటుంబము వాటిని లెక్కించుట నేర్చుకొన్నారు. రక్షింపబడ్డారు (2 పేతురు 2:5, 1పేతురు 3:20-21).

కోరహు, దాతాను, అబీరాము అనువారు తమ దినములు లెక్కించుటలో విఫలమయ్యారు మరియు దైవ వ్యతిరేకులుగా తయారైన 250 మంది రాకుమారులు కూడా వారితో ఏకమై నాశనమయ్యారు (సంఖ్యా 16:1-35). వారు పాపము చేసి తమ ప్రాణములకు ముప్పుతెచ్చుకొన్నారు (38వ).

యెహోవా తమనాజ్ఞాపింపని వేరొక అగ్నిని నాదాబు, అబీహులు ఆయన సన్నిధికి తేగా యెహోవా సన్నిధినుండి అగ్నిబయలుదేరి వారిని కాల్చివేసెను. (లేవీ 10:1-2; లేవీ 16:12).

అననీయ సప్పీరాలు తాము దేవునికిచ్చు కానుక విషయములో తమ బాధ్యతను మరచి అబద్ధమాడినందున వారును నశించిరి (అపో.కా. 5:1-11). గొప్ప భవిష్యత్తు కలిగియుండవలసిన ఇస్కరియోతు యూదా తన దినముల సంఖ్యను సరిగ లెక్కించలేనందున ఆత్మహత్య చేసుకొని దౌర్భాగ్యరీతిగ మరణమునొందెను (మత్త 27:3-10; అపో.కా. 1:17-20).

**తమ దినములను సరిగ లెక్కించిన కొందరు:**

విశ్వాసము వలన హేబెలు దేవుని వాక్యమును బట్టి శ్రేష్టమైన బలిని అర్పించెను (ఆది.కా. 4:1-13; హెబ్రి 11:4; రోమా 10:17). ఈ రీతిగా సర్వశక్తుడైన దేవునికి తన జీవితము సమర్పించెను.

దావీదు కొన్ని ఘోరపాపములు చేసినను (2 సమూ 11:2-27) తాను పాపము చేసినట్లు ఒప్పుకొన్నాడు. వాటి విషయమై మారుమనస్సు పొందాడు (కీర్త 51:10-13). సొలొమోను తన పాపముల విషయమై బహుశ మారుమనస్సు పొందియుండలేదు. అందువలన విశ్వాసవీరుల పట్టికలో అతనిపేరు కనబడదు. మారుమనస్సు పొందనివాని పాపములు క్షమించబడవు (లూకా 13:3).

తన జీవిత యదార్థ భావమేమిటో

పౌలు ఎరిగియుండెను. అతడు క్రైస్తవుడగుటకు హెబ్రీ స్నేహితులను, సహచరులను వాటి సంబంధమైన లాభములన్నింటిని వదులుకొనెను (ఫిలిప్పీ 3:4; గలతీ 1:11-17; అపొ.కా. 26:19). అతడెన్నడు వెనుదిరగలేదు. అతని విశ్వాసము, విధేయత జీవితాంతము వరకు కొనసాగెను (2 తిమో 4:6-8).

## నీ దినముల సంఖ్య లెక్కించుట యెట్లు?

రోమా 8:28 ని కంఠస్థము చేయుము. తరుచు దానిని వినియోగించుము. "దేవుని ప్రేమించువారికి అనగా ఆయన సంకల్పము చొప్పున పిలువబడిన వారికి మేలుకలుగుటకై సమస్తము సమకూడి జరుగుచున్నవని యెరుగుదుము"

సత్యము కొరకు, నీతికొరకు పోరాడుచు యుండుము. నిరుత్సాహము ను బట్టి వెనుదీయకు. అందరు నిరుత్సాహపడగా "దావీదు తన దేవుడైన యెహోవానుబట్టి ధైర్యము తెచ్చుకొనెను" (1 సమూ 30:6). పౌలు ఇట్లు చెప్పుచున్నాడు "ఎటుబోయినను శ్రమపడుచున్నాము. ఇరికింపబడువారము కాము; తరుమబడుచున్నను దిక్కులేని వారము కాము, అపాయములో ఉన్నను కేవలము ఉపాయము లేనివారము కాము, పడద్రోయబడినను నశించువారము కాము" (2 కొరింథీ 4:8-9). మనం ఒక్కోసారి పడిపోవచ్చును గాని మరల మరల లేచుదుము.

నీ విజయమును ఎన్నడు ఈ లోక పరిమాణములతో కొలువ వద్దు. ఈ లోకంలో సమస్తము ధన సంపత్తిని బట్టియే కొలుచుట జరుగును. అయితే ఒకని ధనసమృద్ధి అతని జీవముకు మూలము కాదని యేసు బోధించారు (లూకా 12:13-21). ధనాశ సమస్త కీడులకు మూలము (1 తిమో 6:6-11, 17-19). ఈ లోకం అంతటి కంటె నీ ఆత్మ ప్రశస్తమైనది (మత్త 16:26). పరలోకంలో దాచిన ధనమే నిజమైన ధనము (మత్త 6:19-21).

ఈనాటికే జీవించుట నేర్చుకో. నిన్న శాశ్వతముగా గతించిపోయినది. కాబట్టి మీరు మొదట ఆయన రాజ్యమును నీతిని వెదకుడి. అప్పుడవన్నియు మీకు అనుగ్రహించబడును. రేపటినిగూర్చి చింతింపకుడి, రేపటి దినము దాని సంగతులను గూర్చి చింతించును. ఏనాటి కీడు ఆనాటికే చాలును. (మత్తయి 6:33-34).

అన్నిటి కంటె ముఖ్యముగా దేవునిపై ఆధారపడుము. క్రైస్తవుడవై ఆయన సేవ చేయుము. బైబిలును ప్రతిరోజు చదువుచూ తరచు ప్రార్థించు. దేవుడు నీకు సహాయం చేయును గాక.

**– W.A. హోలీ**

# శిష్యత్వపు బాధ్యతలు

## (Demands of Discipleship)

*-John Stacy*

గొప్ప బాధ్యతలు కోరుచున్న యుగం లో మనము జీవించుచున్నాము. ఉద్యోగం లోను, స్కూలులోను, గృహం లోను మనము అనేక బాధ్యతలు ఎదుర్కొనుచున్నాము. శిష్యత్వపు బాధ్యతలు కూడ యున్నవని క్రైస్తవులు గ్రహించాలి. మనము శిష్యులమయ్యే హక్కులేక పోయినప్పుడు మన పాపములకు పరిపూర్ణ బలి అర్పించే బాధ్యతను దేవుడునెరవేర్చవలసి యుండెను. ఈ బలి 1 పేతురు 1:19లో వర్ణించబడెను. అమూల్యమైన రక్తముచేత అనగా నిర్దోషమును నిష్కళంకమునగు గొర్రెపిల్ల వంటి క్రీస్తు రక్తము చేత మీరు విమోచింపబడితిరని మీరెరుగుదురు గదా".

శిష్యుడు అనగా వెంబడించువాడు, నేర్చుకొనువాడు, మనం క్రీస్తు యొక్క శిష్యులుగా యుండాలంటే కొన్ని షరతులు నెరవేర్చాలి. వాటిని గూర్చి బైబిలు యేమి చెప్పుచున్నాదో చూద్దాం.

మొదటిగా **మనం మనుష్యులను పట్టు జాలరులుగా యుండాలి.** యేసు పేతురును, అంద్రెయను శిష్యులుగా పిలిచినప్పుడు "నన్ను వెంబడించుడి, నేను మిమ్మును మనుష్యులను పట్టు జాలరులుగా చేతునని'' చెప్పెను. నీవు మనుష్యులను పట్టు జాలరిగా యుండ గోరితే నీవు ఉద్యోగస్థుడవే.

రెండవదిగా, **శిష్యులుగా యుండ గోరితే మనం క్రీస్తువలెయుండాలి.** మత్తయి 10:25లో "శిష్యుడు తన బోధకునివలెను దాసుడు తన యజమాని వలెను ఉండిన చాలును" అని యేసు చెప్పారు. నీవు క్రీస్తువలె యుండుటకు యేమిచేయుచున్నావు?

మూడవదిగా, **నీవు శిష్యునిగా యుండగోరితే కొంత ఘర్షణ యుండును.** లూకా 14:26లో యేసు "ఎవడైనను నాయొద్దకు వచ్చి తన తండ్రిని, తల్లిని, భార్యను, పిల్లలను, అన్నదమ్ములను, అక్క చెల్లెండ్రను తన ప్రాణముతో సహా ద్వేషింపకుంటే వాడు నా శిష్యుడు కానేరడు" అని చెప్పెను. మన కుటుంబ సభ్యులకంటే క్రీస్తును మనం ఎక్కువ ప్రేమించాలి. దీనివలన కొంత ఘర్షణ తప్పక ఉద్భవిస్తాది.

నాల్గవదిగా, **శిష్యుడు తన సిలువ నెత్తుకొనాలి.** మత్తయి 10:38లో యేసు "తన సిలువ నెత్తుకొని నన్ను వెంబడింపని వాడు నాకు పాత్రుడు కాదు. తన

ప్రాణము దక్కించుకొనువాడు దానిని పోగొట్టుకొనును, గాని నా నిమిత్తము తన ప్రాణము పోగొట్టుకొనువాడు దానిని దక్కించుకొనునని చెప్పెను. మొదటి శతాబ్దములో ఎవడైనను సిలువను మోయుచున్నట్లు అగుపడితే వాడు సిలువ వేయబడుటకు కొనిపోబడుచున్నాడని యర్థము. నీవు నీ సిలువను మోస్తే పౌలు వలె క్రీస్తు యేసు సంబంధులు శరీర మును దాని యిచ్ఛలతోను దురాశల తోను సిలువ వేసియున్నారని చెప్పగలరు (గలతీ 5:24).


ఐదవదిగా **శిష్యుడు నేర్చుకొను వాడైయుండాలి.** లూకా 11:1లో శిష్యు డొకడు యేసునొద్దకు వచ్చి "ప్రభువా, మాకు ప్రార్ధన చేయ నేర్పుమని" అడిగెను. వారు నేర్చుకొనగోరారు. నాటికి నేటికి ఎంత వ్యత్యాసమో! మరల "మీరు నా వాక్య మందు నిలిచిన వారైతే నిజముగా నాకు శిష్యులై యుందురని" యేసు చెప్పెను (యోహాను 8:31).

ఆరవదిగా, **శిష్యుడు ఫలించువాడై యుండాలి.** యోహాను 15:8లో యేసు "మీరు బహుగా ఫలించుట వలన నా తండ్రి మహిమ పరచబడును. ఇందు వలన మీరును శిష్యులగుదురని" తన శిష్యులకు చెప్పెను.

ఏడవదిగా, **శిష్యుడు తన సహోదరు లను ప్రేమించును.** యోహాను 13:34లో "మీరు ఒకనియెడల ఒకడు ప్రేమ గలవారైన యెడల దీనినిబట్టి మీరు నా శిష్యులని అందరు తెలిసికొందురని" యేసు చెప్పెను.

అవును, శిష్యత్వము యొుక్క బాధ్యతలు గొప్పవి. ఈ బాధ్యతలన్నియు తప్పక నెరవేర్చబడాలి. మనం వాటిని నెరవేర్చకపోతే నరకద్వారములు మనలను ఎన్నటికీ మ్రింగివేస్తాయి.

**- జాన్ స్టేసీ**



# మీ వలలు వేయుడి

## (Let Down your Nets)

*-Garry C. Hampton*



పేతురు యొక్క దోనెలో వుండి యేసు జనసమూహములకు బోధించారు. ఆయన బోధించుట చాలించిన తరువాత నీవు దోనెను లోతునకు నడిపించి చేపలు పట్టుటకు మీ వలలు వేయుడని సీమోను తో చెప్పగా - సీమోను, ఏలిన వాడా రాత్రి అంతయు మేము ప్రయాసపడితిమి గాని మాకేమియు దొరకలేదు. అయినను నీమాట చొప్పున వలలు వేతుమని ఆయనతో చెప్పెను" (లూకా 5:4-5). వారాలాగున చేసి విస్తారమైన చేపలతో రెండుదోనెలు మునుగునట్లు నింపిరి.

బోధించేటప్పుడు మనం మన వలలు వేయాలని ఒక విధముగా మనతో ప్రభువు చెప్పుచున్నారు. మనం మన స్వంత గృహములలో మన బిడ్డలతో, బైబిలు తరగతులతో దీనిని ప్రారంభించాలి. దేవుడు ఇశ్రాయేలీయుల కిట్లు చెప్పారు. "కాబట్టి మీరు ఈ నా మాటలను మీ హృదయములోను మీ మనస్సులోను ఉంచుకొని వాటిని మీ చేతులమీద సూచనలుగా కట్టుకొన వలెను. అవి మీ కన్నుల నడుమ బాసికములుగా ఉండవలెను. నీవు నీయింట కూర్చుండునప్పుడు త్రోవను నడుచు

నప్పుడు పండుకొనునప్పుడు, లేచునప్పుడు వాటిని గూర్చి మాటలాడుచు వాటిని మీ పిల్లలకు నేర్పి, నీ యింటి ద్వారబంధ ములమీదను, నీ గవునుల మీదను వాటిని వ్రాయవలెను. ఆలాగు చేసిన యెడల యెహోవా మీ పితరులకిచ్చెదనని ప్రమాణము చేసిన దేశమున మీ దినములును మీ సంతతి వారి దినములను భూమికి పైగా ఆకాశము నిలుచునంతకాలము విస్తరించును'' (ద్వితీ 11:18-21).

క్రైస్తవ తండ్రులు పౌలు యొక్క సలహాను పాటించవలెను. "తండ్రులారా, మీ పిల్లలకు కోపము రేపక ప్రభువు యొక్క శిక్షలోను బోధలోను వారిని పెంచుడి" (ఎఫెసీ 6:4).

క్రీస్తుననుసరించువారు సర్వజనాంగ ములను శిష్యులుగా చేయాలి (మత్తయి 28:18-20; 16:15-16; లూకా 24:46-48). రాత్రంతయు మేము కష్ట పడితిమి గాని, మాకేమియు దొరుకలేదని సాకుచెప్పడానికి మనం వెదుకుచు యుండవచ్చును. అయితే నిజమైన విత్తనము విత్తగా విస్తారమైన పంట కోతుము "నేను నాటితిని, అపోల్లో నీరు పోసెను, వృద్ధి కలుగ జేసినవాడు దేవుడే" యని పౌలు చెప్పుచున్నాడు (1 కొరింథీ 3:6-8). ఆదిమ సంఘము దీనిని గుర్తించినది. ఘోర హింసలు పొందుచు న్నను, చెదరిపోయిన వారు వాక్యమును ప్రకటించుచు సంచారము చేసిరి (అపొ. కా. 8:4).


మన బిడ్డలకు బోధించుచు యుందము. యితరులకు బోధించు తరుణముల కొరకు వెదుకుదాం. నీ వలలు వేయుము, విస్తారమైన చేపలు పట్టుకొన గల్గునట్లు ప్రభువుకు ప్రార్థించుము.

– గేరీ హేంప్టన్



# పరలోక సహాయము కొరకు ఆవేదన పడు హృదయములు
# (Hurting Hearts Hunting Heaven's Help)

*-Keith Parker*




యేమి చేయాలో తోచనప్పుడు నీవేమి చేస్తావు? నీకోసలహా ఇయ్యగోర్తాను - ప్రార్థించు!

నెహెమ్యా అదే పనిచేసాడు. ఆ కథ నీకు తెలుసు కదా! నెహెమ్యా రాజు దగ్గరకు వెళ్ళాడు. నీకేమి కావాలని రాజు అతనినడిగాడు. నెహెమ్యా చేసింది నాకు చాల యిష్టము. రాజుకు జవాబీయక ముందు అతడు ప్రార్థించాడు. ఆ సందర్భాన్నిగూర్చి వినుము: "అప్పుడు రాజు ఏమి కావలసి నీవు మనవి చేయు చున్నావని నన్నడుగగా, నేను ఆకాశ మందలి దేవునికి ప్రార్థన చేసి రాజుతో - నీ సముఖమందు నేను దయపొందిన యెడల, నా పితరుల సమాధులుండు పట్టణమును తిరిగి కట్టునట్లుగా నన్ను యూదా దేశమునకు పంపుదని వేడుకొను చున్నావని నేను మనవిచేసి యుంటిని" (నెహెమ్యా 2:4-5).

నీవు రాజు ముందు నిలబడి యుండగా అతడొక ప్రశ్నవేసాడనుకో, అతడు నీ జవాబు కొరకు కనిపెట్టు చున్నాడు, అతడు చాల తీరకలేని రాజు, చేయవలసిన యుద్ధాలున్నాయి, జయించ వలసిన సామ్రాజ్యములు, పట్టణములు వున్నాయి. గాని నిన్నొక ప్రశ్నవేసాడు, నీవేమి చేస్తావు?

నెహెమ్యా ప్రార్థన చేసాడు. అదొక దీర్ఘ ప్రార్థన కాదు. 15 నిమిషాల ప్రార్థన కూడ కాదు. "ప్రభువైన దేవా నేటి దినము కొరకు నీవనుగ్రహించిన దీవెనల కొరకు కృతజ్ఞత చెల్లించుచున్నానని" చెప్పు ప్రార్థన అది కాదు. అది క్లుప్తమైనది, ఖచ్చిత



మైనది, స్వల్ప వ్యవధి కలది. వెంటనే చేసిన ప్రార్థన. సహాయము కొరకు ఆవేదన పడువాని ప్రార్థన అది.

పరలోక సహాయము త్వరలో లభించా లని నీవెన్నడైనా తలంచావా? అట్టి అవసరము నీకు ఎన్నడైనా కలిగిందా? బహుశా యేసును గూర్చి నీవొక మిత్రునికి బోధించుచున్నావేమో. నీ యజమానితో సంభాషించుచున్నా వేమో? లేదా వెనుకంజ వేయుచున్న సంఘస్థుని హెచ్చరించుచున్నావేమో, లేదా ఒక మిత్రునితో భేదాభిప్రాయము కలిగి యున్నావేమో? లేదా నీ బిడ్డలను సరిగ పెంచుటకు సహాయము కోరుచున్నా వేమో. దేవుని దగ్గర దీర్ఘకాల మొర పెట్టుటకు నీకంత వ్యవధి ఉండక పోవచ్చును." "దేవా నాకు దయచేసి సహాయము చేయుము. నాకు నీ నడిపింపు, జ్ఞానము అవసరం" అని నీవు కోరుచుండవచ్చును. ఇట్టి సందర్భాల్లో నెహెమ్యా చేసింది చెయ్యి - ప్రార్థించు". యేమీ పని చేయలేనప్పుడు ప్రార్థించు. ఇంకా యేమీ ప్రయత్నించక ముందు ప్రార్థించు. ఆవేదనపడు హృదయం నీకుంటే పరలోక సహాయాన్ని నీవు అభ్యర్థిస్తావు. ప్రార్థించు.

మన ప్రార్థనలు ఆత్మీయముగా యుండుటకు అవి సుదీర్ఘ ప్రార్థనలు కానవసరం లేదు.

- కీత్ పార్కర్

# స్తెఫను

# (Stephen)

***- Jack Harriman***

యెరూషలేములో ఆదిమసంఘములో విధవరాండ్ర పరిచర్య నిమిత్తము ఏర్పరచబడిన ఏడుగురిలో స్తెఫను ఒకడు. అతడు శక్తివంతమైన బోధకుడు, విశ్వాసధీరుడు. అద్భుత శక్తివంతమైన వాడయ్యాడు. అపొస్తలుల కార్యములు 6, 7 అధ్యాయాల్లో అతని గూర్చి మనం చదువగలము.

అపొ.కా. 6వ అధ్యాయములో లూకా అతనిని గూర్చి చాల క్లుప్తముగా గొప్పగా వర్ణించాడు. అతడు విశ్వాసముతోను పరిశుద్ధాత్మతోను నిండుకొనిన వాడని చెప్పబడినది (55). మరియు అతడు జ్ఞానముతో నిండుకొనినవాడు (3వ, 10వ). అతడు కృపతోను బలముతోను నిండుకొనినవాడు (8వ) మరియు వెలుగుతో నింపబడినవాడు (15వ) 7వ అధ్యాయమును బట్టి అతడు వాక్యము తోను, ధైర్యముతోను నిండుకొనిన వాడనికూడ మనం చెప్పగలము.

అలెగ్జాండర్ వైట్ అనునతడు స్తెఫను గూర్చి ఇట్లు చెప్పాడు : రాళ్ళు రువ్వి స్తెఫనును చంపుట వలన ఆదిమ సంఘము ఇంకొక పౌలును కోల్పోయింది. స్తెఫను ఎంత కృప, దైవజ్ఞానము గల వాడంటే బ్రదుకనిచ్చిన యెడల అతడు సాధించ లేనిది యేదీ వుండకపోయేది. అతని మనో వికాసము, తన కాలపునాటి ఆచారములనుండి వేరుచేయబడి అతడు ప్రదర్శించిన స్వేచ్ఛ అతని ధైర్యము, వాక్చాతుర్యము, నిష్కళంక ప్రవర్తన ఇవన్నీ అతనిలో మిళితమై యుండుట వలన స్తెఫను యొక్క ఔన్నత్యము, పరిచర్యలోను, ప్రమాదములోను అతని ముందుగా యుంచినది. వీటన్నిటి విషయాల్లోను స్తెఫను గనుక బ్రతికి యుంటే, పౌలు, పేతురు, యాకోబు, యోహానులకంటే అతని ఘనత పెచ్చు పెరిగియుండును. ఇవన్నీ స్తెఫనును తన కాలమునాటి ప్రముఖునిగా నిలబెట్టి నవి. అందువలన స్తెఫను పడగొట్టబడిన హతసాక్షి గావించబడిన ప్రథముడ య్యాడు.


"వారు అతనిని రాళ్ళతో కొట్టిరి. అతడు మోకాళ్ళూని ప్రభువా వారిమీద ఈ పాపము మోపకుమని గొప్ప శబ్దముతోపలికి నిద్రించెను. సౌలు అతని చావునకు సమ్మతించెను. (అపొ.కా. 7:59-60)

– జేక్ హేరియన్

# సుంకరియైన మత్తయి

## (And Mattew, the Tax Collector)

*-Neal Pollard*



అపొస్తులులలో 8వ వానిగ తన పేరును ఆ లిస్టులో యుంచుకొనిన మత్తయి మిగతా వారిని గూర్చిగాక తన్ను గూర్చి మాత్రమే 'సుంకరియైన మత్తయి' అని అతడు లిఖించుట ఆసక్తిదాయకము. (మత్తయి 10:1-4). అతడు ఒకనిని ద్రోహియని, మరొకని వంశమును గూర్చిన వివరణను మనకు అందిస్తాడు. మరియు ప్రభువు రెండు జతల అన్నదమ్ములను కూడ పిలిచినట్లు చెబుతాడు. కొందరి ఇంటిపేర్లు, కొందరి పెంపుడు పేర్లు (Nicknames) తెలియ జేస్తాడు. యాకోబు అల్ఫయి కుమారుడని చెబుతాడు గాని తన పేరు తరువాత మాత్రమే తన వృత్తినిని కూడ మత్తయి చెబుతాడు. ఆ అపొస్తలుల గుంపులో జాలరులున్నారని మనం ఎరుగుదుము. వారిలో కనీసం ఒకడు జాతీయవాదిగా గుర్తింపబడ్డాడు. బహుశా ఒకడు ఆర్థిక వ్యాపారంలో ఉండియుంటాడు. కాని

విచిత్రం యేమిటంటే తన వృత్తిని గూర్చి మాత్రమే మత్తయి చెబుతాడు.

మత్తయి యిచ్చిన వివరణను బట్టి చూస్తే పన్ను వసూలు చేసే సుంకరులు పాపులతో స్నేహం చేయుటలో యేమి ఇబ్బంది పడేవారు కారు (మత్తయి 9:10-11). లూకా ఆ వృత్తిలో యున్న అవినీతిని అక్రమమును కొంత తెలియజేస్తాడు (లూకా 19:15; 3:13). నిజానికి మత్తయి సుంకరులను, పాపులను, వేశ్యలను కలిపి ఒకేగుంపుగా చూపుతాడు (మత్తయి 11:19; 18:17). బహుశ పరిసయ్యులు, సద్దూకయ్యులు వీరందరినీ పాపుల గుంపులో చేర్చి మాటలాడుకొనేవారేమో. అయినను యేసు అతని పిలువక ముందు తన వృత్తిని గూర్చిన వాస్తవములను మత్తయి మరుగు పరచడానికి యేమీ ప్రయత్నించ లేదు.

నిజానికి తనవృత్తిని బట్టియే అతడు ప్రత్యేకింపబడ్డట్టు మనకు కనబరుస్తాడు.

తమ పాప అపరాధముల వలన కొట్టుమిట్టాడుచున్నవారికి నిరీక్షణ నిచ్చుటకు అతడట్లు చేసాడా? యేసును వెంబడించడానికి అతడు దేనిని అధిగ మించాడో దానిని గూర్చియు యేసు యొక్క శక్తిని గూర్చియు వారికతడు ఇట్లు తెలియజేసాడా? అపొస్తులుడుగా యుండుటకు పిలువబడి, యేసును గూర్చిన సువార్త గ్రంధము వ్రాయడానికి ఎంచుకొనబడిన తాను ఒకప్పుడు పాపినని తెలియజేయడానికి మత్తయి అతడు అట్లు చేసాడా? (రోమా 3:23). క్రీస్తులో సాధ్యమయ్యే ఏకత్వమును తెలియజేయడానికి అతడట్లు చేసాడా? అతనికిని, జెలోతే అనబడిన సీమోను కును మధ్య సంభాషణ ఏమైనా జరిగినదా? జెలోతే అనగా జాతీయవాది యైన సీమోను, సుంకరియైన మత్తయిని కలిసి ఇంటింటా సువార్తచేయగలిగారా? జాతీయవాదియైన వాడు, రోమా ప్రభుత్వానికి పన్ను వసూలు చేసేవానిని సాధారణంగా సహించుట కష్టము.


అందరికీ విశదమయ్యేది ఒకటే - మత్తయి తానెవరో ఎట్టిపని చేసేవాడో తెలియజేసాడు. అయినను అతడు క్రీస్తులో ఏమయ్యాడో అది అందరికీ ప్రాముఖ్యము. క్రీస్తు పునరుత్థానుడై ఆరోహణుడైన తరువాత కూడా అతడు నమ్మకముగా సేవ చేయుచుండెను. (అపొ.కా. 1:13). క్రీస్తు సువార్తను మొదట్లో ప్రకటించుటలో అతనికొక గొప్ప పాత్రయుండెను (అపొ.కా. 2:14).

త్రాగుబోతులు, తిట్టిబోతులు, లంచగొండులు ఎవరైనా మారుమనస్సు పొంది క్రీస్తుకు లోబడితే క్రీస్తు రాజ్యములో ప్రయోజనకరమైన పాత్రను వారు వహించగలరు. దాని జవాబు మనము ఎరిగియేయున్నాము. దానిని మనము నమ్మవలెనని ప్రభువు కోరుచున్నారు.

- నీల్ పొలార్డ్

# అతని తండ్రి నీకు తెలుసా?
## (Do you Know His Father?)

*- John Gipson*



ప్రతి బైబిలు విద్యార్థి సమూయేలును ఎరుగును. తన తల్లియొక్క ప్రార్థన, మ్రొక్కుబడులకు జవాబుగా అతడు జన్మించాడు. దేవుడామెకు కుమారుని అనుగ్రహిస్తే అతని దేవునికి సమర్పించు కొందునని హన్నా వాగ్ధానము చేసినది.

అతడెంత దైవజనునిగా తయారయ్యాడో! ప్రవక్తలలో అతడు మొదటివాడు మరియు మోషే తరువాత పాత నిబంధనలో అతడు ఘనుడిగా ఎంచబడ్డాడు. (యిర్మియా 15:1).

సమూయేలు యొక్క తల్లియగు హన్నా మనందరికీ బాగా తెలుసు, గాని అతని తండ్రి సంగతేమిటి? అతని పేరేమిటి? ప్రతి స్త్రీకి అటువంటి భర్తయుండాలని క్రొత్త నిబంధన చెప్పుచున్నది. క్రీస్తు సంఘమును ప్రేమించునట్లు, పురుషులారా మీరును మీ భార్యలను ప్రేమించుడి యని క్రొత్తనిబంధన చెప్పుచున్నది (ఎఫెసీ 5:25).

**అతడు తన భార్యను ప్రేమించాడు:** సంతానహీనురాలైనందున హన్నా మనోవిచారము కలిగినదైయుండగా అతడు "హన్నా నీవెందుకు ఏడ్చుచున్నావు? నీవు భోజనము మానుట యేల? పదిమంది కుమారుల కంటె నేను నీకు విశేషమైన వాడను కానా? అని ఆమెతో చెప్పెను? (1 సమూ 1:8). అతడామెను అంతగా ప్రేమించాడు.

**దేవునినారాధించుటకతడు తన కుటుంబమును నడిపించెను :-** ఇతడు షిలోహునందున్న సైన్యముల కధిపతి యగు యెహోవాకు మ్రొక్కుటకును, బలి అర్పించుటకును ఏటేట తన పట్టణము విడిచి అచ్చటికి పోవుచుండెను. (1 సమూ 1:3). దేవుని ఎక్కడ ఆరాధించాలో అక్కడ, ఎట్లు ఆరాధించాలో అట్లు అతడు ఆయనను ఆరాధించాడు. మరియు అతడు తన కుటుంబమును తనతో కూడ తీసికొని వెళ్ళేవాడు. యేసు ఇట్లు ఉద్ఘాటించారు. "ప్రభువైన నీ దేవునికి మ్రొక్కి ఆయనను మాత్రమే సేవింపవలెను". (మత్తయి 4:10). సమూయేలు యొక్క తండ్రి ఈ గొప్ప ఆజ్ఞను చక్కగా పాటించి తన కుటుంబానికి గొప్ప మాదిరి చూపించాడు.

**ఆరాధనలో అతడు దేవునికి అర్పణలు అర్పించాడు:-** అతడారాధించు కాలమున ఏలీ యొక్క ఇద్దరు కుమారులగు హొఫ్నీ, ఫీనెహాసులు యెహోవాకు యాజకులుగా యుండిరి. హన్నా యొక్క భర్త ఏటేటా యెహోవాకు మ్రొక్కుట కును, బలి యర్పించుటకును దేవుని మందిరముకు వెళ్ళేవాడు. దేవుని సేవిం చుటలో ఆరాధన బల్యర్పణ రెండు జంటగా యుండేవి. హొఫ్నీ ఫీనెహాసులు యాజకులైనను వారు దుష్ప్రవర్తన కలవారు. అట్టివారు యాజకులుగా యున్నంత కాలము నేనక్కడికి పోను అని సమూయేలు యొక్క తండ్రి అనుకొనలేదు. అతని అర్పణలు ఈ యాజకులకు కాదు గాని దేవునికే యని అతడెరుగును.

సమూయేలు యొక్క తండ్రి పేరు ఎల్కానా. తండ్రి అంటే ఏలాగుండాలో అతడెరిగియుండెను. అతని అడుగు జాడలలో ప్రతి తండ్రీ నడువవలెను. తద్వారా అతని కుటుంబము ఆశీర్వదించబడును. - జాన్ గిప్సన్

# రెవరెండ్ ఎందుక్కాదు?

## (Why not Reverend?)


*- Dennis Smith*

క్రీస్తు సంఘ బోధకులు రెవరెండ్ అను బిరుదుతో ఎందుకు పిలవబడరో యని అనేకులు ఆశ్చర్యపడ్డారు. దానికి జవాబు బైబిలులోనే యున్నది.

మొదటిగా భూమి మీద ఎవనికైనా, ఏ మనుష్యునికైనా ఈ పదము వర్తింపజేయబడినట్లు బైబిలులో ఎక్కడా లేదు. బోధకుడు, సువార్తికుడు, సేవకుడు, దాసుడు అను పదములు దేవుని వాక్యాన్ని ప్రకటించువాని కుపయోగింపబడ్డాయి. గాని రెవరెండ్ అను పదము ఇంగ్లీషు బైబిలులో దేవునికి మాత్రమే ఉపయోగింపబడింది. కీర్తన 111:9లో ఇట్లున్నది "ఆయన తన ప్రజలకు విమోచనము కలుగజేయు వాడు. తన నిబంధన ఆయన నిత్యముగా ఉండ నిర్ణయించువాడు. ఆయన నామము పరిశుద్ధమైనది పూజింపదగినది ("Holy and Reverend is His name"). ఈ పదము బైబిలులో ఒకే ఒక్కసారి వినియోగింపబడినందునను, అది దేవుని నామము కొరకే వాడబడినందునను, ఆ పదము మహాపరిశుద్ధుడైన దేవునికే వాడబడవలెనని క్రీస్తు సంఘము విశ్వసించును. ఇదేమంత పెద్ద సమస్య కాదని చులకనగా వాడేయడం వలన బైబిలును గాక మానవ కల్పిత పద్ధతుల ననుసరించి మతశాఖల పద్ధతులు ఏలాగు వ్యాపించినాయో గమనించుకోవచ్చును.

మత సంబంధముగా ఈ పదాన్ని ఒక బిరుదుగా వాడుట వలన బోధకులను ఒక ప్రత్యేక తరగతిగా పరిగణించు నట్లగుపడుచున్నది. "రెవరెండ్లను" సామాన్య సభ్యులనుండి అది వేరు చేయుచున్నది. యిదికూడ దైవసంకల్పం కాదుగాని మానవ కల్పితమే. సువార్తకు లోబడి దాన్ని బోధించుటకు ఉపయోగించు వారిని మిగతా క్రైస్తవులతో వేరుచేసే పద్ధతియేదీ క్రొత్త నిబంధనలో కానరాదు (2థెస్స 2:14). ఇంకో మాటలో క్రైస్తవుడైనవాడు అతడు బోధకుడైనా, సామాన్య సంఘసభ్యుడైనా, మిగతావారికంటే పైగాయున్నావాడు కాదు. అందువలన దేవుని వాక్యాన్ని అనుసరించు క్రీస్తు సంఘస్తులు దేవునికి చెందిన ఘనతను తమకు అపాదించు కొనరు. రెవరెండ్లని పిలువబడరు.

– డెన్నిస్ స్మిత్



# అజాజేలు


# (Azazel)

*- Jack W Carter*



అజాజేలును గూర్చి బైబిలులో ఒకే ఒక్క అధ్యాయములో చెప్పబడినది. అయినను బైబిలులో అది అత్యంత ప్రాధాన్యమైనది. యిది వింతగా కన బడును గాని, అజాజేలు ఒక మేకయై యున్నది. ఈ మేకకు అజాజేలు అని పేరు పెట్టబడి అయినా యుండాలి లేదా అది దాని గమ్యాన్ని సూచించు మాటయై యుండాలి (లేవీ.కా. 16 అధ్యా).

విడిచి పెట్టబడే మేకయని దాన్ని గూర్చి మనం ఎరుగుదుము. ప్రాయశ్చిత్త దినమున దాని ప్రాముఖ్యత మనకు కనబడును. ఆదినమందు ఇశ్రాయేలీయులు పాపపరిహార్థ బలిగా రెండు మేకలను తీసుకొని వచ్చి ప్రత్యక్షగుడారపు ద్వారమునొద్ద యెహోవా సన్నిధిని వాటిని ఉంచవలెను. అప్పుడు అహరోను యెహోవా పేరిట ఒక చీటీని, విడిచిపెట్టే మేక (అజాజేలు) పేరిట ఒక చీటిని ఆ రెండు మేకల మీద రెండు చీట్లు వేయవలెను. ఏ మేక మీద యెహోవా పేరిట చీటి పడునో ఆ మేకను ఆహరోను తీసికొని వచ్చి పాప పరిహారార్థబలిగా అర్పించవలెను. ఏ మేక మీద అజాజేలు అను చీటి పడునో దానివలన ప్రాయశ్చిత్తము కలుగునట్లు దానిని అరణ్యములో విడిచిపెట్టుటకై యెహోవా సన్నిధిని దానిని ప్రాణముతోనే ఉంచవలెను.



(లేవీ.కా. 16:7-11). విడిచిపెట్టే మేకను వదిలిన వాడు తన బట్టలు ఉతుక్కొని నీళ్ళతో దేహమును కడుగుకొని తరువాత పాళెములోనికి రావలెను (లేవీ 16:26).

ఈ అజాజేలు మేక యొక్క ప్రాముఖ్యతను వెంటనే మనము గుర్తించ గలము. దేవుడు మన పాపములను క్షమించినప్పుడు వాటిని పూర్తిగా ఎట్లు నిర్మూలించునో దేవుడు దీని ద్వారా మనకు తెలియజేయుచున్నారు. ఈ సందర్భములో కీర్తన 103:11, 12ను మనం జ్ఞాపకముంచుకోవాలి. "భూమి కంటె ఆకాశము ఎంత ఉన్నతముగా ఉన్నదో ఆయన యందు భయభక్తులు గలవారి యెడల ఆయనకృప అంత అధికముగా ఉన్నది. పడమటికి తూర్పు ఎంత దూరమో ఆయన మన అతిక్రమములను అంత దూరపరచి యున్నాడు.

దేవుడు పగబట్టువాడని తలంచ కూడదు. మనం పగబడతాడు గనుక బహుశ అట్లు తలుస్తాము. దేవుడు మనపాపములు క్షమించునప్పుడు అతి అంతటితో నవమాప్తము. తన స్వాస్థ్యములో శేషించిన వారి దోషమును పరిహరించి వారు చేసిన అతిక్రమ విషయములలో వారిని క్షమించు దేవుడవైన నీతో సముడైన దేవుడున్నాడా? ఆయన కనికరము చూపుటయందు సంతోషించువాడు గనుక నిరంతరము కోపముంచడు. ఆయన మరల మన యందు జాలిపడును. మన దోషములను అణచివేయును, వారి పాపములన్నిటిని సముద్రము అగాధములో పడవేతువు" (మీకా 7:18-19).

నా జీవితంలో పోగుబడిపోయిన పాపములను గూర్చి నేను చింతించు నప్పుడు ఈ లేఖన భాగములను తలంచుకొనుచు నా జీవితంలో ముందుకు కొనసాగుదును.

– జేక్ కార్టర్

# దేవుడు జతపరచినవి

## (Things God has Joined Together)

*-Sunny David*

బైబిలు గ్రంథములోని పాతనిబంధన హెబ్రీభాషలోను, క్రొత్త నిబంధనగ్రీకు భాషలోను వ్రాయబడెను. పాత నిబంధనలో హెబ్రీ భాషలో దేవుడు అనే పదము (God) ఏక వచనములోను, బహువచనములోను వాడబడినది. ఏకవచన రూపమైన ఏలీ (El) అనే పదము 500 సార్లు, బహువచన రూపమైన ఎలోహిమ్ (Elohim) అనే పదము 3వేల సార్లు కనబడుతుంది. బహువచన రూపమైన ఎలోహిమ్ అనే పదము దైవత్వము (God head) అనే అర్ధమును ఇచ్చుచున్నది. అగా దైవత్వములో ఒకటి కంటే ఎక్కువ మంది వ్యక్తులు ఉన్నారని తెలియు చున్నది. బైబిలులోని క్రొత్త నిబంధన చదువుచున్నపుడు ఒకడు దేవుని గూర్చి ఈలాగు తెలిసికొనగలడు. ఆయన తండ్రి, ఆయన కుమారుడు, ఆయన పరిశుద్ధాత్ముడు. కనుక దేవుడు ముగ్గురు వ్యక్తులుగా ఉన్నారు. (యోహాను 1:1, 14, యోహాను 10:30, మత్తయి 28:19, అపో.5:3, 4). తండ్రి, కుమారుడు మరియు పరిశద్ధాత్ముడు ఒకే దేవుడైయున్నాడు. బైబిలు ఈలాగు బోధించుచున్నది "దేవుడు జతపరచిన వారిని మనుష్యుడు వేరు పరచకూడదని చెప్పెను. (మత్తయి 19:6)

దేవుడు ఏయే విషయములను జతపరచియుంచెనో నాతో కలసి అలోచన చేయవలెనని కోరుచున్నాను.

**1) క్రీస్తు – ఆయన రక్తము – రక్షణ – ఆయన సంఘము అనునవి జతచేయబడిన అంశములు:-**

క్రీస్తు రక్తము ద్వారా రక్షణ పొంది క్రీస్తులోనికి ఆయన సంఘములోనికి చేర్చబడుట అనునది బైబిలు తెలియజేయుచున్నది అలాగున అవి జతచేయబడియున్నవి.

గమనించండి:- మత్తయి 16:18 లో "నేను నా సంఘమును కట్టుదును" అని క్రీస్తు చెప్పెను.

ఎఫెసీ 1:22, 23 సంఘము క్రీస్తు శరీరమని మనము చదువుచున్నాము.

కొలస్సీ 1:18 క్రీస్తు సంఘమునకు శిరస్సు అని బోధించుచున్నది.

అపొ 20:28. ఆయన తన స్వరక్తమిచ్చి సంఘమును కొనెను.

మత్తయి 26:28, 1 పేతురు 1:18-20లో పాపవిమోచన కొరకై క్రీస్తు రక్తము చిందించెనని మనము

నేర్చుకొనుచున్నాము. సంఘము అనగా (ఇటుకలు, సిమ్మెంటుతో కట్టబడిన ఆలయము కాదు) క్రీస్తు రక్తము వలన రక్షింపబడినవారు. సంఘమనగా ఆత్మసంబంధమైన దేవుని గృహము. (1 తిమోతి 3:15). క్రీస్తు – క్రీస్తు రక్తము – రక్షణ – ఆయన సంఘము అనునవి జతచేయబడిన అంశములు. అనగా మనము క్రీస్తుకు చెందిన వారమైతే ఆయన రక్తము ద్వారా రక్షణ పొందాలి, ఆయన రక్తము ద్వారా రక్షణ పొందితే ఆయన సంఘములో ఉంటాము. ఎవరైతే క్రీస్తు రక్తము వలన పాప క్షమాపణ పొందుతారో వారు రక్షణ పొంతారు. రక్షణ పొందినవారిని క్రీస్తు తానే సంఘములోనికి చేర్చునని బైబిలు బోధించుచున్నది (అపొ.2 : 38, 47).

దీనిని బట్టి మనము ఏమి నేర్చుకొనుచున్నాము?

క్రీస్తు సంఘమునకు వెలుపల రక్షణ పొందివారు లేక క్రైస్తవులు ఉండరని తెలియుచున్నది. రక్షణ క్రీస్తులో క్రీస్తు రక్తము ద్వారా మాత్రమే మరియు రక్షణ పొందినవారు క్రీస్తు సంఘములోనే ఉందురు.

**2) అదే విధముగా బైబిలులో దేవుడు జతపరచిన మరో విషయము ఏమనగా – క్రీస్తు నందు విశ్వాసము – పాపముల విషయమైన మారుమనస్సు – క్రీస్తును ఒప్పుకొనుట – బాప్తీస్మము మరియు రక్షణ.**

క్రీస్తులోనికి రక్షణ పొందాలని అంటే ఒకడు క్రీస్తు నందు విశ్వాసముంచి పాపముల నిమిత్తమై మారుమనస్సు పొంది క్రీస్తు దేవుని కుమారుడని నోటితో ఒప్పుకొని పాప విమోచనకొరకై బాప్తీస్మము పొందవలెనని బైబిలు బోధించుచున్నది. కావున దేవుడు జతపరచిన విషయములను ఎవరూ కూడా ఒకదానినుండి మరొకటి విడదీయజాలరు. మార్కు 16:16 నమ్మి బాప్తీస్మము పొందినవాడు రక్షింపబడును.

అపొ.కా. 2:38 పాపక్షమాపణ పొందుటకు గాను మారు మనస్సుపొంది బాప్తీస్మము పొందాలి.

అపొ.కా. 8:35–39 నపుంసకుడు క్రీస్తునందు విశ్వసించి బాప్తీస్మము పొందుతాని చెప్పినపుడు ఫిలిప్పు నపుంసకుడు క్రీస్తు దేవుని కుమారుడని ఒప్పుకొనిన దానిని బట్టి అతనికి బాప్తీస్మమిచ్చెను. కనుక పాపముల నుండి రక్షణ పొందాలంటే ఒకడు క్రీస్తుయొక్క సువార్తవిని, క్రీస్తునందు విశ్వాసముంచి పాపముల నిమిత్తమైన మారుమనస్సు పొంది క్రీస్తు నామమును ఒప్పుకొని బాప్తీస్మము పొందాలి. అనగా పాప క్షమాపణ నిమిత్తమై క్రీస్తు యొక్క అధికారము క్రింద నీటిలో ముంచబడాలి.

**3. దేవుడు జతపరచిన మరియొక విషయము – మరణము, పునరుత్థానము, తీర్పు, నిత్యత్వము**

హెబ్రీ 9:27 "మనుష్యులొక్కసారే మృతిపొందవలెనని నియమింపబడెను. ఆ తరువాత తీర్పు జరుగును." తీర్పు తీర్చబోయెడి ఒక దినమును దేవుడు నిర్ణయించియున్నాడు (అపొ. 17:30, 31). నన్ను నిరాకరించి నామాటలను అంగీరింపని వానికి తీర్పు తీర్చువాడొకడు కలడు. నేను చెప్పిన మాటయే అంత్య దినమందు వానికి తీర్పు తీర్చును. (యోహాను 12:48).

ఆఖరి దినమున అనగా తీర్పు దినమున మరియు పునరుత్థాన దినమున దేవుని శక్తి వలన మృతులైన వారందరు సజీవులై లేపబడుదురు. క్రీస్తు ప్రభువు చెప్పిన ప్రకారము "దీనికి ఆశ్చర్య పడకుడి! ఒక కాలము వచ్చుచున్నది ఆ కాలమున సమాధులలో ఉన్నవారందరు ఆయన శబ్దము విని మేలు చేసిన వారు జీవ పునరుత్థానమునకు కీడు చేసినవారు తీర్పు పునరుత్థానమునకు బయటకి వచ్చెదరు" (యోహాను 5:28, 29).

చెడ్డవారిని లేక దుష్టులను గూర్చి ఈలాగు చెప్పుచున్నాడు. నిత్యశిక్షకు పోవుడి. కాని రక్షింపబడిన వారిని లేక నీతిమంతులను గూర్చి క్రీస్తు చెప్పున దేమనగా నిత్యజీవములోనికి ప్రవే శించుడి. (మత్తయి 25:46).

గమనించండి, పాపులకు నరకములో నిత్యశిక్ష, మరి రక్షింపబడినవారికి పరలోకములో నిత్యజీవము.


అందరికి మరణము అనేది తప్పనిసరి. ఆలాగుననే మరణము నుండి పునరుత్థానము. రక్షింపబడినవారికి, రక్షింపబడనివారికి పునరుత్థానము తరువాత దేవుని ఎదుట తీర్పునకు ప్రత్యక్షము కావలెను. ఆ తరువాత పరలోకములోగాని, నరకములోగాని నిత్యము జీవించియుండవలెను.

ఈ జీవితములో మాత్రమే నిత్యత్వములో ఎక్కడ ఉండాలి అనేది నిశ్చయించుకొనవలెను. దేవుడు ఏ వ్యక్తిని నరకములోనికి పంపడు, పంపబోడు. ఎందుకనగా ఆయన ప్రేమయైయున్నాడు (యోహాను 3:16). అందరును పాపముల విషయమై పశ్చాత్తాపమునొంది క్రీస్తుద్వారా రక్షణ పొంది పరలోకములో ఆయనతో కూడా నివసించాలని ఆయన కోరిక. చీకటిలో నుండి తన్ను తాను రక్షించుకొనునట్లు ఆయన మానవుని విడిచిపెట్టే దేవుడు కాదు. మానవులందరూ ఆయనతో కూడా ఉండాలి అని ఆయన చిత్తము అని బైబిలు చెప్పుచున్నది. మానవుడు తనకేది కావాలో ఎంపిక చేసుకొనే స్వేచ్ఛను దేవుడు మానవునికి ఇచ్చాడు. కాని ప్రజలందరూ క్రీస్తును కోరుకొని ఆయనద్వారా పరలోకములో నిత్యము జీవించి యుండాలి అనునది దేవుని యొక్క కోరిక.

– సన్నీ దేవిడ్

# గొర్రెపిల్ల యొక్క జీవగ్రంధము
## (The Lamb's Book of Life)

*-David Pharr*



యేసు యెరూషలేము వైపు తన చివరి ప్రయాణము కొరకు సిద్ధపడుచు, ఆయన మార్గము సిద్ధపరచునిమిత్తము ఆయనకంటే ముందుగా డెబ్బది మంది శిష్యులను పంపించెను. వారు ప్రతిఘటన నెదుర్కొందురని ప్రభువు ముందే వారిని హెచ్చరించారు. వారు తోడేళ్ళ మధ్య గొర్రెపిల్లలుగా అగుపడుదురు. దయ్యములను వెళ్ళగొట్టుటకును రోగములను బాగుచేయుటకును క్రీస్తు నామమున వారికి గొప్ప అధికారము ఈయబడెను (లూకా 10).

యేసు యొక్క అనుచరులు తమ పరిచర్యలో గొప్ప సంతోషాన్ని అనుభవిస్తారు, అది వాస్తవము. ఆ డెబ్బదిమంది శిష్యులు గొప్ప సంతోషముతో ప్రభువునొద్దకు తిరిగివచ్చి "ప్రభువా దయ్యములు కూడ నీనామమువలన మాకు లోబడుచున్న వని" చెప్పారు. (లూకా 10:17). వారు గొప్ప పనులు చేస్తారని యేసుకు తెలుసు. అయితే అద్భుతములు చేయుటకంటే గొప్పదైన సంగతి ప్రభువు వారికి తెలియజేసారు. "అయినను దయ్యములు మీకు లోబడుచున్నవని సంతోషింపక మీపేరులు పరలోక ముందు వ్రాయబడి యున్నవని సంతోషించుడి" అని ఆయన వారికి చెప్పారు (లూకా 10:20).

ఇక్కడ మనం నేర్చుకొనవలసిన సంగతి యేమంటే గొప్ప అద్భుతములు చేయుట కంటే శ్రేష్టమైన సంగతి ఒకటి యున్నది. అది నమ్మకమైన దేవుని ప్రతిబిడ్డకు ఇయ్యబడిన ఒక నిర్ధారణ. జీవగ్రంధములో అతని పేరును దేవుడు లిఖించియుంచారు. అతని పేరు పరలోకములో నమోదు చేయబడి

యుంటాది. పరిశుద్ధ పట్టణమైన పరలోకమును గూర్చి వ్రాయుచు, "గొర్రెపిల్ల యొక్క జీవ గ్రంథమందు వ్రాయబడినవారే దానిలో ప్రవేశింతురు గాని నిషిద్ధమైనదేదైన, అసహ్యమైన దానిని జరిగించువాడైనను దానిలోనికి ప్రవేశింపనే ప్రవేశింపరు" అని యోహాను వ్రాసాడు (ప్రక 21:27).

జీవ గ్రంథములో మనపేర్లు వ్రాయబడుచున్నవంటే దేవుడు మనందరినీ బాగుగా ఎరిగియున్నారని అర్థం. ఆయన మన పేరును బట్టి మనల్ని ఎరుగును. " నీ పేరునుబట్టి నిన్ను ఎరుగుదునని" దేవుడు మోషేతో చెప్పారు (నిర్గమ 33:17). తాను మంచి గొర్రెల కాపరినని తన సొంత గొర్రెలను పేరుపెట్టి పిలుతునని యేసు తన్నుగూర్చి చెప్పుకొన్నారు (యోహాను 10:3). ఫిలిప్పయిలో తనతోటి పనివారిని గూర్చి పౌలు చెబుతూ "వారి పేరులు జీవగ్రంథ మందు వ్రాయబడియున్నవని" చెప్పాడు. (ఫిలిప్పీ 4:3). సార్దీసులోని సంఘము నకు వ్రాయుచు ప్రభువు, "తమ వస్త్రములను అపవిత్రపరచుకొనని కొందరు సార్దీస్‌లో నీయొద్ద ఉన్నారు. వారు అర్హులు గనుక తెల్లని వస్త్రములు ధరించుకొని నాతో కూడ సంచరించెదరు. జయించువాడు ఆలాగున తెల్లని వస్త్రములు ధరించుకొనును; జీవ గ్రంథములోనుండి అతని పేరెంత మాత్రమును తుడుపు పెట్టక నా తండ్రి యెదుటను ఆయన దూతల యెదుటను అతని పేరు ఒప్పుకొందును" అని చెప్పారు (ప్రకటన 3:3-5).

మన పేరును బట్టి దేవుడెరుగు ననుటలో రక్షణ వ్యక్తిగతమేగాని సామూహికము కాదని తెలియుచున్నది. జీవ గ్రంథములో జనాంగములు, దేశములు, సంఘములు, కుటుంబములు గాక ఆయా వ్యక్తుల పేర్లు మాత్రమే ఉంటాయి. అవును రక్షింపబడినవారు క్రీస్తు సంఘసభ్యులే. దానికి తిరుగులేదు. అయితే వ్యక్తిగత విశ్వాసమును బట్టియే ఒకడు రక్షింపబడును (1 పేతురు 1:22). పరలోకములో ప్రవేశించబడు తన కుటుంబ నామమును బట్టిగాని సంఘనామమును బట్టిగాని గాక క్రీస్తుతో తనకుగల వ్యక్తిగత సంబంధమును బట్టియే ప్రవేశించును.

గొర్రెపిల్లయొక్క జీవగ్రంథములో ఖచ్చితమైన సమాచారము నమోదు చేయబడియుండును. అందులో ఎవరి పేరు ఉండాలో దేవునికి బాగుగా తెలియును. "ప్రభువు తనవారిని ఎరుగును" (2 తిమో 2:19). జీవ గ్రంథములో తప్పులేమి ఉండవు. ఉండ కూడని పేర్లు అందులో పొరబాటున కూడ ఉండవు. ఉండవలసిన వార్లు తప్పకుండా అందులో ఉంటాయి. మానవ జాతిలో రెండే రెండు రకాలవారుంటారు. తిరిగి జన్మించిన వారు, తిరిగి జన్మించని వారు. క్రీస్తు

సంఘములో యున్నవారు, లోకములో యున్నవారు, పాపములు క్షమించబడిన వారు, పాపములో జీవించుచున్నవారు, జీవ గ్రంథములో తమ పేరులున్నవారు, దానిలో వారి పేర్లు లేనివారు.

క్రొత్తగా జన్మించిన వెంటనే పేర్లు దానిలో లిఖించబడ్డాయి. ఒకడు నీటి మూలముగాను, ఆత్మమూలముగాను తిరిగి జన్మించగా అతని పేరు జీవగ్రంథములో నమోదు చేయబడ్తాది. (యోహాను 3:1–7; 1 పేతురు 1:23; గలతీ 3:36). మన విశ్వాసాన్నిబట్టి బైబిలును బట్టి నడుచుకొనుచున్నామో లేదో దానిని బట్టి మన పేరు జీవ గ్రంథములో యున్నదో లేదో తెలిసికొనవచ్చును.

జీవ గ్రంథము నుండి మనపేరు తీసివేయబడవచ్చునని కూడ తెలిసికొనుట ముఖ్యము. పాపమును జయించుటలో నమ్మకముగా యున్నవారిపేర్లు దానిలో నుండి కొట్టివేయబడవు (ప్రక 3:5). అయితే ఒక భయంకర హెచ్చరిక ఈయబడి యున్నది. "ఎవడైనను ఈ ప్రవచన గ్రంథమందున్న వాక్యములలో ఏదైనను తీసివేసిన యెడల, దేవుడు ఈ గ్రంథములో వ్రాయబడిన జీవవృక్షము లోను పరిశుద్ధ పట్టణములోను వానికి పాలు లేకుండా చేయును" (ప్రక 22:19).

మరలయోహాను తాను చూచిన తీర్పు దృశ్యమును ఇట్లు వర్ణించాడు. మరియు ధవళమైన మహాసింహాసనమును దానియందు ఆసీనుడైయున్నయొకనిని చూచితిని; భూమ్యాకాశములు ఆయన సముఖమునుండి పారిపోయెను. మరియు గొప్పవారేమి కొద్దివారేమి, మృతులైన వారందరు సింహాసనము ఎదుట నిలువబడియుంట చూచితిని, అప్పుడు గ్రంథములు విప్పబడెను, మరియు జీవ గ్రంథమను వేరొక గ్రంథము విప్పబడెను. ఆ గ్రంథముల యందు వ్రాయబడియున్న వాటిని బట్టి తమ క్రియలచొప్పున మృతులు తీర్పు పొందిరి.. ఎవని పేరైనను జీవ గ్రంథ మందు వ్రాయబడినట్టు కనబడని యెడల వాడు అగ్నిగుండములో పడవేయబడెను" (ప్రకటన 20:11–15).

నీ పేరు జీవగ్రంథమందున్నదా?

– డేవిడ్ ఫార్



# ఒకడు సర్వలోకమును సంపాదించుకొని...?

## (What Shall it Profit a Man?)

***-Leroy Brownlow***

ఒకడు సర్వలోకమును సంపాదించుకొని తన ప్రాణమును పోగొట్టుకొనుట వానికేమిప్రయోజనము? మనుష్యుడు తన ప్రాణమునకు ప్రతిగా ఏమి యియ్యగలడు? (మార్కు 8:36) అని యేసు ప్రభువు ప్రశ్నించారు.

1. ప్రతివాడు సంపాదించుకొనడానికి, లాభము పొందడానికి ఆసక్తి కలిగినవాడే. దేనినైనా పోగొట్టుకొనుట మానవునికి ఇష్టముండదు. అనేకులు ఇహసంబంధమైన లాభాలను పొందడానికి ఆసక్తి కలిగియుండుట చాల విచారము. లాభ నష్టాలను గూర్చియే ఎక్కువ సమయం ప్రజలు వెచ్చించుదురు. యిది ముఖ్యంగా ఆందోళనకరము.

అనేక సంగతుల విలువ ఊగిసలాడును: బంగారము, భూమి మొదలగు వాటి విలువలు పెరుగుతాయి, తరుగుతాయి. స్టాకుల విషయం కూడ అంతే. డబ్బు సంగతి ఇక చెప్పనక్కర లేదు. గాని ఒకని ఆత్మయొక్క విలువ మాత్రం, నిన్న, నేడు, నిరంతరం ఒకేలాగుండును.

ఒకని ఆత్మను, లేక ప్రాణాన్ని మనం కంటితో చూడలేనంత మాత్రమున దాని విలువ తగ్గిపోదు. "ఏలయనగా దృశ్యమైనవి అనిత్యములు, అదృశ్యమైనవి, నిత్యములు" (2 కొరింథీ 4:18). సంతోషము, దుఃఖము, బాధ, విద్యుచ్ఛక్తి మొదలైనవి అదృశ్యములు, గాని వాటి రుజువుల వలన దృశ్యముల వలె అవి వాస్తవములు.

2. ఈ ప్రశ్నను బట్టి ఒకడు తన ఆత్మను పోగొట్టుకొనగలడని రుజువగుచున్నది.

ఈ లోకస్థులలో అనేక మంది యొక్క గతి అంతే (మత్తయి 7:13-14). ఆత్మను నశింపచేయుశక్తి పాపమునకున్నది (మత్త 9:34). ఒకని ఆత్మ నశించితే, అది ఆ వ్యక్తి యొక్క స్వంత నిర్ణయమే దానికికారణం (అపొ.కా. 13:46).

మనుష్యుడు తన ఆత్మకు బదులుగా వేరొకదానిని కాంక్షించే ప్రమాదమున్నది.

ఒక మనుష్యుడు తన ప్రాణమునకు ప్రతిగా ఏమి ఇయ్యగలడు? అని యేసు ప్రశ్నించారు (మార్కు 8:37). ఇట్టి ప్రమాదమును గూర్చి యేసు తరచు హెచ్చరించారు (మార్కు 10:28). తమ ప్రాణముకు ప్రతిగా మనుష్యులు ఇచ్చే

కొన్ని సంగతులు దిగువనీయబడినవి.

**1. అనుదిన చర్యల కొరకు విపరీతమైన ఆసక్తి:-** తీరికలేదు, కొందరు జీవనోపాధి కొరకు తీరిక లేక పనిచేస్తారు. గృహ వ్యవహారాల్లో తీరిక లేక బైబిలు చదువరు, ఆరాధనకు వెళ్ళరు. దేవుని సేవ చేయరు. వారు మార్తవలె విస్తారమైన పనులు పెట్టుకుంటారు. మరియ వలె కొందరు మాత్రమే యుంటారు. "మరియ ఉత్తమమైన దానిని ఏర్పరచుకొనెను. అది ఆమె యొద్దనుండి తీసివేయబడదు" (లూకా 10:42). పరిశుద్ధునిగా యుండుటకు సమయము వెచ్చించు.

**2. దుష్టసాంగత్యము:-** సాంగత్యము యొక్క ప్రభావమునుండి మనము తొలగిపోలేము. (1కొరింథీ 15:33). పులిసిన పిండి కొంచెమైనను ముద్దంతయు పులిజేయునని మీరెరుగరా? (1 కొరింథీ 5:6). నీవు మేకలతో సహవాసము చేస్తే వాటివలె కంపుకొట్టుట తథ్యము.

**3. అబద్ధ బోధ :-** మానవుని ఆరాధన అబద్ధ బోధవలన వ్యర్థమగును (మత్త 15:9) యితర సువార్త ఏదయినను మనలను శాపముకు గురిచేయును (గలతీ 1:8:9). అబద్ధబోధలను ప్రోత్సహించుటే అపవాది యొక్క రహస్య ఎజెండా.

**4. పాప జీవితము** (యోహాను 3:19). అల్పకాలమందు పాపభోగమును గూర్చి బైబిలు చెబుతుంది (హెబ్రీ 11:25). పాపభోగము అమితానందమే గాని అది క్షణభంగురమే. అనేకులు తాత్కాలిక భోగము కొరకు పాపములో పడుచున్నారు.

**5. సుఖజీవితము.** దేవుని సేవచేయాలంటే మనం కొంత వెచ్చించాలి. ఎవడైనను నన్ను వెంబడింపగోరిన యెడల తన్ను తాను ఉపేక్షించుకొని తన సిలువ నెత్తుకొని నన్ను వెంబడింపవలెను అని యేసు చెప్పెను (మత్త 16:24). గాని అనేకులకు యిది ఇష్టముండదు. మనం గొప్ప సుఖయుగంలో జీవించుచున్నాము. కష్టపడి జీవించుట మరచిపోయాము.

**మనుష్యుడు సమస్తాన్ని కలిగియుండలేడు.**

అతడొక దాన్ని సంపాదిస్తే ఇంకొకదాన్ని పోగొట్టుకొంటాడు. యిట్టి మార్పులనుండి తప్పించుకోలేము. ఒక మనుష్యుడు తన ప్రాణమునకు ప్రతిగా ఏమి యివ్వగలడు. అని యేసు అడిగారు (మత్త 8:37). మనుష్యుడు ఇప్పుడు పాపములో జీవించి తదువరి పరలోకమును పొందలేడు (కీర్తన 1:4,5). అతడు శరీరానుసారముగా విత్తి నిత్యజీవమును కోయలేడు. "తన శరీరేచ్ఛలను బట్టి విత్తువాడు తన శరీరమునుండి క్షయమను పంట

కోయును, ఆత్మనుబట్టి విత్తువాడు ఆత్మనుండి నిత్యజీవమును పంట కోయును" (గలతీ 6:8) పాపము కావాలంటే పరలోకమును త్యాగం చేయాలి. పరలోకం కావాలంటే పాపాన్ని త్యజించాలి. మనుష్యుడు ఈ రెండూ కలిగియుండలేదు.

జ్ఞానియైనవాడు తనకు కలిగిన దంతయు అమ్మి పరలోకమును సంపాదించుకొన జూచును (మత్త 13:45, 46).

## మనుష్యుని ఆత్మ పోగొట్టుకొంటే ఘోరనష్టము:

అంతకంటే తక్కువ దేదిపోయినా నష్టమే. గాని ఒకడు ఈలోకమునంతయు సంపాదించుకొని తన ప్రాణమును పోగొట్టుకుంటే అతనికేమి ప్రయోజనము? రుచిగల ఆహారపదార్థములను భుజించుటకు కావలసినంత ధనము కలిగియున్నను వాటిని తినుటకు ఆరోగ్యము లేకపోతే యేమి ప్రయోజనము? గొప్ప విలువైన కారును కొనుగోలు చేసి దానిలో ప్రయాణం చేయలేకపోతే యేమి ప్రయోజనము? గాని వీటన్నిటికంటే కావలసినంత ధనాన్ని సమకూర్చుకొని ఒకడు తన ఆత్మను పోగొట్టుకొంటే, అది అన్నిటికన్నా ఘోర నష్టము.

ఆత్మనాశనమయితే అది రెండు విధములైన నష్టము. తదనంతరము పరలోకము నష్టపోవును (ప్రక 21:27), ఇప్పుడు ఇహలోకమందు అనేక ఆశీర్వాదములు నష్టపోవుట, తన ఆత్మను పోగొట్టుకొనినవాడు ఈలోకంలో అనేక ఆత్మీయాశీర్వాదములు కోల్పోవును, గొప్ప సంతోషము కోల్పోవును (అపొ.కా. 8:39, కీర్తన 144:15), మనోహరమైన పలుకుబడి కోల్పోవును (ప్రక 14:13), క్రైస్తవుల సహవాసము కోల్పోవును (ఫిలి 1:21). యిట్టి నష్టములను పూడ్చగలిగేది యేదీ లేదు.

మనుష్యుని ఆత్మయొక్క విలువ దేవుని ప్రేమలో కనబడుచున్నది (రోమా 5:8). క్రీస్తు దానికొరకు చనిపోయారు (1 కొరి 15:3). ఆత్మకొరకు యేసు పరలోకాన్ని సిద్ధపరచుచున్నారు (1 యోహా 14: 1-4).

ఆత్మ నిత్యము వుండునది. "భూమి మీద మనగుడారమైన యీ నివాసము శిధిలమైపోయినను, చేతి పనికాక దేవుని చేత కట్టబడినదియు, నిత్యమైనదియునైన నివాసము పరలోకమందు మనకున్నదని యెరుగుదుము" (2 కొరింథీ 5:1). "మన్నయినది వెనుకటివలెనే మరల భూమికి చేరును, ఆత్మ దాని దయచేసిన దేవునియొద్దకు మరల పోవును (ప్రసంగి 12:7).

ఈ భూమిపై నీ జీవితం అంతమయ్యే సరికి నీ ఆత్మ ఎక్కడికి పోవును?

– లీరోయ్ బ్రౌన్లో

# రాజైన మనష్షే
# (King Manasseh)

*-Royce Frederick*



హిజ్కియా కుమారుడైన మనష్షే యూదా దేశమును పాలించుటకు క్రీ॥పూ॥ 690లో ప్రారంభించెను. అప్పటికి అతని వయస్సు 12 సంవత్సర ములై యుండెను. సాధారణంగా ఆవయస్సులో యున్న బాలుడు గొప్ప బాధ్యతను వహించుటకు సిద్ధముగా యుండడు. అయితే మనష్షే యొక్క మనుమడగు యోషీయా 8 సంవత్సర ముల వయస్సునందే రాజై మంచిగా పాలించెను. మంచి రాజాయెను. గాని మనష్షే అయితే జ్ఞానమును, నీతిని అనుసరించుటకు నిరాకరించెను.

## మనష్షే యొక్క దుర్మార్గత

యెరూషలేములో మనష్షే 5 సంవత్సరములు పాలించెను. అతని పాలన కాల మంతయు దుష్టత్వముతో నిండియుండెను. "అతడు యెహోవా దృష్టికి చెడుతనము జరిగించుచు ఇశ్రాయేలీయుల యెదుట నిలువకుండ యెహోవా వెళ్ళగొట్టిన జనములు

చేసినట్టు హేయక్రియలు చేయుచు వచ్చెను. "ఇశ్రాయేలీయుల యెదట నిలువకుండ యెహోవా లయము చేసిన జనములు జరిగించిన చెడుతనమును మించిన చెడుతనమును చేయునట్లు మనష్షే వారిని రేపెను" (2 రాజులు 21:2,9) అతడు "తన తండ్రియైన హిజ్కియా పడగొట్టిన ఉన్నత స్థలములను అతడు తిరిగి కట్టించి బయలుదేవతకు బలిపీఠములు కట్టించి ఇశ్రాయేలు రాజైన ఆహాబు చేసినట్లు దేవతాస్థంభములు చేయించి నక్షత్రములకు మ్రొక్కి వాటిని పూజించుచుండెను. "అతడు తన కుమారుని అగ్నిగుండము దాటించి జ్యోతిషములను శకునములను వాడుక చేసి, యక్షిణి గాండ్రతోను, సోదెగాండ్రతోను సాంగత్యము చేసెను. ఈ ప్రకారము అతడు యెహోవా దృష్టికి బహుగా చెడుతనము జరించుచు ఆయనకు కోపము పుట్టించెను. యెహోవా దావీదునకును అతని కుమారుడైన సొలొమోనుకును ఆజ్ఞఇచ్చి ఈ మందిరమును ఇశ్రాయేలు గోత్ర స్థానములలో నుండి నేను కోరుకొనిన యెరూషలేము నందు నా నామము సదాకాలము ఉంచుమని సెలవిచ్చిన యెహోవా మందిరమందు తాను చేయించిన అషేరా ప్రతిమను ఉంచెను (2 రాజులు 21:3, 6-7). ఇవన్నియు మోషే ధర్మశాస్త్రమునకు వ్యతిరేకమైన చర్యలే.

సజీవుడైన దేవుని ఆరాధించుటను అతడు విరమించుట యేగాక అతడు తన ప్రజల యెడల చాల క్రూరముగా ప్రవర్తించాడు. "మరియు మనష్షే యెహోవా దృష్టికి చెడుతనము చేసి యూదా వారిని పాపములో దింపినదిగాక యెరూషలేము ఈ కొననుండి ఆ కొన వరకు రక్తముతో నిండునట్లు నిరపరాధుల రక్తము ఒలికించెను (2 రాజులు 21:16).

అటు తరువాత యూదా నాశనమగుటకు మనష్షే గొప్పకారకుడయ్యాడు. "యూదా రాజైన మనష్షే ఈ హేయమైన కార్యములు చేసి తనకు ముందున్న అమోరీయులను మించిన చెడునతడు కనబరిచి తాను పెట్టుకొనిన విగ్రహముల వలన యూదా వారు పాపము చేయుటకు కారకుడాయెను. కావున ఇశ్రాయేలీయుల దేవుడైన యెహోవా సెలవిచ్చునదేమనగా వినువారి రెండు చెవులు గింగురుమనునంత కీడు యెరూషలేము మీదకిని యూదా వారి మీదికిని రప్పించుచు నేను షోమ్రోనును కొలిచిన నూలును ఆహాబు కుటుంబీకులను సరిచూచిన మట్టపు గుండును యెరూషలేము మీదికి సాగలాగుదును. ఒకడు పళ్ళెమును తుడుచునప్పుడు దాని బోర్లించి తుడుచునట్లు నేను యెరూషలేమును తుడిచి వేయుదును (2 రాజులు 21:11-13).

అట్లయినను రాజైన మనష్షే యొక్క అంత్యక్రియలు ఘనముగానే నిర్వహించబడినట్లు 2 రాజులు 21:18ని బట్టి మనము తెలిసికొనగలము. "మనష్షే తన పితరులతో కూడ నిద్రించి ఉజ్జా యొక్క తోటలో తన నగరు దగ్గర సమాధి చేయబడెను. అతని కుమారుడైన ఆమోను అతనికి మారుగా రాజాయెను.

(2 రాజులు 21:18).

## మారు మనస్సు పొందిన మనష్షే

తన దుష్కార్యములను బట్టి మనష్షే మారుమనస్సునొందెను. అతడు మరణించిన తరువాత మారు మనస్సునొందెనా? కానే కాదు. అది అసాధ్యము. ఏలయనగా "మనుష్యులొక్కసారే మృతినొందవలెనని నియమింపబడెను. ఆ తరువాత తీర్పు జరుగును" (హెబ్రీ 9:27). ప్రతి మనుష్యుడు ఈ భూమిపై ఒక్కసారే జీవించును. మరణించును. మనం మరణించిన తరువాత మారు మనస్సును, పాపక్షమాపణ నొందుటకు వున్న తరుణము లేమీ వుండవు. ఈ లోకంలో బ్రతికియున్నప్పుడే మనం నిత్యగమ్యాన్ని ఎంచుకోవాలి.

మనష్షేయొక్క మారుమనస్సును గూర్చి 2వ రాజుల గ్రంథములో వ్రాయబడలేదు గాని 2వ దినవృత్తాంతముల గ్రంథములో ఇట్లున్నది "యెహోవా మనష్షేకును అతని ప్రజలకును వర్తమానములు పంపినను వారు చెవి యొగ్గకపోయిరి. కాబట్టి యెహోవా అష్షూరు రాజుయొక్క సైన్యాధిపతులను వారిమీదికి రప్పించెను. మనష్షే తప్పించుకొని పోకుండ వారతని పట్టుకొని, గొలుసులతో బంధించి అతనిని బబులోనునకు తీసుకొని పోయిరి. అతడు శ్రమలో ఉన్నప్పుడు తన దేవుడైన యెహోవాను బ్రతిమలాడుకొని తన పితరుల దేవుని సన్నిధిని తన్ను తాను బహుగా తగ్గించుకొని ఆయనకు మొరలిడగా ఆయన అతని విన్నపముల నంగీకరించి యెరూషలేమునకు అతని రాజ్యములోనికి అతని తిరిగి తీసుకొని వచ్చినప్పుడు యెహెూవా దేవుడై యున్నాడని మనష్షే తెలిసికొనెను (2 దినవృ 33:10-11). అమోరీయులు తమ బందీల ముక్కులకు కొక్కెనములను తగిలించి లాగుకొనిపోయెడివారు.

బబులోనులో బందీగా యుండి శ్రమలు పెట్టబడుచున్నప్పుడు మనష్షే తన పూర్వీకుడైన సొలొమోను వ్రాసిన పాఠమును నేర్చుకొన్నాడు. 'విశ్వాసఘాతకుల మార్గము కష్టము" (సామెతలు 13:15), మారుమనస్సు నొందాడు.

తన వంకరమార్గములను సరిజేసుకొనుటకు మనష్షే పనిచేయ మొదలు పెట్టాడు. అతడు దావీదుపురము యొక్క బయటగోడలును కట్టించాడు. బలమైన సేనాధిపతులను నియమించాడు. యూదా దేశమును బలిష్టముగా చేయసాగాడు (2 దినవృ 33:14). అతడు వింత దేవతలను తీసివేసాడు. తాను కట్టించిన బలిపీఠము లన్నిటిని తీసి పట్టణము బయటకి వాటిని లాగివేయించాడు. యెరూషలేము దేవాలయములో తాను నియమించిన విగ్రహమును తీసివేసాడు. బలిపీఠములను పడగొట్టాడు (33:15). "ఇదియుగాక అతడు యెహెూవా బలిపీఠము బాగుచేసి దానిమీద సమాధాన బలులను కృతజ్ఞతార్పణలను అర్పించుడని యూదా వారికి ఆజ్ఞ యిచ్చెను (33:16). యివి నిజమైన మారుమనస్సు

యొక్క ఫలములు.

మనష్షే తన జీవితమును నిజముగా మార్చుకొన్నాడు. అయితే తాను చేసిన కీడంతటిని అతడెన్నడు నిర్మూలించ లేకపోయాడు. అతని కుమారుడైన ఆమోను తన తండ్రియొక్క దుర్మార్గతను మరింత కొనసాగించాడు. అతని సంస్క రణలను అనుసరించలేదు. "ఆమోను ఏల నారంభించినప్పుడు ఇరువది రెండేండ్లవాడై యెరూషలేములో రెండు సంవత్సరములు ఏలెను. అతడు తన తండ్రియైన మనష్షే నడిచినట్లు యెహోవా దృష్టికి చెడునడత నడిచెను. తన తండ్రి యైన మనష్షే చేయించిన చెక్కుడు విగ్రహములన్నింటికి బలులు అర్పిం చుచూ పూజించెను. తన తండ్రియైన మనష్షే గుణపడినట్లు యెహోవా సన్నిధిని పశ్చాత్తాప్తుడు కాకను, గుణపడకను ఈ ఆమోను అంతకంతకు ఎక్కువ ద్రోహ కార్యములను చేయుచు వచ్చెను (2 దినవృ 33:21-23).

యూదాదేశము తక్షణమే పతనమై పోలేదు కాని ఆ దేశము యొక్క ఆత్మీయ పునాదులకు మనష్షే ఘోరమైన రీతిగా హానిచేసెను. ప్రవక్తయైన యిర్మియా ఇట్లు వ్రాసాడు. "అప్పుడు యెహోవా నా కీలాగు సెలవిచ్చెను - మోషేయు సమూయేలును నా యెదుట నిలబడినను ఈ ప్రజలను అంగీకరించుటకు నాకు మనస్సుండదు, నా సన్నిధిని ఉండకుండ వారిని వెళ్ళగొట్టుము - యూదా రాజైన హిజ్కియా కుమారుడగు మనష్షే యెరూషలేములో చేసిన క్రియ లన్నింటిని బట్టి భూమి మీదనున్న సకల రాజ్యముల లోనికి యిటు అటు చెదరగొట్ట బడినట్టు వారిని అప్పగించుచున్నాను" (యిర్మియా 15:1,4), యెరూషలేమును, యూదాయు క్రీ॥పూ॥ 586లో పతన మయ్యెను. నిజముగా "ఒక పాపాత్ముడు అనేకమైన మంచిపనులను చెరుపును" (ప్రసంగి 9:18).

## క్రియలకు పర్యవసానముండును

"మోసపోకుడి, దేవుడు వెక్కిరింప బడడు. మనుష్యుడు యేమి విత్తునో ఆ పంటనే కోయును. ఏలాగనగా తన శరీరేచ్ఛలను బట్టి విత్తువాడు తన శరీరమునుండి క్షయమను పంట కోయును, ఆత్మను బట్టి విత్తువాడు ఆత్మనుండి నిత్యజీవమను పంట కోయును" (గలతీ 6:7-8). విత్తడం కోయడమును గూర్చిన సూత్రములో భౌతిక, నైతిక ఆత్మీయ భాగములున్నవి. మరియు మనము ప్రభావితముచేయు వారందరు ఆ సూత్రములో ఇమడ్చబడి యున్నారు. సాధారణంగా మనం ఎక్కువ ప్రేమించే వ్యక్తులపైనే మన జీవిత ప్రభావముండును.

## మనష్షేనుండి మనకు పాఠములు

మనష్షే జీవితమునుండి మనం యేమి నేర్చుకొనగలము? మన పాపములను గూర్చి నిత్యము మనం అపరాధులముగా యుండనక్కర్లేదని అతని జీవితం మనకు నేర్పుచున్నది.

ఒకడు యేసు ప్రభువు నందు విశ్వాస ముంచి, పాపముల విషయమై మారు మనస్సు పొంది, పాపక్షమాపణ నిమిత్తము బాప్తిస్మము పొందగా దేవుడతని గత పాపములన్నిటిని క్షమించును (మార్కు 16:16; అపొ.కా. 2:38; 8:35-39; 22:16; గలతీ 3:26,27). ఎంత ఘోరపాపినైనను ప్రభువు క్షమించును.

"అన్యాయస్థులు దేవుని రాజ్యమునకు వారసులు కానేరరని మీకు తెలియదా? మోసపోకుడి. జారులైనను విగ్రహారాధకులైనను, వ్యభిచారులైనను, ఆడంగితనము గలవారైనను, పురుషసంయోగులైనను, దొంగలైనను, లోభులైనను, త్రాగుబోతులైనను, దూషకులైనను, దోచుకొనువారైనను దేవుని రాజ్యమునకు వారసులు కానేరరు. మీలో కొందరు అట్టివారై యుంటిరి గాని ప్రభువైన యేసుక్రీస్తు నామమునను, మన దేవుని ఆత్మ యందును మీరు కడుగబడి పరిశుద్ధ పరచబడిన వారై నీతిమంతులుగా తీర్చబడితిరి (1 కొరింథీ 6:9-11).

మరల పౌలు ఇట్లు చెప్పుచున్నాడు. "పూర్వము దూషకుడను, హింసకుడను, హానికరుడనైన నన్ను తన పరిచర్యకు నియమించి నమ్మకమైనవానిగా ఎంచి నందుకు నన్ను బలపరచిన మన ప్రభువైన క్రీస్తు యేసుకు కృతజ్ఞుడనై యున్నాను. తెలియక అవిశ్వాసము వలన చేసితిని గనుక కనికరింపడితిని. మరియు మన ప్రభువు యొక్క కృపయు క్రీస్తు యేసునందున్న విశ్వాసమును ప్రేమయు అత్యధికముగా విస్తరించెను. పాపులను రక్షించుటకు క్రీస్తు యేసు లోకమునకు వచ్చెనను వాక్యము నమ్మ తగినదియు పూర్ణాంగీకారమునకు యోగ్యమైనదియునైయున్నది. అట్టి వారిలో నేను ప్రధానుడను. అయినను నిత్యజీవము నిమిత్తము తనను విశ్వసింపబోవు వారికి నేను మాదిరిగా ఉండులాగున యేసు క్రీస్తు తన పూర్ణమైన దీర్ఘశాంతమును ఆ ప్రధాన పాపినైన నాయందు కనపరచునట్టు నేను కనికరింపబడితిని (1తిమోతి 1:13-16).

ప్రభువునకు విధేయత చూపుటకు ఆలస్యము చేయకూడదు. మారుమనస్సు పొందుటకు ఆలస్యము చేసేకొలది మన ఆత్మలకు సంభవించే ప్రమాదము ఎక్కువగుచుండును గనుక నీ బాల్య దినముల యందే నీ సృష్టికర్తను స్మరణకు తెచ్చుకొనుము (ప్రసంగి 12:1). మన పాపముల పర్యవసానమును మనము తొలగించలేము. గాని ఎక్కువ హాని, ఎక్కువ దుఃఖము కలుగకుండ చూడ గలము. గనుక దేవుని చిత్తమునకు నేడే మనము లోబడవలెను. మరియు క్రీస్తు యేసునందు దేవుని ఉన్నతమైన పిలుపునకు కలుగు బహుమానము కొరకు ఎదురుచూచుచు పరుగెత్తవలెను. (ఫిలిప్పీ 3:14)

- రోయస్ ఫ్రెడరిక్

# సత్యమా, వెర్రితనమా?

## (Truth or Madness?)

***- Maxie Boren***

రోమా గవర్నరయిన ఫేస్తు పౌలును వెర్రివాడని నిందించి నప్పుడు, "పౌలు ఇట్లనెను - మహాఘనత వహించిన ఫేస్తు, నేను వెర్రివాడను కానుగాని సత్యమును స్వస్థబుద్ధియు గలమాటలనే చెప్పుచున్నాను" (అపో.కా. 26:25). నిజానికి పౌలు వెర్రివాడు కాదు, పిచ్చివాడు కాదు గాని అతడు చెప్పుచున్న సత్యమును నిరాకరించు వారే వెర్రివారు!

నేడు కూడా అట్లేయున్నది, దేవుని యందు విశ్వాసముంచు వారు, బైబిలు దేవుని వాక్యమని నమ్మువారు ఆది కాండములోని దేవుని సృష్టిక్రమ మును నమ్మువారు, విశ్వాసుల ఐక్యతను నమ్మువారు, క్రొత్త నిబంధన రక్షణ మార్గమును నమ్మువారు (రోమా 1:16 మార్కు 16:16 అపో.కా. 2:38), క్రొత్త నిబంధన ప్రకారము నైతిక సద్వర్తనము కలిగి జీవించువారు వెర్రివారని ఈ లోకస్థులు తలస్తారు. నిజానికి సత్యాన్ని గ్రహించకయున్న ఈ లోకమే వెర్రిదై యున్నది. అసత్యాన్ని ఎక్కువమంది అంత తొందరగా ఎందుకు అంగీకరిస్తారో నాకు తెలియదు. అది అట్లు ఎందుకు న్నదో నేను గ్రహింపలేకయున్నాను, ప్రతివాడు తన ఆత్మరక్షణార్థమైన సత్యమును తెలిసికొనుటకు ఆసక్తికలిగి యుంటారని నేననుకొంటాను. మరణానంతరము తమ ఆత్మల నిత్య స్థావరమును గూర్చి వారు ఆసక్తి కలిగియుంటారని నేను తలుస్తాను. గాని విచారం యేమంటే అసత్యాన్నే నమ్ముటకు ఈలోకం అంత ఆసక్తి కలిగి యున్నది (2 థెస్స 2:1-12 చదువుము). కావాలంటే ఈ లోకం మనలను వెర్రివారని పిలువనీ యండి, అబద్ధికులు అబద్ధ బోధకులు వారి కిష్టమొచ్చినట్లు వాగ వచ్చును. అయితే సత్యము సత్యమే, యోగ్యమైన మంచి మనస్సు గల వారందరు సత్యాన్ని గ్రహించగలరు. అంగీకరించగలరు. అట్టివారు నీతి కొరకు ఆకలి దప్పికలు గలవారు (మత్తయి 5:6). సంఘము సత్యముకు స్థంభమును దాని ఆధారమును గనుక (1 తిమో 3:15), ప్రభువు యొక్క నిజ సంఘము ఎల్లవేళలా సత్యమునే ప్రకటించును. అసత్యముతో అదెన్నడు రాజీపడదు! సత్యము ప్రత్యేకమైనది, ఎల్లవేళలా ప్రత్యేకమైనది.

మానవ కల్పిత జ్ఞానములో యున్న వెర్రితనమును మనము నిరాకరించి దేవుని సత్యవాక్యమునకు ఎల్లవేళలా హత్తుకొని యుండాలి. సత్యవాక్యాన్ని ధైర్యముగా ప్రకటించాలి, ప్రేమతో ప్రకటించాలి! - మేక్సీ బోరెన్